ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org


# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 4 | సంచిక 1 జనవరి–మార్చి 2024

మమత-సమత-మానవత
www.gurajada.org

## మన గణతంత్ర ఘనత



ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక


సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

మమత-సమత-మానవత
www.gurajada.org



## మనవి

ప్రక్కన చూపిన ప్రకటన 1940 లో భారతి పత్రికలో పత్రిక యాజమాన్యం ఇచ్చిన ప్రకటన. 2021 లో, ప్రకాశిక పత్రిక కూడా ఈ ప్రకటనలో ఆశించిన స్వభావం గల రచనలను ఆహ్వానిస్తోంది. కాలం మారింది, సమస్యల స్వరూపం మారింది. కానీ, సమాజ శ్రేయస్సుకి ఉపయోగపడే సాహిత్య అవసరం మాత్రం ఇంకా ఉంది. చాలా ఉంది. మీలో ఉన్న గురజాడ తత్వాన్ని, చైతన్యాన్ని తట్టి లేపండి. మంచి రచనలు మాకు పంపండి.



వ్యాసలేఖకులకు మనవి

Connect with us On Facebook : https://www.facebook.com/Prakasika1
Join us Via Telegram Prakasika telegram link : https://t.me/joinchat/SlYqileFRFSJ_zi_
Contact us: editor@prakasika.org

## సంపాదక వర్గం



కీ.శే. శ్రీ గురజాడ అప్పారావు
వ్యవస్థాపక సంపాదకులు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు

ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు
వరిష్ట సంపాదకులు

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
సంపాదకులు

డా. సుంకర గోపాలయ్య
సంపాదకులు

శ్రీ మండలి బుద్ధప్రసాద్
ప్రధాన సలహాదారు

సలహాదారులు
డా. వి.ఆర్. రాసాని
శ్రీ విహారి
శ్రీ గురజాడ రవీంద్రుడు
శ్రీమతి అరుణ గురజాడ

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
www.prakasika.org
editor@prakasika.org

— సంపాదకీయం —

# మన గణతంత్ర ఘనత

1947 లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన ఇండియా, (భారత్) 1950 జనవరిలో, స్వంత రాజ్యాంగంతో గణతంత్ర రాజ్యంగా అవతరించి ప్రపంచ పటంలో చేరింది. ఎందరో ప్రతిభావంతులైన వారి ఆలోచన, ఆదర్శ భావాల దర్పణమే భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కుల, ఆదేశ సూత్రాల, నియమాల స్వరూపం. రాజ్యాంగ స్ఫూర్తిని సమగ్రంగా, సంక్షిప్తంగా, భారత ప్రజల తరపున, వివరిస్తూ రూపొందించబడిన భారత రాజ్యాంగ పీఠిక దేశ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే భావ సూచిక. సుమారు రెండున్నర శతాబ్దాల వీదేశీ పాలనలో భావ దాస్యానికి అలవడ్డ భారత జాతి తనదైన గళాన్ని, తనదైన వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి ఆవిష్కరించే ప్రయత్నానికి ప్రతీక భారత రాజ్యాంగ రూపకల్పన. మంచి చెడుల మేలు కలయిక గా భారత రాజ్యాంగం రూపు దిద్దుకుంది; లిఖిత రాజ్యాంగమైన అమెరికా రాజ్యాంగంలోని మంచి అంశాలను, మౌఖిక రాజ్యాంగమైన బ్రిటిష్ రాజ్యాంగాన్ని అనుసరించి నవ భారత ప్రజల భవిష్యత్ కు బాటలు వేసే ప్రజాస్వామ్య రాజ్యంగా మనుగడ సాగించడానికి మార్గ దర్శనం చేసే రాజ్యాంగాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు రూపొందించారు.

కాలానుగుణంగా సవరణలు చేసుకోవడానికి వీలైన సదుపాయం మన రాజ్యాంగంలో కల్పించారు; ఇప్పటికీ 106 సవరణలు జరిగాయి.

సాధారణ సవరణలు పార్లమెంట్ లోని ఉభయ సభల సభ్యుల ఆమోదంతో జరుగుతాయి. రాజ్యాంగంలోని 368 అధికరణంలోని అంశాలకు సంబంధించిన సవరణాలకు మాత్రమే సగానికి తక్కువ కాకుండా రాష్ట్రాలు ఆమోదించాలి. అలాంటి సవరణలు ఇప్పటికీ 42 మాత్రమే జరిగాయి. పురాతన ప్రజాస్వామ్య దేశమైన అమెరికాలో రాజ్యాంగ సవరణ అంత సులభం కాదు. ఆ దేశ కాంగ్రెస్ లోని ఉభయ సభలలోని మూడింతలలో రెండింతల సభ్యులు ఆమోదించాక, ఆ సవరణ ప్రతిపాదనను రాష్ట్రాలు ఆమోదించాలి. పర్యవసానంగా అమెరికన్ రాజ్యాంగానికి 250 సంవత్సరాలలో 27 సవరణలు మాత్రమే జరిగాయి. భారత దేశంలో, రాజ్యాంగ సవరణలలో రాష్ట్రాలకి తగిన ప్రాతినిధ్యం లేకపోవడం అభిలషణీయం కాదు. రాష్ట్రాలు లేని కేంద్రం లేదు. కేంద్రం చేసే సవరణలు రాష్ట్రాలకి వర్తించడమే కాక, రాష్ట్రాలలోనే అమలు అవుతాయి. రాజ్యాంగ సవరణలలో రాష్ట్రాలకి తగిన ప్రాతినిధ్యం అవసరం.

సమగ్ర, విస్తృత చర్చలు జరగకుండా పార్లమెంట్లో మూజువాణి ఓటుతో ఆమోదించబడుతున్న చట్టాలు, రాజ్యాంగ సవరణల ప్రక్రియ ఆరోగ్యకరం కాదు అన్నది అందరికీ తెలుసు. కానీ ఆ అవాంఛనీయ సంప్రదాయాన్ని ఆపే ప్రయత్నం జరగడం లేదు. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ చేసే చట్టాలు ప్రజల అవసరాలు తీర్చే మేరకు జరగాలి.

రాజ్యాంగానికి లోబడి, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పాలన జరగాలన్నది రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్ష, ఆలోచన. అందుకు అనుగుణంగా పారదర్శకంగా, ప్రభుత్వ ఒత్తిళ్లకు లోబడనవసరం లేని వ్యవస్థల ఏర్పాటు చేయడం జరిగింది. మన పెద్దలు మంచి ఆశయాలకు అనుగుణంగా నిర్మించినది మన రాజ్యాంగం. కానీ, చట్టాలు చేసే చట్ట సభల సభ్యులు ఎంతమంది ప్రజల ఆకాంక్షలను తెలుసుకుని ఓటు వేస్తున్నారు? పార్టీ ఆదేశానికి అనుగుణంగా జారీ అయ్యే విప్ కి లోబడి సభ్యులు ఓటు వేస్తే సభ్యుల వ్యక్తిగత ఆలోచనలు, ప్రజల ఆకాంక్షలు చట్టాల్లో ఎలా ప్రతిబింబిస్తాయి ? కీలక చట్టాలు తెచ్చేటప్పుడు నియోజక వర్గాల వారీగా ప్రజల అభిప్రాయాలని సేకరించే ప్రక్రియ చాలా అవసరం. సాంకేతిక ప్రగతి సాధించిన దేశంలో సమగ్ర ప్రక్రియల రూపకల్పన కష్టం కాదు.


స్వాతంత్ర్యం వచ్చాక భారత దేశం లో జరిగిన అభివృద్ధి గణనీయమైనది. కానీ, ఇప్పుడు మనం చూస్తున్న పరిణామాలు అభివృద్ధి కొద్దిమందికి మాత్రమే పరిమితమైనది అనిపిస్తోంది. ఆందోళన కలిగించే విషయం ఏమంటే, ధనిక, పేద వర్గాల మధ్య అంతరం పెరుగుతోంది. పర్యవసానంగా, మధ్య తరగతి కనుమరుగయ్యే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంది. అగ్ర రాజ్యం అయిన అమెరికాలో ఈ పరిస్థితి ఇప్పటికే గోచరమవుతోంది. ధనికులను మరింత ధనికులుగాను, పేదలను మరింత పేదలుగాను మార్చే ఆర్థిక వ్యవస్థ సమాజ ఆరోగ్యానికి మంచిది కాదు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలలో భారత దేశం మిశ్రమ ఆర్థిక విధానాన్ని ఎంచుకుంది. భారత దేశంలో ఉన్న ప్రజల స్థితిగతులను అనుసరించి ఈ విధానం అప్పటికీ, ఇప్పటికీ అవసరం, అనుసరణీయం. దశాబ్దాలుగా మనుగడ సాగిస్తూ, ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకి ఊతమిస్తున్న సంస్థలని కొందరు ప్రైవేటు వ్యక్తుల పరం చేసే ప్రయత్నం అవాంఛనీయం; దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థకి హానికరం.

ప్రపంచ ఆర్థిక, సామాజిక నేపధ్యం వేగంగా మారుతోంది. అగ్ర రాజ్యాలలో జరిగే మార్పులను తట్టుకుని నిలబడగల ఉద్యోగ అవకాశాల కల్పనకి అవసరమైన విధానాల రూపకల్పన అవసరం. గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణ హిత పరిశ్రమల స్థాపన అవసరం. గాంధీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా భారత దేశం అడుగులు వేస్తే, ప్రపంచానికి నాయకత్వం వహించే అవకాశం ఉంది. ఈ దిశగా భారత దేశం అడుగులు వేయాలంటే, అందరినీ కలుపుకుపోయే, నాయకత్వ లక్షణం ఉన్నవారు దేశానికి అవసరం, పార్టీలకు అతీతంగా.

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం

మన గణతంత్ర ఘనత




## లోపల

కర్మ యోగి, ధర్మ మూర్తి ........ 7
పిపీలికం ........ 10
బలహీనులు తిరుగబడితే...పిపీలికం కథ ........ 22
దళారి ........ 29
'దళారీ' దగా పిడికిళ్లలో రైతు జీవితం ........ 41
కోళ్ళ గుంపు ........ 49
ముక్కుపోగు ........ 59
తెలుగు కవిత్వ మాధురీ మధురిమ ........ 64
ఇల్లు ........ 70
భారత సంవిధాన నిర్మాణం, ఉనికి ........ 71
మాటల మబ్బులు ........ 80
గురజాడ వారి 'మాటలమబ్బులు' – అధికారుల స్వభావ చిత్రణ ........ 81
భారత రాజ్యాంగ శాసనాలు ........ 85
2008 వ సంవత్సరపు వైద్యశాస్త్ర నోబెల్ అంశం:
ఏడ్స్ (aids) కి కారణమైన వైరస్ పూర్వాపరాలు ........ 97

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

# కర్మ యోగి, ధర్మ మూర్తి



ఆచార్య గోపాలకృష్ణ కొవ్వలి

చాలామంది భగవద్గీత చదువుతారు. చాలా కొద్ది మంది అందులోని సారాన్ని ఆకళింపు చేసుకుంటారు. అతి కొద్దిమంది గీతలో స్తుతించిన వ్యక్తిత్వాన్ని స్వంతం చేసుకుంటారు. అలాంటి నరులలో అరుదైన సింహం, నరసింహారావు. ఎత్తు  అయిదు అడుగుల మూడంగుళాలు; వ్యక్తిత్వం హిమవత్ శిఖరం; సంఘంలో ఉంటూనే  నిస్సంగత్వమ్; తన సమాజ శ్రేయస్సుకు పనిచేస్తూనే ఏకాకి జీవితం. తామరాకు మీద నీటిబొట్టులాంటి తాత్వికత. కలుషిత చెరువునే సంస్కరించాలనే ఆలోచనా తపస్వి. నింద, స్తుతి పంకాలంటని అనింద్యానంద మూర్తి. భూకామందైనా భూమి వితరణ సౌభాగ్యశీలి. ఇన్ని చెప్పాక, ఇంత చెప్పాక నేను రాస్తున్న వారి గురించి మీకు అర్థమయ్యే ఉంటుంది. నవ భారత అర్థశాస్త్ర కోవిదుడు, భారత నవశక నిర్మాత, నరసింహారావు.  పాములపర్తి నరసింహారావు.

"కర్మ నిర్వాహణాయ సంభవామి యుగే  యుగే" అన్నట్లు భారతదేశం అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు వానప్రస్థంలో ఉన్న రావుగారు ఆయన నమ్మిన, ఆయన జీవితాంతం సేవ చేసిన పార్టీ అభ్యర్థన మేరకు ప్రధాని పదవిని చేపట్టారు. పైరవీలు లేవు, కుల సమీకరణ అర్హతలు లేవు. వర్గ, వర్ణ సమీకరణ అర్హతలూ లేవు. ఎలాంటి ఆశ గాని, వాంఛ గాని లేని, కరుడుగట్టిన కాంగ్రెస్ పార్టీ విధేయుడు అన్న అర్హత ప్రాతిపదికన నివురుగప్పిన ప్రతిభాగ్నికి ప్రధాని పదవి వరించింది. అందరికీ ఆమోద యోగ్యుడు, 'అణిగి మణిగి ఉండే మనిషి' అనే ముద్రబిళ్ళ  సాయంతో  ఒక "రాజకీయ సన్యాసి" భారత ప్రధాని అయ్యాక అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ పెద్ద మార్పులు వస్తాయని ఎవరూ నమ్మలేదు, ఊహించలేదు. అందరూ నరసింహారావును ఒక 'ఆపద్ధర్మ కీలుబొమ్మ' గా ఉంటారని ఊహించారు. హస్తినారణ్యంలో పాములపర్తి సింహం దేశ రక్షణార్థం జూలు విదిలించి, కార్యరంగంలోకి దూకి, ఆర్థిక సంస్కరణలు, రాజకీయ సంక్షోభాలు, విశ్వాస రాహిత్యాలు,



అవిశ్వాస తీర్మానాలు, అసమ్మతి సెగలూ, అంతర్గత బడబాగ్నిలూ, నిరసనలూ, నిర్లక్ష్యాలు, ఉపేక్షలూ... ఇలా అన్నింటినీ అధిగమించి భారత ధర్మాకృతిని చాటిన కర్మయోగి, భారత సింహం, నరసింహారావు. పి.వి. తరవాత వచ్చిన ప్రభుత్వాలన్నీ ఆయన వేసిన బలమైన పునాది మీద నడుస్తున్నాయనడం అతిశయోక్తి కాదు.

రాజీవ్ గాంధీ హత్య తర్వాత కాంగ్రెస్ పార్టీ అవసరాలు, దేశ అవసరాల ప్రాతిపదికన పి.వి. ప్రధాని అవడం అందరికీ తెలుసు. పి.వి. ప్రధానిగా ఉన్న కాలంలో ఎలాంటి వివాదలూ, కుంభకోణాలూ రాలేదు. ఎంత వేగంగా ఆర్థిక సంస్కరణలు జరిగినా ఏ 'దానీలు' లబ్ధిదారులుగా నిందింపబడలేదు. రామజన్మభూమి వివాదం మనిషిని నమ్మిన మంచి మనసున్న మనిషిగా, శ్రీరామ భక్తుడిలా పి. వి. భరించిన అపవాదు మాత్రమే. ఇంకొక వివాదం ఆయనని సుఖంగా మరణించకుండా చేసిన వివాదం అయినా అభియోగాలలో పస లేదని తెలిసినా ప్రతీకార భావంతో కొనసాగిన కేసు. మోసేవాడు లేకపోతే ఎంతగా అలంకరింపబడిన పల్లకి అయినా, అందులో ఎక్కినవాడు ఎంత ఉన్నత వంశ వ్యక్తి అయినా, పల్లకి, ఎక్కిన వాడూ వెలవెల బోతారు. పి.వికి తనని పొగిడి, మోసి, ప్రచారం చేసే అనుచరగణం లేదు. ఆయన వల్ల లబ్ధి పొందిన వారూ లేరు. పార్టీ యంత్రాంగమూ వెనక లేదు. హస్తినలో తుది శ్వాస విడిచినప్పుడు ఏ ప్రధానికి జరగని అవమానం జరిగింది. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' కి ప్రతినిధి అయిన పి.వి. కి ఇటాలియన్ కోడలు సంస్కారయుత సంస్మరణ స్థలం కేటాయింపుకి కాలొడ్డిందని వినికిడి.

నెహ్రూ, ఇందిర తర్వాత భారత దేశాన్ని అత్యంత ప్రగతిశీల పథంలో నడిపిన వ్యక్తికి దేశరాజధానిలో సంస్మరణ స్థలం నిరాకరించడం, రాజమర్యాదలతో సాగవలసిన స్వర్గారోహణ పర్వం రాజకీయ కుయుక్తులతో ముగియడం బాధ గానూ, ఆశ్చర్యంగానూ లేదూ!!

తెలుగు వారు దేశ అభివృద్ధికి ఎంత పాటుపడినా, ఎంత తోడ్పడినా వారికి తగిన ప్రతిఫలం దక్కడం అరుదు. పి.వి. తెలుగు వాడు అవటం తెలుగు వారి అదృష్టం అయితే, ఆయన తెలుగు వారిగా పుట్టడం ఆయనకి పెద్దగా కలిసొచ్చినట్టు లేదు! ఆయన తెలుగు వారి సొత్తు. ప్రాంతీయ తత్వ జ్వాలలని తట్టుకుని భారతమాత ముద్దు బిడ్డగా నిలబడ్డ పి.వి. తెలుగుబిడ్డ. ఆయన

సమైక్యవాది, దేశ సమైక్యాభిలాషి. వట్టిమాటలు కాక గట్టిమేల్ తలపెట్టిన గురజాడ స్ఫూర్తి రత్నం పి.వి. ఆయన ప్రధానిగా ఉన్న రోజుల్లో దేశ సమగ్రతకి భంగం కలిగేలా మారుతున్న పంజాబ్, కాశ్మీర్ రాజకీయ పరిస్థితులని చాకచక్యంగా, ఆర్భాటం లేకుండా పరిష్కరించిన తీరు అనితర సాధ్యం. పి.వి. జీవితం నాయకత్వ లక్షణాలు నేర్పే ఒక పాఠ్య గ్రంధం. ఆర్భాటాలూ, హడావిడీ లేకుండా దేశాన్ని ఎలా నడపాలో చూపిన చతురుడు పి.వి. దేశానికి ఇంత చేసినా ఎవరికీ పట్టని పి.వి! ఎంత ఆశ్చర్యం!!? జీవితాంతం పనిచేసిన పార్టీకి 'అంటరాని' వాడు, ఒక 'ప్రాంతానికి మాత్రమే' చెందినవాడు అయ్యాడు. 14 అంతర్జాతీయ భాషలని ఆపోసన పట్టిన తెలుగు తేజాన్ని కుత్సిత రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విస్మరించినా, మంచిని గుర్తించి పెంచే మనుషుల మనసుల్లో పి.వి. వేసిన ముద్ర శాశ్వతం. పి.వి. భరత మాత గర్వపడే జాతి రత్నం. భారత దేశ అభ్యున్నతికి అత్యంత దోహద పడడమే అర్హత అయితే భారత రత్న బిరుదుకి పి.వి.ని మించిన అర్హుడు లేడు. త్వరలో ఆయనకి 'భారత రత్న' బిరుదు దక్కాలని కోరుకుందాం.

### స్వీయ అనుభవం :

నేను పి.వి.గారి పేరు మొదట విన్నది ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ సమయంలో. అప్పుడు నేను ఏడవ తరగతి చదువుతున్నాను. ఆయన పేరు రాష్ట్రం అంతటా మారు మ్రోగేది. ఆ ఉద్యమ పర్యవసానంగా వెలసిన హైదరాబాదు కేంద్ర విశ్వ విద్యాలయంలో నేను M.Sc. పట్టా పుచ్చుకోవడం యాదృచ్ఛికం కావచ్చు కానీ, నా జీవితాన్ని మలుపు తిప్పిన పరిణామం. తరవాత, నేను ఢిల్లీ లో AIIMSలో నా Ph.D. పని నిమిత్తం ఒక రోజు నా విభాగానికి వెడుతున్నప్పుడు కలిగిన ఆయన ప్రత్యక్ష దర్శనం. ఒక రోజు నేను AIIMS ప్రధాన ద్వారం నుండి నా విభాగానికి ప్రైవేట్ suites ఉండే ప్రాంతం ద్వారా వెడుతున్నాను. హఠాత్తుగా పి.వి. గారు అటుగా వస్తూ కనిపించారు. ఒకింత విస్తుపోయిన నేను తేరుకుని "నమస్కారం సర్" అన్నాను. ఆయన కొంచెం ఆగి, ప్రతి నమస్కారం చేసి కదిలి వెళ్ళారు. ఆయన వెనక గాని, ముందు గాని వందిమాగధులు లేరు. వైద్యం కోసం AIIMS లో చేరి, విడుదల అయిన ఆయన అప్పుడు ఆయన విదేశాంగ శాఖ మంత్రి అని నాకు గుర్తు. ఎంతటి నిరాడంబరత!

★ ఈ వ్యాసం ప్రకాశిక 2021 ఏప్రిల్ –జూన్ సంచికలో మొదటి సారి ప్రచురించబడినది. పీ. వీ. కి భారత రత్న పురస్కారం దక్కిన సందర్భంగా మళ్ళీ ప్రచురిస్తున్నాము.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# పిపీలికం



కీ. శే. రావిశాస్త్రి

పూర్వం కృతయుగంలో, ఒకానొక ప్రజాపతి రాజ్యం చేసే కాలంలో, గౌతమీ నదికి ఉత్తరంగా శ్యామవనం అనే అడవిలో ఓ పెద్ద మర్రిచెట్టొకటి ఉండేదిట. ఆ మర్రిచెట్టు కింద, దాని మానుని ఆనుకొని ఓ పెద్ద చీమలపుట్ట ఉండేదిట. అందులో ఒకానొక చీమకి ఒకనాడు ఉన్నట్టుండి తనెవరో ఏమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిందట.

తనెవరో అనే విషయం గురించి ఆ చీమ చాలా తీవ్రంగా ఆలోచించ నారంభించిందట. (ఆలోచించి పనిచెయ్యడం మంచిదే ? కాని, ఆలోచన ఒకప్పుడు పనికి అంతరాయం కలిగిస్తుంది) పనీ పాటూ సరిగా చెయ్యకుండా చీమ ఆలోచనల్లో పడి కూర్చుండిపోయేసరికి తోటి చీమలు దానిని చీవాట్లు పెట్టేయట. పనిచెయ్యని ప్రాణులు "చెడిపోతాయిస్మా !" అని అవి దాన్ని హెచ్చరించేయిట. అయినప్పటికీ దాని ఆలోచనలది మానింది కాదట.

నేనెవర్ని? కళ్ళనా, కాళ్ళనా, తలనా, మొండేన్నా? ఎవరు నేను? నేను తినే తిండినా నేను? నా ఆలోచించే శక్తినా నేను? ఎవర్ని నేను? ఎందుకు పుట్టేన్నేను? ఎందుకు జీవిస్తున్నాన్నేను? ఎందుకు వస్తాను? చచ్చి నేనేమవుతాను? ఎవర్ని, నేనెవర్ని?

ఇటువంటి ఆలోచనలతో చీమకి నిద్ర చెడిందట. ఆరోగ్యం క్షీణించిందట. తల కూడా చీమవాసంత పాడయిందట, ఆరోగ్యం క్షీణించి, ఆలోచనలు ఎక్కువ వడంతో దాని పరిస్థితి చాలా గందరగోళంగా మారిందట.

అప్పుడు, ఆ చిరుచీమ దురవస్థ చూసి, దానికి మరొక చీమ హితబోధ చేసిందట : "ఒరే సోదరా అంతుచిక్కని ఆలోచనలతో ఎందుకలా తల బద్దలు కొట్టుకుంటావు? అలా చేసుకొనేదానికి మారుగా అనుభవశాలి

నెవరినైనా అడిగి చూడకూడదా? నే చెప్పేమాట విను. ఇక్కడికి మూడు ఆమడల దూరంలో గోపన్నపాలెం అనే గ్రామం ఉంది. అక్కడ నిగమశర్మ అనే బ్రాహ్మణుడున్నాడు. నీ ప్రశ్నలన్నింటికీ ఆయన సమాధానం చెప్పగలడేమో వెళ్ళి అడుగు ! అలా చెయ్యి !" అని హితబోధ చేసిందిట సోదర పిపీలికం.

"ఏమిరా పిల్లవాడా! ఎందుకొచ్చేవు? నీకు నాతో ఏమి పనుంది?" అని ప్రశ్నించేట్ట నిగమశర్మ.

ఆ హితబోధ విని ఆనందించిన మన చిరుచీమ, పని కట్టుకొని, పెను ప్రయాసలకోర్చి ప్రయాణంచేసి, గోపన్నపాలెం చేరుకొని, నిగమశర్మ ఇంటికి వెళ్ళిందట.

ఆత్మపదార్థానికైనా సరే, బ్రహ్మపదార్థానికైనాసరే ఆకలిమాత్రం తప్పదని గోపన్నపాలెపు నిగమశర్మకి బాగా తెలుసునట. మన చిరు చీమ అతని ఇల్లు చేరుకునే సమయానికి అతడు గొప్ప ఆకలి మీద ఉన్నాడట. మన చీమ అతడివైపు జ్ఞానకాంక్షతో చూస్తే, అతడు మన చీమని ఆకలి చూపు చూసేడట. కాని, నిగమశర్మ సర్వభక్షకుడు కాదట, అతడు చీమలని కాని, మానవులను కాని తినడట. (వారి కష్టాన్నే తినగలడట).

చీమని చికాకుగా చూసి –

"ఏమిరా పిల్లవాడా! ఎందుకొచ్చేవు? నీకు నాతో ఏమి పనుంది?" అని ప్రశ్నించేట్ట నిగమశర్మ.

అప్పుడు ఆ చీమ ముందుకాళ్ళు వంచి, తల నేలకి ఆన్చి, "స్వామీ ! నేనెవర్ని? ఎందుకు పుట్టేను? ఎందుకు బతుకుతున్నాను? ఎందుకు వస్తాను?" అని సవినయంగా ప్రశ్నించి తన రాకకి కారణం నిగమశర్మకి తెలియజేసిందట.

గోపన్నపాలెపు గోపకుమారుల్లో కొంతమందికి విద్యాభ్యాసం చేయాలనే వాంఛ కలిగినప్పుడు "ఆలమందలు కాసుకొనేవాళ్ళకి ఓనమాలెందుకురా!" అని వారిని నిగమశర్మ లోగడ నిరుత్సాహపరిచేడుట. అందుచేత వారు ఓననామాలవంక రావడం మానివేసేరట. ఆ గ్రామంలో క్షత్రియులెవరూ లేదు. ఒక వైశ్యుడున్నాడట! కాని, అతనికి లాభాల చదువే కాని ఓనమాల

చదువు అక్కరలేకపోయిందట. మరింక బ్రాహ్మణులున్నారా అంటే; ఆ గ్రామానికి నిగమశర్మే ఒంటి బ్రాహ్మణుడుట, దానా దీనా, నలుగురికి నాలుగేసి అక్షరాలు చెప్పి నాలుగు నూకలు సంపాదించే అవకాశం నిగమశర్మకీ లేకపోయిందిట. ఇంటికి మూడేసి నూకలు చొప్పున ముష్టెత్తుకుంటూ, సగం ఆకలితో బతికే నిగమశర్మకి జ్ఞాన కాంక్షతో వచ్చిన చిరుచీమని చూడగానే బండెడాస, కొండంత ఉత్సాహమూ కలిగేయట, "మానవేతర జీవుల్లో జాతి భేదప్రమేయం లేదు కాబట్టి" ఈ చీమకి చదువు చెప్పి నాలుగు నూకలు లాగొచ్చుకదా అని అతను చాలా సంబరపడ్డాట్ట.

> **చిరుచీమకి ఏం చెయ్యాలో తెలియక..... "మరైతే నేనేం చేయాలి స్వామీ?" అని అమాయకంగా అడిగిందట.**

చీమ మాటలు విన్నాక నిగమశర్మ క్షణం సేపు ఆలోచించి గొంతుక సవరించుకొని, "అబ్బో! మంచి జిజ్ఞాసతోనే వచ్చేవే ! కాని చూడు, నువ్వు తెలుసుకోవాలనే విషయాలన్నీ తెలుసుకోవాలంటే చాలా చదువుకోవాలే!" అన్నాడట.

"అలాగైతే స్వామీ, ఆ చదువు నాకు మీరే చెప్పాలి !" అందిట చిరుచీమ.

"అలాగే చెప్తాను. కాని, ఒక యదార్ధం ఉంది. ఆకలితో మాడి చచ్చేవాడు ఆ పరమాత్ముడైనా సరే ఎవరికీ పాఠాలు చెప్పలేడు. వాడికి ఆ శక్తికాని, ఆ ఇచ్చకాని ఉండవు. నేనిప్పుడు ఆ స్థితిలోనే ఉన్నాను" అని చెప్పి ఊరుకున్నాడు నిగమశర్మ.

చిరుచీమకి ఏం చెయ్యాలో తెలియక.....

"మరైతే నేనేం చేయాలి స్వామీ?" అని అమాయకంగా అడిగిందట.

అందుకు సమాధానంగా, "ప్రతి దినం నాకు గిద్దెడు నూకలియ్యి అంతేచాలు! అందుకు సమ్మతిస్తివా నేన్నీకు చెప్పగలను చదువు" అని అశని గాంభీర్యం వెనక దాచి తన యదార్ధపు కోరిక తెలియజేసేడట చీమకి శర్మ.

అప్పుడా చిరు చీమ తెగ సంతోషించి నిగమశర్మకి నమస్కరించి "స్వామీ! ఎంతటి కష్టమైనా సరే నేను లెక్కచెయ్యను. నాకు చదువు కావాలి !" అని

తన అభీష్టం గ్రహించి, ఆ క్షణం నుంచీ ఎద్దులా కష్టపడి గింజ గింజ చొప్పున గిద్దెడు గింజలూ ప్రతిదినం గురువుకి సమర్పించి అతని దగ్గర చదువులు కొన్ని నేర్చుకుందిట.

"నేనెవరిని స్వామీ! వేగిరం చెప్పండి స్వామీ!" అని ఎంతో కుతూహలంగా తొందర తొందరగా అడిగిందట చిరుచీమ.

నిగమశర్మ ఆ చీమకి అక్షరమాలంతా నేర్పేడట. గుణింతాలన్నీ ముప్పేదట. దానిచేత "తల, వల" అన్నీ చదివించేదట. దానికి అంకెలన్నీ చూపించి, కూడికలూ, కొట్టివేతలూ చెప్పేడట, అంతకంటే ఎక్కువ చదువులు అతనికి రావట. అందుచేత తను చెప్పగలిగిన మేరకి వీలైనంత ఆలస్యంగా చదువులన్నీ చెప్పి చివరి దినం చీమని పిలిచి,

"నువ్వెవరవో నీకిప్పుడు తెలిసిందా?" అని అడిగేడట నిగమశర్మ.

"నేనెవరిని స్వామీ! వేగిరం చెప్పండి స్వామీ!" అని ఎంతో కుతూహలంగా తొందర తొందరగా అడిగిందట చిరుచీమ.

అప్పుడు నిగమశర్మ పరబ్రహ్మంలా నవ్వి, "మరెవరివీ కావు! నువ్వు చీమవి !" అన్నాట్ట.

"ఆహా! నేను చీమనా!" అని ఆశ్చర్యచకితురాలైపోయి, ఆ తరువాత పరమానందభరితురాలై పోయిందట చిరుచీమ.

"మరింక చదువై పోయింది. నువ్వు వెళ్ళవచ్చు" అని నిట్టూర్చి అన్నాడట.

చీమ జ్ఞానం సంపాదించిన చిరుచీమ కృతజ్ఞతాపూర్వకంగా మరొక నాలుగు దినాల నూకలు నిగమశర్మకి కట్నం కింద సమర్పించుకొని, ఎగురుతూ, గెంతుతూ, శ్యామవనం వెళ్ళి తన సోదరులందరికీ జ్ఞానం పంచిందట. ఆ చీమలన్నీ కూడా "ఆహా! అయితే, మనమంతా చీమలన్నమాట!" అని సంబరపడి చీమలు పండుగ జరుపుకున్నాయట.

అయితే –

మన చీమ సంతోషంగా శ్యామవనం చేరుకొని పుట్టినింటికి వెళ్ళిందేకాని

దానికి ఆ సంతోషం ఎక్కువ దినాలుండలేదట. దానికి అనుమానాలన్నీ మళ్ళీ పుట్టుకు రాసాగేయట.

"చీమంటే ఏమిటి? కళ్ళా. కాళ్ళా, తలా, మొండెమా ? కాళ్ళు లేకపోతే నేను చీమని కానా? కళ్ళు లేకపోతే నేను చీమ కంటె భిన్న మవుదునా? చీమ అనే ఈ పదార్థం ఎందులో వుంది? ఇది ఇలాగే ఎందుకు పుట్టాలి? ఇది ఇలాగే ఎందుకు బతకాలి? ఈలాగే ఎందుకు చావాలి?"

**చీమంటే ఏమిటి? కళ్ళా, కాళ్ళా, తలా, మొండెమా ? కాళ్ళు లేకపోతే నేను చీమని కానా?**

ఇటువంటి చిక్కు ప్రశ్నలన్నీ ఆ చీమని తిరిగి చీకాకు పెట్టసాగేయట, దాని ఆరోగ్యం మళ్ళీ పాడవ నారంభించిందట. ఈ పెను ప్రశ్నలన్నీ నేను చీమని అనే చిరుజ్ఞానంతో విడవవని తెలుసుకొని, అది తిరిగి పాత గురుశర్మ దగ్గరకి పరుగెట్టుకుంటూ వెళ్ళి తన సందేహాలన్నీ నివృత్తి చేయమని పాదం పట్టుకొని ప్రార్ధించిందట.

"ఆ జ్ఞానమే నాకుంటే అరసోలడు నూకలకి నీ అన్ని సందేహాలు తీర్చేయనా!" అని లోలోపల అనుకున్నాడట ఆకలితో ఉన్న నిగమశర్మ, ప్రకాశంగా చీమతో– "నీ సందేహ నివృత్తి నేను చెయ్యలేను" అన్నాడట.

"పోనీ ! చేసే జ్ఞానిని చూపించండి స్వామీ!" అని బతిమాలిందట చిరుచీమ.

అందుమీదట, తనకి తెలిసిన జ్ఞానులు గురించి ఆలోచించి

"శిష్యుడా! నీ సందేహాలకు సమాధానాలు చెప్పగలిగే మహానుభావుడు నాకొక్కడే కనిపిస్తున్నాడు. ఇక్కడికి మూడు ఆమడల దూరంలో జన్నాలపల్లె అనే అగ్రహారం ఒకటుంది. ఆ అగ్రహారంలో చతుర్వేది అనే సద్బ్రాహ్మణుడున్నాడు. నువ్వు వెళ్ళి ఆయన కాళ్ళమీద పడి, జ్ఞానభిక్ష పెట్టమని ఆయన్ని ప్రార్ధించు" అని చెప్పేడట నిగమశర్మ. ఆ చతుర్వేదికి చీమ విషయాలన్నీ తెలియజేస్తూ ఓ తాటాకు మీద జాబు కూడా రాసేడట శర్మ.

ఆ తాటాకు ఈడ్చుకుంటూ, కొన్ని దినాలు కాలినడకన ప్రయాణం చేసి జన్నాలపల్లె చేరుకొందిట చీమ.

నిగమశర్మ చెప్పినట్టుగానే జన్నాలపల్లెలో "చతుర్వేది" అని పిలువబడే వేదవేదాంగవేద్యుడు తప్పక ఉన్నాడట. కాని, చీమ వెళ్ళే సమయానికి ఆయన వేదపారాయణంలో ఉన్నాడట. ఆ పిమ్మట ఆయన శిష్యులచే పరివేష్టించబడి ఉన్నాడట. పరమగురువు దరికి పరదేశిచీమ చేరకుండా వారి సచ్ఛిష్యులంతా చాలా తంటాలు పడ్డారట. యమ ప్రయాసలకి ఓర్చి మన చీమ ఆ చతుర్వేదిని కలుసుకొని నిగమశర్మ నుంచి తెచ్చిన పరిచయ పత్రం ఆయనకి చూపించగలిగేసరికి దానికి తలప్రాణం తోకకి వచ్చిందట.

**వేదాలు తెలుసుకొందికి భగవదనుగ్రహం ఉండాలంటే అది బ్రాహ్మణపు చీమ అయివుండవలెను కదా?**

తాటాకు చదివి చిరుచీమని చూసి చతుర్వేది గారు స్మిత వదనులయేరట. "అయితే, వేదాలన్నీ తెలుసుకోవాలనుందా నీకు?" అని చీమని వారు పృచ్ఛించేరట. "తమరు అనుగ్రహిస్తే తెలుసుకోగలను" అందిట సవినయపు చీమ.

"నాలో ఏమీలేదు నాయనా! అంతా భగవదనుగ్రహం!" అన్నారట చతుర్వేదిగారు.

"వేదాలు తెలుసుకొందికి భగవదనుగ్రహం ఉండాలంటే అది బ్రాహ్మణపు చీమ అయివుండవలెను కదా?" అని అంతలో చతుర్వేది గారి శిష్యుడొకడు ఒక చిన్న సందేహరూపంలో తన అభ్యంతరం తెలియజేశాడట. ఆ విషయం గురించి కొంత చర్చ జరగవలసిందేకాని చతుర్వేది గారు వేదాలు తెలిసిన అధికారంతో చర్చ జరగనీయకుండా చేసేరట.

"సద్బుద్ధి కలవాడే సబ్రాహ్మణుడు, పుట్టు బ్రాహ్మణులు వచ్చేటికాలం కలికాలంకాని ఈ కాలం కాదు. ఈ చీమకి సద్బుద్ధి కలదని నా బుద్ధికి తోస్తోంది. చిన్న చిన్న చిరు పాపాలేవయినా ఈ చీమ చేసి వున్నప్పటికీ, శుద్ధిచేసి ఈ చీమని మనం బ్రాహ్మణ్యంలోకి మార్చుకోవచ్చును" అన్నారట చతుర్వేదిగారు.

> సద్బుద్ధి కలవాడే సద్బ్రాహ్మణుడు, పుట్టు బ్రాహ్మణులు వచ్చేటికాలం కలికాలంకాని ఈ కాలం కాదు.

శిష్యులంతా గురువాక్యం శిరసావహించవలసి వచ్చిందట! కాని వారు తమ కోపాల్ని తమతమ కడుపుల్లో దాచుకొని, చీమకి వాతలు పెట్టి శుద్ధి చేద్దామని సంకల్పించేసరికి, "వాతలు పెట్టినట్లయితే ఎందుకు చస్తానో తెలుసుకోకుండానే చస్తాను మొర్రో" మని చిరుచీమ పెనుకేకలు వేసి, గోల చేసిందిట. కేకలు విని పరుగిడి వచ్చిన చతుర్వేది గారు శిష్యుల్ని వారించి, వాతలకి మారుగా మంత్రజలం జల్లి, ఆ చీమని శుద్ధిచేసి దానికి బ్రాహ్మణ్యం ఇప్పించేరట.

చతుర్వేదిగారు నిర్దిష్టంగా గురుకట్నం నిర్ణయించే అలవాటు ఎన్నడూ చేసుకోలేదటగాని, వారు యజ్ఞం చేయదలచుకున్నారట. హిరణ్యం కొంతైనా లేనిదే యజ్ఞం జరగడం కష్టంట, అందుచేత చీముడి వేదాలూ, వాటి సారాలూ, తెలియజేసేముందు చతుర్వేది గారు ఓ చిన్న నిబంధన చేసేరట.

ఆ నిబంధన ఏమిటో వినిన చీమ "అయ్యా! బంగారపు బరువు నేనే భరించలేనే! తాటాకే మొయ్యలేకపోయేను కదా !" అందిట.

"రేణువు రేణువు చొప్పున ఎంత తేగలిగితే అంతే తే! చాలు!" అని చాలా సౌమ్యంగా సెలవిచ్చేదట చతుర్వేదిగారు.

రేణువు రేణువు చొప్పున తేగలిగినంత హిరణ్యం తెచ్చుకొన్న చీమ సంవత్సరాలపాటు శ్రమించి, చతుర్వేది గారి వల్ల వేద వేదాంగాలన్నీ తెలుసుకొని ధన్యుడయేననుకుందట మన చిరు చీమ.

అధ్యయనం అంతా అయిన పిమ్మట చతుర్వేది గారి వల్ల వేదసారం అంతా ఒకే ఒక మాటలో ఉన్నదని తెలుసుకున్నదట మన చీమ.

ఏమిటది?

"సోహం!" అన్నారట చతుర్వేదిగారు.

"సోహం" అందిట చిరుచీమ, అన్నాక –

"అంటే ఏమిటి స్వామీ!" అని అడిగిందట చీమ,

అంటే ఏమిటో అంతా బోధించేరట చతుర్వేదిగారు. అంటే ఏమిటో అంతా విన్నాక

"అయితే ఏమిటి?" అని ప్రశ్నించిందిట పిపీలికం.

చదువైపోయిందన్నారట చతుర్వేదిగారు.

శ్యామవనం చేరుకొందిట పిపీలికం.

బ్రహ్మజ్ఞానం పొందినప్పటికీ బ్రతుకులో ఏం తేడా కూడా కనిపించకపోయేసరికి చీమ చాలా నిరుత్సాహపడిపోయిందట. బ్రహ్మజ్ఞానంతో దాని తలంతా నిండిపోయి దాదాపు పండిపోయినప్పటికి కూడా బతుకులో దానికి వెతుకులాటలూ, పీకులాటలూ, బరువులూ, బాధ్యతలూ, కష్టాలూ, కడగళ్ళూ ఏమి తప్పలేదుట! బ్రహ్మజ్ఞానం పొందికూడా నీరసించిపోతున్న మన చీమని చూసి మరొక చీమ చాలా వగచి ఈ విధంగా హితవు చెప్పిందట.

"నువ్వెందుకు తమ్ముడా, అలా నీరసించిపోతావు. వేదవేద్యుల కంటే గొప్పవారు మహా ఋషులని పిలువబడేవారున్నారని విన్నాను. మన ఈ వనంలోనే ఏడు కొండల అవతలనుంచి వచ్చిన సోదరుణ్ణి ఒకణ్ణి ఈ మధ్యనే నేను కలియడం తటస్థించింది. వాళ్ళు ఉన్న దగ్గర ఒక మహాఋషి ఎన్నాళ్ళనుంచో తపస్సు చేస్తున్నాడట. ఆ మహాఋషి చుట్టూనే వాళ్ళంతా పుట్ట పెట్టుకుని జీవిస్తున్నారట. పోయి నీ బాధంతా ఆ మహానుభావునితో చెప్పుకోకూడదా!" అని హితబోధ చేసిందట ఆ మరొక చీమ.

హితవు చెప్పినందుకు ఆ మరొక చీమకి నమస్కరించి ఋషిపుంగవుణ్ణి వెతుక్కుంటూ ఏడుకొండలు దాటి వెళ్ళిందట మన చీమ.

అక్కడ ఒక చిన్న గుట్టంత పుట్ట వుందిట. అందులో చీమ లెన్నెన్నో వున్నాయిట. ఆ పుట్టలోనే మహాఋషి ఉన్నారని తెలుసుకొని ఆ పుట్ట అధికారులైన చీమల అనుమతి పొంది అందులోనికి ప్రవేశించి, అక్కడ మట్టితో, జటలతో, చీమలతో నిండిపోయినప్పటికీ నిశ్చింతగా తపస్సు చేసుకొంటున్న ఆ తాపసోత్తములవారిని కళ్ళారా చూచి ఆ మహానుభావునికి వినయాతివినయంగా వంగి నమస్కరించి వారిని మృదువుగా, వినయంగా సంస్కృత శబ్దాలతో పిలిచిందిట మన చీమ.

చీమల పుట్టలో దేవభాష వినబడగానే ఋషిపుంగవులవారు ఉలిక్కిపడి కళ్ళుతెరచి మన చీమని గుర్తించి, "నీకు ఏమి కావలెను నాయనా?" అని

దాన్ని శాంతంగా అడిగేరట. వెదురు బొంగులోంచి గాలి వచ్చినట్టుగా గంభీరంగా ఉన్నదట వారి స్వరం.

చీమ అప్పుడు తన విషయం అంతా వారితో వివరంగా చెప్పుకున్నదట.

> **నాలో నిజంగా భగవత్పదార్థం ఉన్నదా? ఉంటే భగవంతుడికంటే భిన్న మేరీతిగా అయేను?**

నాలో నిజంగా భగవత్పదార్థం ఉన్నదా? ఉంటే భగవంతుడికంటే భిన్న మేరీతిగా అయేను? నాలో భగవంతుడు లేకనే పోయినట్లయితే భగవంతుడు సర్వవ్యాపకుడు కానట్టే కదా! అందుచేత అతడు నాలో ఉన్నట్టే లెక్క చేసుకోవాలి. కదా! అతను నాలో ఉన్నప్పటికీ నేను ఇన్ని బాధలేల పడవలెను? అది నా పాపకర్మల ఫలితమనుకొన్నచో భగవంతుడు నాలో ఉండగా, ఆ పాపములు నేను చేయుటెట్లు సంభవించినది? భగవంతుడు కూడా పాపమునుండి తప్పించు కొనలేదా? ఇంతకీ నేనెవర్ని? నేనీ రీతిగా ఎందుకుండిపోయాను? ఇప్పుడు నా కర్తవ్యం ఏమిటి? అంతా నాకు తెలియజెప్పండి స్వామీ! అందిట చీమ.

చీమ వాక్కులు శ్రద్ధగా విన్న ఋషిసత్తములు శాంతంగా ఈ విధంగా సెలవిచ్చేనట!

"బ్రహ్మజ్ఞానం విని విని సాధించేనంటే లాభంలేదు చీమా! "సో2హం" అనేది అందరికీ తెలుసు, దాన్ని ఆచరణలో సాధించి అనుభవం పొందాలంటే యోగంలోనే సాధ్యపడుతుంది. అందుచేత యోగసాధన చేసి తపస్సుచేయి" అని సెలవిచ్చేరట.

వారు అలా సెలవిచ్చినందుకు వారికి నమస్కరించి, "తపస్సు చేస్తే జరిగేదేమిటి స్వామీ?" అని ప్రశ్నించిందట చిరుచీమ.

"జన్మరాహిత్యం సంపాదించి మోక్షం పొందడమే ఏ జీవికైనా గమ్యం! తపస్సు వల్ల అది సిద్ధిస్తుంది" అన్నారట ఋషిపుంగవులు.

చిరుచీమ ఒక క్షణం అలా నిలబడి, "ఇంతకీ స్వామీ! ఏ జీవికైనా జన్మరాహిత్యం ఎందుకు! మోక్షం ఎందుకు? తెలియక అడుగుతున్నందుకు క్షమించండి" అన్నదట.

చీమ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా మౌనముద్రాంకితులయేరట ఋషిపుంగవులు. మోక్షం ఎందుకు అంటే ఎవరైనా ఏమీ చెప్పగలరు? (అలా అడిగేవారితో భాషించి ఏమి ప్రయోజనము)

> "జన్మరాహిత్యం సంపాదించి మోక్షం పొందడమే ఏ జీవికైనా గమ్యం! తపస్సు వల్ల అది సిద్ధిస్తుంది" అన్నారట ఋషిపుంగవులు.

మునీశ్వరులవారివద్ద కొంతసేపు నిశ్చలంగా నిలబడిందట మన చీమ. వారు సమాధానం చెప్పరని నిశ్చయమయేక చీమ తన ఇంటికి తిరుగుముఖం పట్టిందట. రాళ్ళూ రప్పలూ, చెట్లూ చేమలూ, ఏడు కొండలూ, ఎన్నెన్నో గుట్టలూ అన్నిటికీ దాటుకొని చిరుచీమ తన పుట్ట సమీపానికి చేరుకొనేసరికి దాదాపు నెల దినాలు పట్టింది. వెళ్ళేసరికి భానూదయం అవుతోందిట.

మర్రిచెట్టుక్రింద తన పుట్ట అల్లంత దూరంలో ఉంది. ఉండగా అక్కడ నిలబడి పోయిందిట చిరుచీమ, పుట్టలోంచి చిందరవందరగా పగిలిపోయిన కోటలోంచి చెదిరిపోయిన సైన్యంలా లక్షలాది సంఖ్యలో పారిపోయి వచ్చేస్తున్నాయట. చీమ తోడిచీమలు.

మన చీమకి ఒక క్షణం సేపు ఏమీ అర్థం కాలేదట. ఏదో ఆపద సంభవించి వుంటుందని ఆ వెంటనే మాత్రం గ్రహించగలిగిందట. అప్పుడది ఒక సోదరణ్ణి ఆపి అడిగిందట,

"అన్నా అన్నా ! ఏమి సంభవించింది ? ఆపదా? ఏ మాపద? ఏం జరిగింది?" అని చాలా ఆత్రుతగా అడిగిందిట.

అన్న చీమ వగర్చుకొంటూ ఆగి –

"ఎవడో రాక్షసుడు మన యింట్లో ప్రవేశించేడు" అని చెప్పి మూర్ఛపోయిందిట.

అప్పుడు మన చీమ తన సోదరులందర్నీ ఆపి, తన చదువునంతా ఉపయోగించి వారికి ధైర్యం చెప్పి వారందర్నీ ఒకచోట నిలిపి తమ పుట్టలోకి తను వంటరిగా వెళ్ళిందట.

అక్కడ ఆ చీమల పుట్టింట్లో అట్టడుగున విశాలమైన ఓ చల్లని గదిలో నల్లని ఒకానొక రాక్షసాకారం చుట్టలు చుట్టుకొని నిద్రపోడానికి సిద్ధమవుతోందట. చూడ్డానికి అది ఎంతో భయంకరంగానూ, చాలా అసహ్యంగానూ కూడా ఉందిట.

ఆ ఆకారాన్ని చూసి మన చీమ –

"ఓయీ! ఎవరు నీవు? మా ఇంట్లోకి మా అనుమతి లేకుండా ఎందుకిలా వచ్చేవు? అది అక్రమం కాదా? అన్యాయం కాదా? మాకు అపకారం చేయడం నీకు న్యాయమేనా?" అని ఆకారాన్ని గౌరవపూర్వకంగానే అడిగిందట మన చీమ.

ఆ ఆకారం చీమ మాటలు విని తలెత్తిచూసి, చీమని కనిపెట్టి, బుసబుసమని నవ్వి ఈవిధంగా చెప్పిందట,

"ఒరే పిపీలికాధమా! నేనెవరిననా అడిగేవు? నేను సుఖభోగిని; నీ పాలిట మాత్రం కాలయముణ్ణి! ఇప్పుడు తెలిసిందా నే నెవరో? తెలిసింది కథ! మరి, నువ్వెవరవో నీకు తెలుసునా? నీ ముఖం చూస్తే నీకింకా ఏమీ తెలియనట్టే ఉందిలే. నువ్వు ఈ లోకంలో ఒకానొక తుచ్ఛపు కష్టజీవివి. కష్టజీవులు కష్టపడాలి. సుఖభోగులు సుఖించాలి. అలా జరుగుతుందనేది ప్రకృతి ధర్మం. అలా జరగాలనేది భగవదాదేశం. అందుచేత, మీ చీమ వెధవలంతా కష్టపడవలసించే, మీ కష్టమ్మీద మేం సుఖించవలసినదే! మాకు అదే న్యాయం, అదే ధర్మం! కాదన్నవాణ్ణి కాటేసి చంపుతాం! ఇది మీరు కష్టపడి కట్టుకున్న యిల్లే బాగానే ఉంది. మీ నిర్మాణ కౌశలానికి ముగ్ధుణ్ణయేను. మిమ్మల్ని మెచ్చుకుంటున్నాను. చాలు నీకది, పొండి! మరింక దీని సౌఖ్యం అనుభవించే భాగ్యం అంటారా? అది మాది! అది మాహక్కు. ఆ హక్కు మాకు వీడూ వాడూ ఇచ్చింది కాదు, భగవంతుడే ఇచ్చాడు. ఇది ఇప్పటినుంచీ నా ఇల్లు. బోధపడిందిరా చిన్నోడా, నీకేదో చదువులు చదివి పాఠాలు నేర్చుకోవాలని కుతూహలంగా ఉన్నట్టుంది. ఈ దినానికి నీకీ పాఠం చాలు! మరో పాఠానికి మళ్ళీ రాకు. వచ్చేవంటే మిగతా పాఠాలన్నీ మరో లోకంలో నేర్చుకోవలసి ఉంటుంది. మరందుచేత వేగిరం నడువిక్కృణ్ణుంచి. నాకు రాత్రంతా నిద్రలేదు. ఇప్పుడు నాకు నిద్రాభంగం మరింక చెయ్యక ప్రాణాల మీద తీపుంటే తక్షణం ఇక్కడ్నించి ఫో!"అని చీమకి ఖచ్చితంగా చెప్పి నిద్రపోవడానికి సిద్ధంగా తల వాల్చిందట ఆ రాక్షసాకారం.

మన చిరుచీమ నివ్వెరపోయిందట.

నువ్వో చిరుప్రాణి వన్నారు. నువ్వు చీమ పేరుగలదాని వన్నారు. నువ్వు దేవభాషలో పిపీలికాని వన్నారు. నువ్వు పిపీలికానివే కాని నువ్వు కూడా బ్రహ్మ పదార్థానిచే నన్నారు. నువ్వు అదున్నారు, ఇదన్నారు. అంతే కాని – "నువ్వు కష్టజీవి"

అని మాత్రం అంతవరకూ ఎవ్వరూ చెప్పేరు కారుట చిరుచీమకి. నీ కష్టాన్ని దొంగిలించి ఇతరులు సుఖిస్తారని కూడా ఎవ్వరూ చెప్పలేదుట దానికి. "శాస్త్రాలు" చెప్పని సత్యం "ధర్మాత్ములు" దాచిన సత్యం నిజజీవితంలో ఆ రాక్షసాకారం వల్ల తెలుసుకొని, ఆ నిజానికి కొంతసేపు నిశ్చేష్టురాలయిపోయిందట మన చిరుచీమ. ఆ తరవాత కర్తవ్యం గురించి ఆలోచించనారంభించిందిట. ఆవిధంగా జ్ఞానోదయం కలిగి "బుద్ధుడ"యింది కాబట్టి ఆ చిరుచీమకి తనేం చెయ్యాలో వెంటనే తెలిసిపోయిందట.

అప్పుడు మన చీమ ఆ రాక్షసాకారాన్ని సుఖంగా నిద్రపోనివ్వక దానితో ఈవిధంగా చెప్పిందట.

"ఒరే రాక్షసాధముడా! మేం కష్టజీవులమే కావచ్చు, నువ్వు సుఖభోగివే కావచ్చు, కాని నువ్వు మా కష్టాన్ని అపహరించి మాకు అన్యాయం చెయ్యడం మేం సహించం! మేం తిరగబడతాం! నువ్వు చెప్పిన న్యాయం భగవన్న్యాయమైనా సరే అది అన్యాయం కాబట్టి దాన్ని మేం మారుస్తాం! అందుగురించి మేం తిరగబడతాం. మీమీద మేం తిరగబడి తీరుతాం" అని చెప్పిందట మన చీమ ఆ రాక్షసాకారానికి.

చీమ వాక్కు విన్న రాక్షసాకారం మొదట కొంచెం వెటకారంగా నవ్విందట. ఆ తరవాత కోపంగా బుసకొట్టిందట.

రాక్షస కోపానికి చీమ నాయకుడు చిరునవ్వు నవ్వుకొని, పట్టుదలతో పైకివెళ్ళి సోదరులందరికీ హితబోధ చేసి, ధైర్యం చెప్పి, వారిని వీరులుగా మార్చి "రాక్షసాకారపు భగవన్న్యాయం" మీద తిరుగుబాటు చేసేందుకు అందర్నీ కూడ గట్టుకొని ముందుకు రంగంలోకి ఉరికేడట. తత్ఫలితంగా –

శ్యామవనంలో మర్రిచెట్టు కింద ఆ దినం ఓ రాక్షసాకారం విలవిల తన్నుకొని నెత్తురు కక్కుకొని చచ్చిందట. ఆ మేరకి ఆ మూలంగా భూభారం కొంత తగ్గిందట.

★ ఆంధ్రజ్యోతి వారపత్రిక జనవరి 17, 1969 సంచికలో తొలిసారి ప్రచురింపబడినది.

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# బలహీనులు తిరుగబడితే... పిపీలికం కథ



శ్రీ మన్నె ఏలియా
94904 34909

రావిశాస్త్రిగా ప్రసిద్ధిచెందిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి వృత్తి రీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా కథా రచయిత, నవలా కారుడు, నాటక కర్త. ఆయన కథల్లో కూడా న్యాయవాదే. నిత్యం సమాజంలోని పై తరగతుల వారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురియై చిత్రహింసలు అనుభవిస్తున్న దీన హీన పీడిత జనుల తరపున వకాల్త పుచ్చుకొని రచనలు చేసారు. ప్రతి రచనలోనూ సాంఘిక న్యాయం కోసం గొంతెత్తినారు. మార్క్సిజం ప్రభావంతో రచనలు చేసినారు. అందుకే అతన్ని ఇండియన్ గోర్కిగా పిలుస్తారు.

తెలుగు వచన సాహిత్యానికి వన్నె తెచ్చిన మహా రచయిత. రావిశాస్త్రి కథలు రాసినా, నాటికలు రాసినా, నవలలు రాసినా వీరిది విశిష్టమైన శైలి. రచనల్లో వీరు చేసినన్ని ప్రయోగాలూ ఇంకెవరు చేయలేదు అంటే అతిశయోక్తి కాదు. రావిశాస్త్రి మానవతావాది, సామాజిక చైతన్య వారధి, కథా రచయిత, బహుముఖ ప్రతిభా సంపన్నులు, సునిశిత పరిశీలకులు, నిజాయతి నిబద్ధత గల రచయిత చెప్పాలనుకున్నది స్పష్టంగా చెప్పడం వారికి వెన్నతో పెట్టిన విద్య. అనుక్షణం భయపడుతూ జీవించే నిసహాయుల సమస్యలను వాటి వల్ల కలిగే వేదనను రోదనను సూటిగా పాఠకుల గుండెలకు హత్తుకునేలా తమరచనల్లో చెప్పినారు రావిశాస్త్రి. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను తన రచనల ద్వార ఎత్తి చూపడమే కాకుండా పరిష్కార మార్గాన్ని కూడా చూపించినారు. ప్రతి రచన ఏదో ప్రయోజనాన్ని ఆశించి రచించినదే.

1967–1972 కాలంలో శ్రీకాకుళం గిరిజనుల హక్కులకోసం పోరాటం చేసినారు. అట్టడుగు ప్రజల కోసం తనదైన పద్దతిలో సమాజాన్ని నిలదీసినారు. 1947లో అతను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రజల జీవన

శైలిలో వస్తున్న మార్పులను గమనించినారు. ఈ కొత్త జీవన విధానంలో అమానవీయత అతనికి చాల బాధను కల్గించింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మాండలికంలో అట్టడుగు వర్గాల భాషలో సొగసుగా, ప్రతిభావంతంగా, పాఠకుల హృదయాలు స్పందిచేలా ఎల్లకాలం నిలిచి పోయే రచనలను అనేకం చేసినారు.

చిన్న కథలకు కొత్త కోణాలను, ఆధునిక కాల్పనిక సాహిత్యానికి వినూత్న దారులు వేసినారు. వీరి రచనల్లో పదునైన వ్యంగ్యం అంతర్లీనంగా ప్రవహించి సామ్యవాద భావాలను ప్రసారం చేస్తూ సాగిపోయే కథనం రావి గారిది.

వర్గ వ్యత్యాసాలను కండ్లకు కట్టినట్టుగా కథలు రాసినారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పలుచబడుతున్న సాంఘీక న్యాయాన్ని తమ కథల్లో ఎత్తి చూపినారు. గాయపడ్డ జీవితాలను ఇతివృత్తాలుగా మలచి రచనలు చేసినారు. వారి రచనలన్నీ ఆణిముత్యాలే. అణగారిన, పీడిత వర్గాలకు సాహిత్య జీవనాడితో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసినారు.

ఉత్తరాంధ్ర ప్రాంతానికి ప్రాధాన్యతను తెచ్చి తన రచనలతో తన ప్రభావాన్ని చాటారు. రావిశాస్త్రి రచనలు క్లయింట్లు, నిమ్నకులాలు, మరియు సామాన్య ప్రజల జీవితాలతో ప్రతిధ్వనించాయి. అతని కథా సాహిత్యం యొక్క సారంశంగా మారింది. అణగారిన వర్గాల బాధలకు ఓదార్పు నిచ్చారు. సృజనాత్మక రచనల ద్వార తను నమ్మిన సిద్ధాంతాలను తమ రచనల్లో బలంగా ప్రకటించారు.

తెలుగు సాహిత్య లోకానికి 'అల్పజీవి'(1952) నవల ద్వార విశిష్ట కథన శైలి చైతన్య స్రవంతి (stream of consciousness)ని పరిచయం చేసిన మొదటి వ్యక్తి. జేమ్స్ జాయిస్ రచనా పద్ధతి చైతన్య స్రవంతి ధోరణిలో రావిశాస్త్రి రాసిన 'అల్పజీవి' నవలను పేర్కొంటారు. తెలుగు నవలా ప్రపంచంలో ఈ చైతన్య స్రవంతిని ప్రవేశపెట్టిన తొలి నవల రచయిత రావిశాస్త్రి గారే!

మధ్య తరగతి, దిగువ తరగతి, ఉన్నత తరగతి సమాజం యొక్క సామాజిక ఫ్యాబ్రిక్ ను లోతుగా పరిశోధించారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అణగారిన ప్రజల గొంతుకై వారి హక్కుల కోసం అయన రచనలు చేసినారు. వారి ప్రతి రచన సామాజిక న్యాయం కోసమేనని వారికున్న అంకిత భావాన్ని తెలియజేస్తుంది. రచయితగా, తత్వవేత్తగా, సాహిత్య విమర్శకుడిగా, సామాజిక కార్యకర్తగా, ప్రజా హక్కుల

పరిరక్షకుడిగా బహుముఖీయంగా ఏది చేసిన అణిచివేతకు గురవుతున్న బలహీన వర్గాలకు దిక్కుగా వున్నారు. భావి తరాలకు మార్గదర్శిగా నిలిచారు.

తెలుగునాట కలంతో సామాజిక రుగ్మతలను పెకిలించడానికి అహర్నిశలు కృషిచేసిన అక్షర యోధుడు. సమాజంలో నెలకొన్న దౌర్జన్యాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా తన రచనల ద్వార ప్రజలను చైతన్య పరచిన ఒక గొప్ప మానవతావాది. ఆర్తుల, దీనుల, హీనుల, బలహీనుల పక్షపాతి. అటువంటి రావి శాస్రి గారి కథల్లో ఒకటైన కథ "పిపీలికం". ఇది అతి ప్రసిద్ధమైన కథ. శ్రమదోపిడికి గురవుతుకూడా ఆ విషయం తెలియని అమాయకుల కష్టజీవుల, ఆర్ద్రత ఆరాటం పోరాటం, వ్యధాభరితమైన జీవితాన్ని కండ్లకు కట్టినట్టు ఈ కథ చూపిస్తుంది. మానవతా వాదులను మేధావులను ఆలోచింపజేసిన కథ పిపీలికం.

> **ఒకనాడు ఉన్నట్టుండి ఒక చీమకు తానెవరోనని తెలుసుకోవాలనే జిజ్ఞాస కల్గిందట.**

ఒక అల్ప ప్రాణియైన చీమ ద్వారా నేనెవర్ని? అని ప్రశ్నలు సంధిస్తూ అస్తిత్వ వాదాన్ని తెరపైకి తెచ్చిన కథ 'పిపీలికం'. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిపోయే ఈ కథ శ్రమ దోపిడిని ప్రశ్నించడమే కాదు సందేశాత్మకంగా పరిష్కారం కూడా చూపించింది. కథ ఇలా మొదలవుతుంది. పూర్వం కృత యుగంలో ప్రజాపతి రాజ్యం చేసే కాలంలో గౌతమీ నదికి ఉత్తరంగా శ్యామ వనం అనే అడవిలో ఒక పెద్ద మఱ్ఱి చెట్టు ఒకటి ఉండేదట.దాని మాను నానుకొని ఒక పెద్ద చీమల పుట్ట ఉండేదట.

ఒకనాడు ఉన్నట్టుండి ఒక చీమకు తానెవరోనని తెలుసుకోవాలనే జిజ్ఞాస కల్గిందట. చాల తీవ్రంగా ఆలోచించి ఆలోచించి పనిచేయడం మానివేసిందట. పని చేయని ప్రాణులు చెడిపోతాయని హెచ్చరించాయి మిగతా చీమలు. అయినా ఆ చీమ ఆలోచన మానలేదు. నేనెవర్ని? ఎందుకు పుట్టాను? ఎందుకు జీవిస్తున్నాను? నేనెందుకు చస్తాను? చచ్చి నేనేమవుతాను? వంటి ప్రశ్నలతో నిద్రచెడి దాని ఆరోగ్యం క్షీణించసాగింది.

మూడామడల దూరంలోని గోపాలపాలెంలో నిగమశర్మ అనే అనుభవశాలి బ్రాహ్మణుడున్నాడని ఆయన ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలడని

తెలుసుకుంటుంది. పెనుప్రయాసలకోర్చి అక్కడికి చేరుకుంటుంది చీమ. ఆత్మ పదార్థానికైన సరే, బ్రహ్మ పదార్థానికైన సరే ఆకలి మాత్రం తప్పదని బాగా ఎరిగినవాడు నిగమశర్మ. గొప్ప ఆకలి మీదున్న శర్మ చీమల్ని కాని మనుషుల్ని కాని తినడట. కాని వారి కష్టాన్ని మాత్రమే తింటాడట అని రావిశాస్త్రి తనదైన శైలిలో వ్యంగ్యంగా చెపుతాడు. చీమకేమో జ్ఞానకాంక్ష, నిగమశర్మదేమో ఆకలి చూపు.

స్వామి! నేనెవర్ని? అని సవినయంగా చీమ విన్నవించు కుంటుంది. నిగమశర్మ ఒంటి బ్రాహ్మణుడు సగమాకలితో బ్రతికే వాడు. చీమకు చదువు చెప్పడం వల్ల కడుపునిండా భోజనం చేయవచ్చని సంబర పడిపోయినాడు. జిజ్ఞాసతో వచ్చిన చీమతో చదువుకోవాలంటే ప్రతి దినం గిద్దెడు నూకలివవ్వాలని చీమతో ఒప్పందం చేసుకున్నాడు.

> ఎంతటి కష్టమైనా లెక్కచేయక ఎద్దులా కష్టపడి గింజా గింజా సంపాదించి ఇవ్వడానికి సిద్ధపడింది చీమ.

ఎంతటి కష్టమైనా లెక్కచేయక ఎద్దులా కష్టపడి గింజా గింజా సంపాదించి ఇవ్వడానికి సిద్ధపడింది చీమ. వీలైనంత ఆలస్యంగా కొన్ని విషయాలు నేర్పించాడు.నువ్వు చీమవు అని తెలియజేసి ఇక చదువు అయిపోయిందని చెపుతాడు.

చీమ తిరిగి శ్యామవనం చేరుకుంటుంది. తను నేర్చుకున్న జ్ఞానం ఇతర చీమలకు పంచింది. కొన్ని రోజులకు మళ్ళీకొత్త అనుమానాలు పుట్టుకొచ్చాయి. చీమ అనే పదార్థం ఎందులో వుంది? ఇవి ఇలాగే ఎందుకు పుట్టాలి? ఇలాగే ఎందుకు బ్రతకాలి? ఇలాగే ఎందుకు చావాలి?....

పాత గురువు దగ్గరికి వెళ్లి తన అనుమానాలను నివృత్తి చేసుకోవాలను కుంటుంది. అంతటి జ్ఞానం తనకు లేదని మూడు ఆమడల దూరంలో వున్నజన్నాల పల్లె అనే అగ్రహారంలో చతుర్వేది అనే బ్రహ్మణుడున్నాడని అతనివద్ద శిష్యరికం చేయమని సూచిస్తాడు నిగమశర్మ. చీమ యమప్రయాసలకు ఓర్చుకొని వెళ్లి నిగమశర్మ నుండి తెచ్చిన పరిచయ పత్రం చతుర్వేదికి ఇస్తుంది. వేదాలు తెలుసుకోవాలంటే అది బ్రాహ్మణ చీమ అయివుండాలి కదా అని ఒక శిష్యుడు అభ్యంతరం చెపుతాడు. చీమ వాతలకు

తట్టుకోలేదని మంత్రం జలం చల్లి చీమను శుద్ధి చేసి బ్రాహ్మణులలో కలుపుకుంటాడు చతుర్వేది. చతుర్వేది వద్ద వేదవేదాంగాలు నేర్చుకోవాలంటే ఖచ్చితంగా బంగారం గురు దక్షిణగా ఇవ్వాలనంటాడు.

నాలో భగవంతుడి పదార్థం ఉన్నదా? వుంటే భగవంతునికి నేను ఏ రీతిగా భిన్నం?

సంవత్సరాల తరబడి కాయ కష్టం చేసి గురుదక్షిణ చెల్లిస్తుంది చీమ. అధ్యయనం పూర్తి అయిపోయింది. బ్రహ్మజ్ఞానమంతా "సోహం" అనే మాటలోనే వుందని నేర్చుకుంటుంది.

బ్రహ్మజ్ఞానం పొందినప్పటికీ చీమ బ్రతుకులో ఎలాంటి తేడా రాలేదు. బ్రతుకులో వెతుకులాటలు, కష్టాలు, కడగండ్లు, పీకులాటలు ఏవి తప్పలేదు.

ఇంకా తన అనుమానం తీరనేలేదు. అయినా పట్టువదలని చీమ ఏడు కొండలు దాటితే మహారుషి పుంగవుడున్నాడని తెల్సుకొని వెళ్లి అతన్ని కలుస్తుంది. నాలో భగవంతుడి పదార్థం ఉన్నదా? వుంటే భగవంతునికి నేను ఏ రీతిగా భిన్నం? నాలో భగవంతుడు లేనట్టయితే భగవంతుడు సర్వవ్యాపకుడు కానట్టేనా? అందుచేత భగవంతుడు నాలో ఉన్నట్టే లెక్క చేసుకోవలేనా? అతడు నాలో ఉన్నట్టయితే నాకెందుకిన్ని బాధలు? అది నా పాప కర్మల ఫలితమనుకున్నట్లయితే భగవంతుడు నాలో వుండగా ఆ పాపాలు నేనెల చేయగలను? అంటే భగవంతుడు కూడా పాపాల నుండి తప్పించుకోనలేడా? ఇంతకీ నేనెవర్ని? నేనెందుకు ఈ రీతిగా ఉండిపోయాను? ఇప్పుడు నా కర్తవ్యమేమిటి? అంతా తెలియజెప్పండి స్వామీ! అని సవినయంగా వేడుకుంటుంది. దానికోసం యోగసాధన తపస్సు చెయ్యవలెనని సూచిస్తాడు. అలా చేయడం వలన జన్మరాహిత్యం సాధించి, మోక్షం పొందడమే ఏ జీవికైనా గమ్యం అని చెపుతాడు.

"జన్మరాహిత్యం, మోక్షం ఎందుకు" అని అడుగుతుంది. అందుకు మహర్షి ఇలాంటి సందేహాలకు సమాధానం ఇవ్వడం అనవసరమని నిశ్శబ్దంగా వుండిపోతాడు.

తనకు సమాధానం రాకపోవడంతో చెట్లు చేమలు, రాళ్లు రప్పలు, ఏడుకొండలు ఎన్నెన్నో గుట్టలు అన్నింటిని దాటుకొని నెల రోజులకు తన ఇంటికి

చేరుకుంటుంది చీమ. చీమ పుట్ట సమీపానికి చేరుకొనే సరికి సూర్యోదయమవుతుంది. పగిలిపోయిన కోటలాంటి పుట్టలోంచి బెదిరిపోయిన సైన్యంలా లక్షలాది చీమలు పారిపోవడం కనబడింది. ఏదో ఆపద సంభవించిందని గ్రహిస్తుంది. ఎవడో నల్లని రాక్షసుడు ఇంట్లో ప్రవేశించాడని ఒక చీమ ద్వార తెలుసుకుంటుంది. పారిపోతున్న చీమలన్నింటిని ఆపి తన చదువునంత వుపయోగించి వారికి ధైర్యం చెప్పి, తను ఒంటరిగా పుట్టలోకి వెళ్ళింది.

శాస్త్రాలు చెప్పని సత్యం, ధర్మాత్ములు దాచిన నిజం నిజ జీవితంలో ఆ రాక్షసవతారం వల్ల బోధపడింది చీమకు.

ఒక నల్లని రాక్షసావతారం చుట్టాలు చుట్టుకొని నిద్ర పోవడానికి సిద్ధపడుతుంది. చూడడానికి ఎంతో భయంకరంగా, అసహ్యంగా వుంది. ఎవరు నువ్వు? మా అనుమతి లేకుండా మా ఇంటిలోకి అక్రమంగా, అన్యాయంగా, దౌర్జన్యంగా ప్రవేశించావు ఎందుకు అని నిలదీస్తుంది.

"ఒరేయ్ నన్నే అడుగుతావా? నేను సుఖజీవిని. మీ పాలిట కాలయమున్ని. ఇప్పుడు తెల్సిందా అంటుంది నల్లని ఆకారం. ఇంకా ఇలా అంటుంది నువ్వొక కష్ట జీవివి. మాలాంటి వాళ్ళ సుఖం కోసం మీలాంటి వాళ్ళు కష్టపడడం ప్రకృతి ధర్మం. అలా జరగాలనేదే భగవంతుడి ఆజ్ఞ. మీలాంటి వెదవలంతా కష్టపడాల్సిందే, మేమంతా సుఖపడాల్సిందే అదే న్యాయం, అదే ధర్మం కాదంటే కాటేసి చంపుతాం. ఆ హక్కు మాకు భగవంతుడే ఇచ్చాడు" అంటుంది అ రాక్షసావతారంలోవున్న పాము. నివ్వెర పోయిన చీమ అనుకొంటుంది బ్రహ్మజ్ఞానం చెప్పారు కాని తను కష్టజీవినని మాత్రం ఎవరు చెప్పలేదు. తన కష్టాన్నిదోచుకొని ఇతరులు సుఖిస్తారని కూడా ఎవరు చెప్పలేదు. శాస్త్రాలు చెప్పని సత్యం, ధర్మాత్ములు దాచిన నిజం నిజ జీవితంలో ఆ రాక్షసవతారం వల్ల బోధపడింది చీమకు.

ఈ అన్యాయాన్ని మేము సహించం తిరగబడతాం అని నిర్ణయించుకుంటుంది. పట్టుదలతో సహచర చీమలందర్నీ పిలిచి హితభోద చేసి, ధైర్యం నూరి పోసి వీరులనుగా మార్చేస్తుంది. అన్ని సంఘటితమై ఆ భయంకరమైన పాము మీద దాడి చేస్తాయి చీమలు. దానిని కొరికొరికి చిత్రహింసలు పెడతాయి. చీమల దాడికి విలవిలలాడి నెత్తురు కక్కుకొని చచ్చిపోతుంది పాము.

"బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలిచీమలచేత చిక్కి చావదె సుమతీ!" అనే పద్యం మదిలో మెదిలింది.

చీమ మరియు పామును ప్రతీకలుగా తీసుకొని రాసిన కథ పిపీలికం. ఇప్పటి పరిస్థితులకు రాజకీయాలకు, కుల పీడనకు, శ్రమ దోపిడీకి, బలవంతులు, బలహీనులపై చేస్తున్న దౌర్జన్యాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది పిపీలిక కథా. అల్ప జీవులు ఎప్పుడు దోపిడీకి పీడనకు అన్యాయాలకు గురి అవుతాయని సూటిగా తెలియజేసే కథ ఇది.

కథలోని ప్రధాన పాత్ర చీమ (మానవ జీవితానికి ప్రతిబింబంలా) శ్రమజీవులకు బలహీనులకు ప్రతీకగావున్నా కథా. దుర్బలుడికి తోడుగా అతని మేధస్సు, వ్యూహ రచన, నాయకత్వం, మనోబలం, పోరాట పటిమ మొదలగు లక్షణాలు చీమలో చూడవచ్చు. మాయచేసో, భయపెట్టో, భ్రమచేసో, అర్థ బలమో, అంగబలమో, రాజకీయ బలమో, ఇతరుల అమాయకత్వమో వాడుకొని దౌర్జన్యాలు చేస్తున్నవారికి ప్రతీక పాము. న్యాయాన్యాయాలను, తర్కానికి, ధర్మ విచక్షణకు తావివ్వని ఈ తరం పోకడను విశదపరిచింది ఈ కథ.

"పోరాడితే పోయేదేముంది బానిస సంకెళ్ళు తప్ప" అని ప్రపంచానికి చాటి చెప్పిన తత్వవేత్త కార్ల్ మార్క్స్ అన్నట్టు నిజజీవితంలో చీమ ఈ సిద్ధాంతాన్ని అమలు పరచి విజయం సాధించింది. మానవ హక్కులకోసం, దోపిడీ, అణచివేతల నుండి రక్షణకోసం పోరాటమే అవసరమని నిరూపించిన కథ. నేటికి ఏనాటికైనా ఆమోద యోగ్యమైన మార్గమని చెప్పకనే చెప్పారు రచయిత. పాలకుల, యజమానుల, నియంతృత్వ ధోరణులు, విశృంఖల పోకడలు, దోపిడీ విధానాలు, అరాచకాలు పెచ్చరిల్లుతున్న తరణంలో వాటినుండి విముక్తి కోసం ఉద్యమం/తిరుగుబాటు అనివార్యమని చరిత్ర చెప్పిన సత్యం. పిపీలికం కథలో ప్రతిపాదించబడింది.

అస్తిత్వ ఉద్యమ నేపథ్యంలో ఇటివల కాలంలో అనేక కథలు రాస్తున్నారు. కాని రావిశాస్త్రి గారు ముందు చూపుతో ఆనాడే రచనలు చేసినారు. చీమ చేసిన ఉద్యమం మేధావుల, సామాన్యుల మెదళ్ళలో కదలిక తెచ్చింది కనుక ఈ కథ సార్థకమైనట్లే!

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# దళారి



శ్రీ శాంతినారాయణ
80749 74547

"నమస్కారమన్నా రామప్పన్నా.... రారా. యేం శానా దినాలకొస్తివే. పంటలన్నీ బాగనే ఉండాయేమన్నా?" చాలా ప్రేమగా అడిగాడు లారీ బ్రోకరాఫీసులో ఫోన్ దగ్గర కూర్చున్న సుబ్బరాయుడు.

"ఏం బాగులేప్పా, సెప్పుకుంటే సిగ్గు బోతాది" అంటూ తలకు చుట్టుకొన్న టువ్వాలు తీసి భుజం మీద వేసుకొని, బ్రోకరాఫీసులో పక్కనున్న బెంచీ మీద కూర్చున్నాడు రామప్ప. అతని పక్కనే ఇంకా ఇద్దరు ముగ్గురు రైతులు ముందే కూర్చొని వున్నారు.

"అదేమన్నా, అట్లంటావ్? ఈసారి వాన్లు బాగొచ్చినాయి గదా" మాటల్లోకి దిగాడు సుబ్బరాయుడు.

"వాన్లు బాగానే వచ్చినాయనుకో, అయితే యేం జేత్తావ్? పైర్లకంతా నున్నగ రోగాలు. టమేటా, ఉల్లిగడ్డ యేసుకున్న మాయట్లా రైతుల గతి ఆ దేవునికే దెల్సు. అంబంలో కుంబమని రేట్లు జూత్తామంటే ముండ మోసినాయ్. అంతో యింతో టమేటా వత్తావుంటే దాన్ని అడిగే నాతుడే లేడు. మార్కెట్టుకు పది గంపలు టమేటా యేసకొస్తే కమిసనూ గిమీసనూ పోయ్, యాభై రూపాయలు సేతికొస్తే దాంట్లో శార్జిలేమీ, పీకిన కూల్లేమి, గంపల కరీదేమి? కరువులో అధిక మాసమన్నట్లు అదేందో గంపకు పావలా దానమంట... ఇంగ వుల్లిగడ్డదనుకుంటే అంతా గబ్బుగబ్బు లేప్పా. నాటినప్పట్నుండే సన్నబిల్లోన్ని జూసుకున్నట్లు సూసుకొని కాపాడుకుంటే తీరా నోటికొచ్చినంక ఈ గబ్బునాకొడుకు వానతో యాడిదాడ కుళ్ళుతాంది. భూమిలో ఉండేది భూమిలోనే, పీకింది పీకినట్లే, తరిగింది తరిగినట్లే కుళ్ళిపోతాంటే ఇంగేమి మొత్తుకుండేది! యాల్జెప్పల్లలేప్పా, రైతు బతుకే అద్దుమాన్నమయిపోయింది" లోనున్న బాధనంతా బయటికి కక్కేసి నిట్టూర్చాడు రామప్ప.

"రైతు బతుకే గాదు, అందర్దీ అట్లే అయిపోయిందిలేన్నా" ఓదార్చాడు సుబ్బరాయుడు.

''మీకేమప్పా, మా రాజులూ! వాన్రాలేదని బాధుందా, ఇత్తనాలెయ్యల్లని బాదుందా, కలుపుదియ్యల్లని – మందు గొట్టల్లని బాదుందా! ఆయిగ నీడపట్టున కాలిమీద కాలేసుకొని సంపాయిత్తారు. మీకేం బాద నాయనా?" పట్నంవాళ్ళ సుఖాన్ని ఎత్తి చూపాడు రామప్ప.

ఈ అనంతపుర మంత ముండమోసిన మార్కెట్టు పెపంచంలో ఇంగెక్కడా ఉండదేమోనప్పా. థూథూ.... మల్లా అంత మోసమా!

"అదేమన్నా, మీరు బాధపడతే మాకూ బాధే కదా!.... మీయట్లాంటి రైతులందరూ బాగుంటేనే మేముబాగుండేదీ, మా వ్యాపారం సాగేదీ... ఇంతకూ ఉల్లిగడ్డ పంట యామాత్రమన్నా?"

"యామాత్రమన్నా యాడిదప్పా, నాల్గెకరాలు నాటింటే వొగలోడు గడ్డలు కూడా నమ్మకం లేదు" అసంతృప్తిని వ్యక్తం చేశాడు రామప్ప.

"అయితే లారీ కావల్లేమన్నా?" గిరాకీ వచ్చిందన్న ఆశతో సుబ్బరాయుడు.

"అందికే గదప్పా వచ్చిండేది. ల్యాకుంటే యేం పనుంది?" వచ్చిన సంగతి చెప్పాడు. రామప్ప.

"యాటికి, బెంగుళూరికా గుంటూరికాన్నా?" పక్కనున్న వెంకటేశ్వరస్వామి పటానికి ఊదుబత్తినంటించి చెక్కుతూ అడిగాడు సుబ్బరాయుడు.

"యాటికో వొగసోటకి తప్పదుగిదప్పా. యాడజూత్తే ఈ మార్కెట్టోల్లు మాయట్లాంటి రైతుల్ని బతకనిచ్చేతట్ల లేరు. ఈ అనంతపురమంత ముండమోసిన మార్కెట్టు పెపంచంలో ఇంగెక్కడా ఉండదేమోనప్పా. థూథూ.... మల్లా అంత మోసమా! యేదో బొత్తిగా సేతులాడకుంటే మొన్నవొగ పది ప్యాకెట్లు వుల్లిగడ్డ లేసకొత్తే రేటేమో ముప్పెజెప్పినారు. తీరా జూత్తే అదీయిదీ అని యేందేందో తీసేసి ఇరవై పకారం సేతికిచ్చినారు దొంగనా కొడుకులు." మార్కెట్టు మోసాన్ని తలచుకొని దేవురించాడు రామప్ప.

"అవునన్నా నువ్వనేది కరెట్టే.... ల్యాకుంటే, వొగొగుడు అంతింత సంపాది

త్తారేమన్నా? వాళ్ళ బిల్డింగులేమి, వాళ్ళ జల్సాలేమి...అంతా కలికాలమన్నా!" పక్కనున్న రైతు, రామప్ప మాటల్ని సమర్థించాడు.

"ఇక్కడంతేనన్నా. ఒక్కటేనాడు షావుకార్లు కావల్లని జూస్తారీ లమ్డీ కొడుకులు. రైతును కడుపీమ్మద గొడితే బాగుపడతారేమన్నా.... దేవుడనేవాడు ఊరకనే ఉంటాడా?" తన నిజాయితీని వ్యక్తం చేశాడు బ్రోకర్.

యాల్లేప్పా, ఐదురాబాదంటే బయమయితాది. అది శానా అద్దువాన్నం మార్కెట్టని బొంగుజెప్తారు.

"కడుపీమ్మద కొడతానే వుండారు, బాగుపడతానే వుండారు గదప్పా... యాదేవుడు గాంగ యేం జేత్తాండాడు? యేందోలే, యేమనుకొని యేం లాభం?.. మాతిప్పలు తప్పవుగాని, యాదోవొగ లారీ సూడు పొద్దుగలగ" తమ బాధ లెవరూ తీర్చలేరన్నట్లు దిగాలుగా అడిగాడు రామప్ప.

"గుంటూరు, బెంగుళూరు పొయ్యే బండ్లేవీ లేవు గదన్నా... ఇదిగో వీళ్ళుగూడా చియ్యేడు నుంచీ వచ్చినారు. బెంగుళూరికి చీనాకాయలలోడ్లుండాయంట. యేందిలే,

ఎన్ని లారీలొచ్చినా ఈ చీనాకాయల సీజన్లో సాలకొస్తాండాయ్. వూరకనే నామాటిని హైదరాబాద్ కేసకపోన్నా, రేటు గూడా బాగానే వుందంట... ఒగ్గంటలో మంచి బండి చూసి పంపిస్తా, బాడిగూడా కాస్తా సలీసేగదా" ఆశపెట్టాడు బ్రోకర్.

"యాల్లేప్పా, ఐదురాబాదంటే బయమయితాది. అది శానా అద్దువాన్నం మార్కెట్టని బొంగుజెప్తారు. యెట్లో గుంటూరికే జూడు, రేటు గూడా పర్వాలేదంటాండారు."

"అది సరేనన్నా, ఆ పక్క బొయ్యే లారీలే లేవు గదా! అదే పనిగ గుంటూరికి రమ్మంటే డ్రైవర్లు బాడిగ శానా డిమాండ్ చేస్తారన్నా. ఇంగ ఆ సిక్కుగాళ్ళుండారే నాయాళ్ళు ససేమిరా అంటే తగ్గించుకోరు... సరే..." అని యేదో చెప్పబోతుండగనే ఫోన్ రింగయింది. సుబ్బరాయుడు. రిసీవర్ పైకెత్తి, "అలో... బెంగుళూరు నుంచేనా!... యెవురు మాట్లాడేదీ...

ఫకర్దీనా... సలాం భై... నేను, అనంతపురం నుండి తిరుమలా బ్రోకర్ సుబ్బరాయుడు మాట్లాడుతాండా, యేం లేదుభై... అక్కడ చీనాకాయల రేటెట్లుంది? ఆఁ.... టన్ను నాలుగువేలా? సరుకు బాగుందిలే భై, మా ఆసాములవి రెండు లోడ్లు పంపుతాండా, మంచి రేటుతో అమ్మించుభై.... అవును భై, ఉల్లిగడ్డ మార్కెట్టు వీకంటాండారు, నిజమేనా... యెంతా.... కింటాల్ డెబ్బై రూపాయలా? మాలు బహుత్ అచ్ఛాభై .... ఆఁ... అంతేనంటావా? సరేభై, పెట్టేస్తా'' రిసీవర్ పెట్టేశాడు సుబ్బరాయుడు.

రామప్ప పక్క జేబులో ఉన్న బీడికట్ట బయటికి తీసి బీడీ మొనభాగాన్ని రెండు వేళ్ళతో ఒత్తి నోట్లో పెట్టుకుని అంటించి దమ్ములాగి పొగ బయటికి వదిలాడు.

ఫోన్లో సుబ్బరాయుడు మాట్లాడింది విని రామప్ప. "థూ దానెమ్మ" అని నిరుత్సాహ పడ్డాడు. పక్కనున్న రైతులిద్దరూ కాస్త సంతోషంగా ఉన్నారు.

"ఏంరా దస్తగిరీ, ఇంతాలస్యంగ వొస్తివి! పొద్దన్నే ఆసాములొస్తారు, కాఫీగీఫీ తెచ్చే పనుంటుందని యెన్నిసార్లు చెప్పాల్రా గాడిదా?'' అప్పుడే సైకిల్ బయటపెట్టి లోనికి వస్తున్న దస్తగిరిని దండించాడు సుబ్బరాయుడు.

''లేదయ్యా, అమ్మయ్య గచ్చులోకి నీళ్ళు పొయ్యమంటే పోసొస్తినయ్యా'' ఆలస్యానికి కారణం చెప్పాడు దస్తగిరి.

"సరే ఘనకార్యం జేసినావుగానీ, పొయ్ అన్నోళ్ళకు నాలుగు మంచి టీలు తీస్కరా'' ఆర్డరిచ్చాడు సుబ్బరాయుడు. దస్తగిరి వెళ్ళిపోయాడు.

"మరేమన్నా, గుంటూరుకు ఫోన్చేసి రేటు కనుకోమంటావా యెట్లా?'' రామప్ప నడిగాడు సుబ్బరాయుడు.

"సరే ఫోన్ జెయ్యప్పా, దాని బండవాలమేమో తెల్సిపోతుంది. పచ్చిసరుకు... మల్లాయాడ...'' ఫోన్ చేయడానికి ఒప్పుకున్నాడు రామప్ప. సుబ్బరాయుడు ట్రంకాల్ బుక్ చేశాడు.

రామప్ప పక్క జేబులో ఉన్న బీడికట్ట బయటికి తీసి బీడీ మొనభాగాన్ని రెండు వేళ్ళతో ఒత్తి నోట్లో పెట్టుకుని అంటించి దమ్ములాగి పొగ బయటికి వదిలాడు. ఆ పొగలో గుంటూరు మార్కెట్టు వైపు చూస్తున్నట్లు దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

చియ్యేడు రైతులకు రెండు లారీలు ఏర్పాటు చేశాడు సుబ్బరాయుడు. ఇద్దరూ చెరి యాభై రూపాయలిచ్చారు. ఫోన్ బిల్లు ముప్ఫై రూపాయలిమ్మన్నాడు.

లారీ నీడలో కూర్చున్న సర్దార్జీ వచ్చాడు. అతనికి రైతుల్ని చూపించి బెంగుళూరుకు చీనాకాయలు వేసుకుపోవాలని ఉర్దూలో చెప్పాడు బ్రోకర్.

"యేందప్పా, యీడుండే బెంగుళూరికి ఫోన్ జేత్తే ముప్ఫై రూపాయలా" అంటూ గొణిగాడొక రైతు.

"మొన్ననే ఫోన్ చార్జీలు పెంచినారన్నా. ఇంకా మేలనుకో, టెలిఫోనాఫీసులో మనకు తెల్సినోళ్ళుండారు గాబట్టి మానమయింది. అందాజుగా ముప్ఫై అన్నాను గానీ నాల్గైదు రూపాయలెక్కువే అయ్యుంటుంది. అవన్నీ నేను పట్టించుకోనన్నా. అట్ల పట్టించుకుంటే సాయంత్రానికి యాభై రూపాయలు కాఫీ టీలకే అయితుంది..." అంటుండగనే దస్తగిరి టీలు తెచ్చాడు. వాడు అందరికీ టీ గ్లాసులందిస్తూ రామప్ప వైపు ఎగాదిగా చూశాడు. రామప్ప బెంచీపక్క భాగానికి బీడినొత్తి ఆర్పేసి టీ గ్లాసందుకొని టీ చప్పరిస్తున్నాడు.

ఎదురుగా ఉన్న లారీ నీడలో నేలమీద లారీ సీట్ వేసుకొని కూర్చున్నాడు డ్రైవర్ సర్దార్జీ. క్లీనర్లిద్దరూ జాకీ ఎత్తి టైర్ బయటికి తీయడానికి నట్లు విప్పుతున్నారు. దస్తగిరి ఖాళీ టీ గ్లాసులు తీసుకొని బయటికి పోతూ ఉంటే రామప్ప ఆ కుర్రోణ్ణి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఆవో భై, సర్దార్జీ" సుబ్బరాయుడు పిలిచాడు.

లారీ నీడలో కూర్చున్న సర్దార్జీ వచ్చాడు. అతనికి రైతుల్ని చూపించి బెంగుళూరుకు చీనాకాయలు వేసుకుపోవాలని ఉర్దూలో చెప్పాడు బ్రోకర్. లారీ బాడుగ వెయ్యి రూపాయలన్నాడు. పది పర్సెంటు తన కమీషనన్నాడు. రెండు బండ్లకూ కమీషన్ రెండొందలిప్పించుకొని జేబులో పెట్టుకున్నాడు. రైతులిద్దర్నీ డ్రైవర్ తోబాటు పంపించేశాడు. సుబ్బరాయుడు బయటకెళ్ళి వాళ్లతో ఏదో చెప్పి లోనికి వస్తూండగానే ఫోన్ రింగయింది.

రిసీవర్ పైకెత్తి, "అలో గుంటూరా? యెవురు మాట్లాడేదీ? నమస్కారమన్నా కోటప్పన్నా! నేను, అనంతపురం లారీ బ్రోకర్ సుబ్బరాయుడు మాట్లాడుతాండా.

ఏం లేదూ, ఉల్లిగడ్డ రేటెట్లుందన్నా?... ఆః... నూటా ఇరవై రూపాయలా, రెండు మూడు రోజుల్లో రైజయ్యే పొజిసనుందా, సరేనన్నా... సరుకా... బ్రహ్మాండగా వుందిలేన్నా, సరే, పెట్టేస్తానన్నా" రిసీవర్ పెట్టేశాడు సుబ్బరాయుడు.

రామప్ప మొగంలో చిరునవ్వు చిందులాడింది.

"అదృష్టవంతునివిలేన్నా, నువ్వు జెప్పినట్లే గుంటూర్రేటు బాగనే వుంది. పది నిమిషాలు కూచ్చో, లారీ మాట్లాడొస్తాను" అంటూ బయటికెళ్ళాడు రాయుడు. అప్పుడే ఎన్.పి. బండి వచ్చి దూరంగా గుడి దగ్గర ఆగింది.

నేం జెప్పలేదేమన్నా గుంటూరంటే ఆ సిక్కు నాయళ్ళు రారనీ. ఆ నాయాళ్ళని వొప్పించాలంటే దేవుడు దిగొస్తాడు.

రామప్ప మళ్ళీ ఒక బీడీ తీసి నోట్లో పెట్టుకొని అంటించాడు. రెండు మూడు దమ్ములకి బీడి బాగా అంటుకుంది. నాలుగో దమ్ములాగి పొగ బయటికి వదిలాడు. ఆ పొగల రింగుల్లోకి చూస్తూ ఉల్లిగడ్డ పంటవల్ల తన చేతికి ఎంతొచ్చేదీ లెక్కవేసుకుంటూ ఆలోచిస్తున్నాడు. తమ వుల్లిగడ్డల్ని చూడకపోయినా ఫోన్లో సరుకు బ్రహ్మాండంగావుందన్న సుబ్బరాయుని మాటల్ని జ్ఞప్తికి తెచ్చుకొని మరో దమ్ము లాగాడు రామప్ప. మరో ఇద్దరు రైతులు వచ్చి పక్కన కూచున్నారు.

"నేం జెప్పలేదేమన్నా గుంటూరంటే ఆ సిక్కు నాయళ్ళు రారనీ. ఆ నాయాళ్ళని వొప్పించాలంటే దేవుడు దిగొస్తాడు. ఎట్లోగట్ట వొప్పిస్తే బాడిగ దిక్కులేకుండా అడుగుతారు" అంటూ లోనికివచ్చి సుబ్బరాయుడు కొత్తగా వచ్చిన రైతుల్ని మాట్లాడించి ఫోన్ దగ్గర కూర్చున్నాడు.

"యామాత్రం అడిగినారప్పా?" బరువుగా అడిగాడు రామప్ప.

"అయ్యో, వాళ్ళడిగినంతిస్తే రైతేమైపోవాలన్నా? మల్లా అంతాశా? రెండువేలడుగుతాడు గలీజు నాకొడుకు... ఒగ్గంట సేపు కూచ్చోన్నా, యేదో ఒకటి అరేంజేస్తాను" తేలిగ్గా చెప్పాడు సుబ్బరాయుడు.

ప్రతి రోజూ ఉల్లిగడ్డ మార్కెట్టు డవునయ్యే పోజిషన్ తలుచుకొని రామప్ప

ఆందోళన చెందాడు. అతనికి ఉల్లిగడ్డ మార్కెట్టును గురించి రెండు మూడేళ్ళ అనుభవముంది. అందుకే మనసు వేగిరపడింది. గుంటూర్రేటు బాగానే ఉంది. బాడిగ రేటు దుబారా అయినా వేసుకుపోవడం మంచిదనిపించింది. పైగా ఇప్పుడు డబ్బుల్తో శానా కసాలాగా ఉంది. శానా రోజులు పెట్టుకుంటే సరుగ్గూడా దెబ్బతింటుంది, వచ్చినంత రానీ – అనుకున్నాడు.

గంట లోపల ఏదో ఒక లారీని పంపుతానన్న సుబ్బరాయుడు ఇంతలోనే రేప్పొద్దున పంపుతాననడం రామప్పకు ఆందోళన కలిగించింది.

"యెట్లన్నాగా నీ పద్దైదు నూర్లకొప్పించప్పా" మెల్లగా అడిగాడు. ఆ మాటల్లో చెప్పరానంత దైన్యం. ఈ బాధల్ని తప్పించుకోలేనంత నిస్సహాయత.

"పద్దైదుకయితే వొప్పుకుంటాడనుకో, అయినా యెందుకన్నా అంతాత్రం? సాయంత్రం దాకా తట్టుకుంటే చెళ్ళికెరకు పోయిన బండ్లొస్తాయి. యాదో వొకటి మాట్లాడి రేప్పొద్దున పంపిస్తాను గదా" రామప్ప ఆదుర్దాను పరీక్ష చేస్తున్నట్లు చెప్పాడు సుబ్బరాయుడు.

గంట లోపల ఏదో ఒక లారీని పంపుతానన్న సుబ్బరాయుడు ఇంతలోనే రేప్పొద్దున పంపుతాననడం రామప్పకు ఆందోళన కలిగించింది. బాడుగ దుబారా అయినా చింతలేదనుకున్నాడు. పద్దైదు నూర్లకే మాట్లాడమన్నాడు. సరేనని సుబ్బరాయుడు మళ్ళీ బయటికెళ్ళి లారీ డ్రైవర్ తో తిరిగొచ్చాడు. రామప్పను చూపించాడు. బాడుగ పద్దైదు నూర్లన్నాడు. తన కమీషన్ పది పర్సెంటన్నాడు. డ్రైవర్ దగ్గర్నుండీ నూటాయాభై రూపాయలిప్పించుకొని జేబులో పెట్టుకున్నాడు. 'ఇంక నువ్వా' అన్నట్లు రామప్ప వైపు చూశాడు బ్రోకర్.

రామప్ప లోపలి బనీన్ జేబులో నుంచీ తీసి చిల్లర నోట్ల కట్ట ఇచ్చాడు. సుబ్బరాయుడు నోట్లెంచుకొని "యాభై ఇస్తే యెట్లన్నా?" అనడిగాడు.

"ఫోన్ జేసిందొకటే గదప్పా యింగ ఇయ్యల్సిందేంది? పదో యిరవయ్యో యియ్యల్సింటే, లేదు, ఇసారొచ్చినప్పుడిత్తాలే" భుజమ్మీద టువ్వాల మార్చుకొంటూ చెప్పాడు రామప్ప.

"అదేందన్నా ఇరవయ్యంటావ్, నూటికైదు ప్రకారం కమీషనే దెబ్బై. ఇంగ ఫోన్ బిల్లు కనిష్టమంటే యాభై. అంతా నూటా యిరవై అయితుంది." లెక్క చెప్పాడు బ్రోకర్.

టమేటా డబ్బులిప్పించుకొని బిరబిరా సంత చేసుకోవల్లని రామప్ప త్వరత్వరగా మార్కెట్లోకి నడిచాడు.

"గుంటూరుకు ఫోన్ చేత్తే యాభై రూపాయలేమప్పా?" బాధగా ప్రశ్నించాడు రామప్ప.

"ఇదే మీ రైతుల్తో వచ్చిండేదన్నా! ఫోన్ బిల్లు మా యింటికొచ్చినట్ల బాధపడతారు. ఇపుడు నీ యెదురుగానే ఫోన్ బిల్లెంతైందో అడుగుతాను. నువ్వే వినన్నా" అంటూ కాస్త కోపంగా రిసీవర్ యెత్తబోయాడు సుబ్బరాయుడు.

"యాలడుగుతావు లేప్పా, పదీ పదైదు రూపాయలకాడేమి గానీ, మల్లా యిత్తాలే" వెగటుగా నవ్వాడు రామప్ప.

"బ్రోకరాఫీసులో అప్పు బెడితే యెట్లన్నా? మీరు మల్లా వచ్చేది సంవత్సరానికే. డ్రైవర్తో ఇప్పించుకుంటాను. నువ్వు బాడిగిచ్చేటప్పుడు అతనికిస్తువులే" అంటూ డ్రైవర్ దగ్గర్నుంచి దెబ్బై ఐదు రూపాయలిప్పించుకున్నాడు బ్రోకర్.

రామప్ప చిన్నగా నిట్టూరుస్తూ డ్రైవర్ వెంట బయటికి నడిచాడు. టైర్ మార్చుకొని గంట లోపల లారీ రెడీ చేస్తామని, త్వరగా పని చూసుకొని రమ్మని వచ్చీరాని తెలుగులో చెప్పి రామప్పకు లారీ చూపించాడు డ్రైవర్.

టమేటా డబ్బులిప్పించుకొని బిరబిరా సంత చేసుకోవల్లని రామప్ప త్వరత్వరగా మార్కెట్లోకి నడిచాడు.

ఇంకా ఐదు గంపల్లో తమ టమేటా అట్లే ఉంది. సరుకు బాగా లేదనీ, అడిగే నాథుడే లేదనీ, చాలా కష్టపడి పది గంపలమ్మినామనీ కమీషనంగడి ఏజెంట్ జాఫర్ సాబ్ చెప్పుతూ ఉంటే రామప్ప నోరులేని వాడయ్యాడు. చిల్లరగా కేజీ మూడు రూపాయమ్ముతాండారు. ఈళ్లు జూత్తే మణువు గంపను పది రూపాయలకడిగే వాళ్లు లేరంటాండారు, యెంతన్నాయం? సరుకు బాగ లేదంట! ఈనాయళ్ల కేం, నీడలో గుచ్చోని యెన్నయినా మాట్లాడతారు' అని

మథనపడ్డాడు రామప్ప.

జాఫర్ సాబ్ అమ్మిన పది గంపల టమేటాకు నూర్రూపాయలు లెక్కవేసి కమీషన్, కూలీ గీలీ, దానంగీనం, అన్నీ తీసేసి డెబ్బై రూపాయలు రామప్ప చేతికిచ్చాడు. రామప్ప నోట్లను లెక్క బెట్టుకుంటూ టమేటా నాటినప్పట్నుంచీ ఎండలో దాన్ని ఎలా కాపాడిందీ, ఎన్నిసార్లు కలుపు తీసిందీ, ఎన్నిసార్లు మందు కొట్టిందీ జ్ఞప్తికి తెచ్చుకునేసరికి ఆవేదనతో అతని పెదవులెండుకుపోయాయి.

యూరియా సంచిలో సరుకులు మూట గట్టుకొని రామప్ప ముందుకు నడిచాడు. ఎదురుగా జామపళ్ళ బండి.

ఇంకా మిగిలిన అయిదు గంపల టమేటా విషయం మాట్లాడాడు జాఫర్, సరుకు బాగాలేదనీ, మదనపల్లి సరుకు ముందు ఇది పనికి రాదనీ, మార్కెట్టు శానా మందమైపోయిందనీ, రేపెంతకుపోతే అంతకమ్ముతాననీ, లేకుంటే ఎనిమిది రూపాయలకు గంప ప్రకారం నలభై రూపాయలకు కమీషన్ పోనూ ముప్పైయారిస్తాననీ చెప్పాడు.

రామప్ప చెమట పట్టిన ముఖాన్ని టువ్వాలుతో తుడుచుకొని "మాకీ గతి కల్పించిన పాపానికి ఫలిత మనుభవించ" మన్నట్లు కోపంతో ఎర్రగా తన ముఖంలోకి చూస్తున్న గంపలోని టమేటా పళ్ళను అలాగే చూడసాగాడు కాసేపు.

అతని మౌనాన్ని అంగీకారంగా భావించి జాఫర్ సాబ్ ఆ పళ్ల గంపలన్నీ కట్టగట్టి అతని దగ్గర పడేశాడు. గంపల డబ్బులుపోనూ మిగతా పదారు రూపాయలు రామప్ప కందించాడు జాఫర్. అతని చేతులు అసంకల్పితంగా అందుకున్నాయి. కాళ్ళు బయటికి నడిచి మార్కెట్టు కెదురుగా ఉన్న కిరాణాషాపు దగ్గరికి చేరుకున్నాయి.

యూరియా సంచిలో సరుకులు మూట గట్టుకొని రామప్ప ముందుకు నడిచాడు. ఎదురుగా జామపళ్ళ బండి. దాన్ని చూడగానే ఇంట్లో సన్నోడూ, పెద్దోని కొడుకులూ, నడిపోని బిడ్డలూ కళ్ళముందు మెదిలారు. తాను టౌనుకొచ్చి వాళ్ళకేమైనా తీసుకుపోగల్గితే జామపండ్లు మాత్రమే. బేరమాడి డజను పండ్లు తీసుకొని టువ్వాల్లో వేసుకున్నాడు.

"రామప్పామా, లారీ రెడీ అయిందంట, తొరగా రావల్లంట" ఎవరో పిలిచారు.

ఎవరో కొత్త మనిషి 'మామా' అని పిలిచేసరికి ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు రామప్ప. ఎదురుగా దస్తగిరి. ఎగాదిగా చూడసాగాడు రామప్ప.

"నేను మామా, గుర్తు బట్టలేదా! దూదేకుల వొన్నూరప్ప కొడుకును" పరిచయం చేసుకున్నాడు దస్తగిరి.

కాఫీ తాగి పోదాంలే మామా, మూటిక్కడే బెట్టు. ఈ పండ్లాయన మనవాడేలే, చూస్తాంటాడు.

"వోర్నాయిలా నువ్వారా– నేను టీ తాగేటప్పుడే అనుకుండా, వీన్ని యాడో చూసినట్లుందే యెవురి పిల్లోడబ్బా అని. దొంగబడవా, అప్పుడే చెప్పల్లా లేదా? మొన్నొగసారి మీ నాయిన కనిపిచ్చి నీ సంగతంతా సెప్పితే నేనేందోలే అనుకుండా అయితే యీడుండావన్నమాట" టువ్వాల్లో పండ్లు మూటగట్టుకొంటూ అడిగాడు రామప్ప.

"అవును మామా, మనూర్లో బతకడానికి మల్లేముంది చెప్పు" తన పనిని సమర్థించుకున్నాడు దస్తగిరి.

"మంచి పన్జేసినావు లేవోయ్. తప్పేముందిలే. అయితే సుబ్బరాయుడు దగ్గరుండావన్నమాట– సరే పదాం పద" అని మూటనెత్తుకోసాగాడు రామప్ప.

"కాఫీ తాగి పోదాంలే మామా, మూటిక్కడే బెట్టు. ఈ పండ్లాయన మనవాడేలే, చూస్తాంటాడు".

కాఫీకి పిలిచాడు దస్తగిరి, రామప్పను. మూన్నాలుగేండ్లకే మాట తీరూ, వేషం అంతా మారిన దస్తగిరిని చూస్తూ ఆశ్చర్యపోతూ అతని వెంట నడిచాడు రామప్ప. ఇద్దరూ పోస్టాఫీసు దగ్గరున్న షన్ముగ విలాస్ వైపు నడవసాగారు.

"మా షావుకారి దగ్గరికి లారీ కోసమొచ్చింటివా మామా?" అడిగాడు దస్తగిరి.

"వొగ లోడు వుల్లిగడ్డలుంటే గుంటూరు కేసకపోదామని వచ్చింటి" నిండుగా చెప్పాడు

"మరి లారీ కుదిరిందా?"

"లారీ యేమో కుదిరింది గానీ బాడిగే శానా దుబారప్పా, యేం జేత్తాం– నిర్వాకం లేదు".

"మా షావుకారేమీ తగ్గించి మాట్లాల్లేదా మామా?"

"యేం తగ్గించడమో యేమోనప్పా, లారీకని వొత్తే కమీసననీ ఫోన్ జేసిన దానికనీ అదనీ యిదనీ దుడ్లు మాత్రం బొలే గుంజుతార్రా నాయనా – సూత్తావుంటే మీ సావుకారిది మంచి శాన్సున్నట్లుంది– లెక్క బాగ సంపాయిచ్చినాడనుకుంటా".

నిజం మామా, నువ్వుండూరోనివి కాబట్టి నిజం చెప్పుతాండా, ఆ ఫోన్లూ గీన్లూ అంతా అపద్దం. ఫోన్లో గుంటూరోళ్ళతో మాట్లాడేదీ, బెంగళూరోళ్ల తో మాట్లాడేదీ అంతా బూటకం.

"ఎందుకు సంపాదించడు మామా? మీలాంటి రైతులొస్తే ఆయనకు పండగ. నిజం చెప్పితే నువ్ నమ్ముతావో లేదో గానీ దినానికి రెండు వేలు సంపాదిస్తాడనుకో. సంపాదించనీ, మల్లా అంత మోసమా మామా!" రామప్ప ముఖంలోకి చూస్తూ అన్నాడు దస్తగిరి. మోసమనే సరికి యేమీ అర్థంగాక రామప్ప బిక్కమొగం వేశాడు.

"నిజం మామా, నువ్వుండూరోనివి కాబట్టి నిజం చెప్పుతాండా, ఆ ఫోన్లూ గీన్లూ అంతా అపద్దం. ఫోన్లో గుంటూరోళ్ళతో మాట్లాడేదీ, బెంగళూరోళ్లతో మాట్లాడేదీ అంతా బూటకం. రెండు మూడు సార్లు నేను గమనించినాను, ఇంట్లో కొడుకుతో అంతా ముందే చెప్పి మీ యెదురూగ యా వూరికి ఫోనెయ్యల్లో ఆ వూరికి చేసినట్లు రింగు దిప్పడం, అర్ధగంట తర్వాత యింట్లో నుంచీ కొడుకు ఫోన్ జేస్తే గుంటూర్నుంచో, బెంగుళూర్నుంచో ఫోన్ వచ్చిందని గట్టిగా అరుస్తూ, యా రైతు ఫోన్ జెయ్యమని చెప్పింటాడో ఆ రైతు కనుకూలంగా మాట్లాడి నమ్మించడం మా షావుకారికి బ్రహ్మాండంగా తెల్సు మామా. దాంతో రైతులూ, చిన్న చిన్న వ్యాపారస్తులూ నిజమేననుకొని నమ్మి తమ మాసూలుకు మంచి రేటుందని నమ్మి లారీ బాడుగ యెంత జెప్పితే అంతకే వొప్పుకుంటారు. మీ పిచ్చి కాకపోతే యేంది మామా, గుంటూరుకు పన్నెన్నూర్లిస్తే యా లారీ వాడైనా యెగురుతా వస్తాడు. ఇది తెల్సుకోకుండా మీరు బ్రోకర్ల దగ్గరికే వస్తారు, వీళ్ళు మీతో కమీషన్, డ్రైవర్లతో కమీషన్ కొట్టడమే గాకుండా

మామూలుగా నడిచే బాడిగ కంటే యెక్కువ మాట్లాడిన దాంట్లో సగం గుంజుతారు. లేకుంటే యేంది మామా, పది పైసలు పెట్టుబడి లేకుండా, పొట్ట చించితే అక్షరం రాకపోయినా బ్రోకరాఫీసని బోర్డేసుకొన్న నాయాళ్ళు యేం సంపాదించినారనీ! చెప్పితే నువ్వాశ్చర్యపోతావ్, మా షావుకారి కట్టించిన బిల్డింగు చూస్తే కండ్లు తిరుగుతాయనుకో. నాలుగు లారీలు సొంతముండాయ్. మొన్ననే శ్రీ కంఠం టాకీసు దగ్గర నాలుగు షాపులు కట్టించినాడు. గుత్తిరోడ్లో రెండెకరాల ప్లాటు కొన్నాడు. అనుకుంటే ఆశ్చర్యం మామా, ఇట్లా బ్రోకరాఫీసులు ఇంగా ఏడెనిమిదుండాయి టవున్లో. అందరూ యింతే– నీతేందో, న్యాయమేందో, ధర్మమేందో అంతా అయోమయం" దస్తగిరి బ్రోకర్ల కథంతా కక్కేశాడు.

> మా షావుకారి కట్టించిన బిల్డింగు చూస్తే కండ్లు తిరుగుతాయనుకో. నాలుగు లారీలు సొంతముండాయ్. మొన్ననే శ్రీ కంఠం టాకీసు దగ్గర నాలుగు షాపులు కట్టించినాడు.

ఆశ్చర్యంతో వింటున్న రామప్ప కాసేపు తేరుకోలేకపోయాడు. సుబ్బరాయుని బ్రోకరాఫీసంతా పొద్దున్నుంచీ గమనించిందతా కళ్ళముందు కనిపించింది. మరోవైపు కూరగాయల మార్కెట్టూ, టమేటా గంపలూ, జాఫర్, అతని కథా కమామిషూ అంతా కనిపించింది.

అప్రయత్నంగా అతని నోరు మెదలింది. "వారి యీనెమ్మ కడుపులు గాలా, ఎంత మోసంరా దొంగ నా కొడుకులు! థూ థూ, అంతా బద్దు నాయాళ్ళే!" అని కేకరించి ఉమ్మాడు.

అదేమీ పట్టించుకోకుండా బజార్లో రిక్షాలూ, సైకిళ్ళూ, కార్లూ, బస్సులూ అన్నీ తిరుగుతూనే ఉన్నాయి. కాలేజీ విద్యార్థులు దేని కోసమో ఊరేగింపుగా వస్తూనే వున్నారు. రాజకీయ నాయకులెందుకో "రేపు అనంతపురం బంద్" అని జీపులో కూర్చొని మైకులో ప్రకటన చేస్తూ ఉన్నారు.

ఆంధ్రప్రభ, వీక్లీ, 10 –5–89

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# 'దళారీ' దగా పిడికిళ్లలో రైతు జీవితం



డాక్టర్ పొదిలి నాగరాజు
90520 38569

"పదిపైసలు పెట్టుబడి లేకుండా, పొట్టచించితే అక్షరం రాకపోయినా బ్రోకారాఫీసు బోర్డేసుకున్న నాయాళ్లు యేం సంపాదించినారనీ! చెప్పితే నువ్వాశ్చర్యపోతావ్, మా షావుకారి కట్టించిన బిల్డింగుచూస్తే కండ్లు తిరుగుతాయనుకో" దళారి కథలో దస్తగిరి పాత్ర ఆధారంగా రచయిత చెప్పిన మాటలివి. కమీషన్ల పేరుతో రైతును మోసం చేసే దళారి వ్యవస్థ అన్యాయాన్ని సభ్యసమాజానికి, రైతు వర్గానికి తెలియజేయటమే 'దళారీ' కథా ఇతివృత్తం. దళారీ వ్యవస్థ పెచ్చుమీరితే వ్యవసాయరంగంలో రైతుబతుకు చీడముట్టిన పంటలా చితికిపోతుందనే వాస్తవానికి ఈ కథ దర్పణం పడుతుంది. డా॥ శాంతి నారాయణ ఈ కథను 1985లో రచించాడు. మే 10న ఆంధ్రప్రభ వీక్లీలో ఇది అచ్చయింది. పేద రైతు కుటుంబంలో పుట్టిన శాంతినారాయణకు రైతు జీవితంలోని ప్రతి అణువు ఎరుకే. అందుకే శాంతినారాయణ రాసిన రైతు కథల్లో పతనమౌతున్న రైతే మనకు కనిపిస్తాడు. రాయలసీమలో వ్యవసాయం కత్తి మీద సాములాంటిది. దీనికి కారణం కరువు పురుగు. ఇది సీమరైతుకు అలవాటైన పురుగే. ఇది కాకుండా కథా కాలానికి కొత్తగా రైతును ముట్టిన మరో చీడ పురుగు దళారి వ్యవస్థ. దీనిని నులిపేయకపోతే భవిష్యత్తు రైతులేని సమాజాన్ని చూడవలసి వస్తుందన్న ఆవేదనను రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు. ఇది అనంతపురం నుండొచ్చిన కథ. కథా కాలానికి అనంతపురం మార్కెట్టులో కమీషన్దార్లు రైతు చుట్టూచేరి రైతు కష్టాన్ని పీక్కుంటున్న తీరును దళారి కథ చక్కగా చిత్రించింది.

రామప్ప అనంతపురం జిల్లాకు చెందిన రైతు. తన నాలుగెకరాలలో పండించిన ఉల్లి పంటను అతను అనంతపురం మార్కెట్టులో అమ్మటానికి ఇష్టపడడు. దానిని గుంటూరు సంతలో అమ్ముకోవాలనుకొని లారీ కోసం

లారీ బ్రోకరు సుబ్బరాయుడు ఆఫీసుకు వెళ్తాడు. రామప్ప కన్నా ముందే ముగ్గురు రైతులు అప్పటికే సుబ్బరాయుడు ఆఫీసులో వుంటారు. తాము పండించిన చీనీకాయల పంటను బెంగుళూరు సంతలో అమ్ముకోవటానికి లారీల కోసం వచ్చింటారు. రైతుల్ని మోసం చేయటంలో లారీబ్రోకరు సుబ్బరాయుడిది అందవేసిన చేయి. పైగా వెంకటేశ్వర స్వామి సాక్షిగా రైతును మోసం చేసే కమీషనుదారుడు. సుబ్బరాయుడు ఇంటివద్ద నుంచి రావటానికి ముందే ఇంట్లో కొడుక్కి అరగంట కొకసారి ఫోను చేస్తూవుండమని చెప్పొస్తాడు. కొడుకు ఫోను చేసిన ప్రతీసారి ఆఫీసులో తన వద్దకు లారీల కోసం వచ్చిన రైతులకు అనుకూలంగా మాట్లాడుతూ రైతుల్ని బురిడీ కొట్టిస్తుంటాడు. ఇదేవిధంగా బెంగుళూరు సంతోళ్లతో మాట్లాడినట్టు నటించి చీనీకాయల రైతులను నమ్మించి రెండు లారీలను బాడుగకు మాట్లాడి అటు రైతుల దగ్గర ఇటు లారీ డ్రైవర్ల వద్ద కమీషన్ తీసుకుంటాడు. ఇదే పంథాతో రామప్పను నమ్మించి ఎక్కువ కమీషన్ను లాక్కుంటాడు. రామప్ప సుబ్బరాయుడి వద్దకు రాకముందే పదైదు టమోటా గంపలను మార్కెట్టులో కమీషనంగడి ఏజెంటు జాఫరుకు కమీషను తీసుకొని అమ్మిపెట్టమని అప్పగించొచ్చింటాడు. ఆ డబ్బు కోసం రామప్ప జాఫర్ దగ్గరికి వెళ్తాడు. పదిగంపలమ్మిన జాఫర్ అవన్నీ అతికష్టం మీద అమ్మామనీ అందులో తన కమీషను, కూలీనాలీ పోగా మిగిలిన డెబ్బైరూపాయిల్ని జాఫర్ రామప్ప చేతిలో పెడతాడు. కేజీ టమోటాలు మూడు రూపాయిలమ్మేచోట పది మణువుల టమోటాకు డెబ్బై రూపాయిలు రావటంతో రామప్ప బాధపడిపోతుంటే మిగిలిన ఐదుగంపలకు జాఫరు పదిహారు రూపాయిలివ్వటం రామప్పను ఇంకా కుంగదీస్తుంది. అసంతృప్తిగానే అక్కడి నుంచి బయలుదేర్తాడు. కిరణాకొట్టులో ఇంటి సామాన్లను మూటకట్టించుకొని ఊరికి బయలుదేరుతుండగా సుబ్బరాయుడు బ్రోకరాఫీసులో పని చేసే దస్తగిరి వెనుక నుంచి 'రామప్ప మామా' అని పిలుస్తాడు. ఇద్దరూ కలుసుకోవటంతో దస్తగిరి తనూరి వాడేనని రామప్ప తెలుసుకుంటాడు. దస్తగిరి రామప్పను

> సుబ్బరాయుడు ఇంటివద్ద నుంచి రావటానికి ముందే ఇంట్లో కొడుక్కి అరగంట కొకసారి ఫోను చేస్తూవుండమని చెప్పొస్తాడు.

టీ తాగటానికి తీసుకెళ్ళి సుబ్బరాయుడు రైతుల్ని మోసం చేసే తీరునంతా టీ అంగట్లో రామప్పకు వివరిస్తాడు. రామప్ప మొదట్లో ఆశ్చర్యపోతాడు. తర్వాత బ్రోకరు సుబ్బరాయుడ్ని, ఏజెంటు జాఫర్ని కలిపి తిడతాడు. రైతుకు ఇంత అన్యాయం జరుగుతున్నా మార్కెట్టులో తిరిగే జనంగానీ, విద్యార్థులుగానీ, రాజకీయ నాయకులుగానీ తమకేమీ పట్టనట్టు వారి పనులు వారు చేసుకుంటూ వెళ్తూవుంటారు. ఇది కథాంశం.

**కరువు రాక్షసి చేతిలో నలిగిన రైతు కుటుంబాలు ప్రతిపల్లెలోనూ మనల్ని పలకరిస్తుంటాయి.**

రాయలసీమలో కథ ఇతర ప్రాంతాలతో పాటే పుట్టినా సీమకథకి, ఇతర ప్రాంతల కథకీ మధ్య విభిన్న ధోరణి ఒకటి కనిపిస్తుంది. దీనిని రాయలసీమ నేపథ్యమే కారణం. ఇక్కడ నీళ్లకన్నా కన్నీళ్ళే ఎక్కువగా కనిపిస్తాయి. సుఖపడిన జీవితాలకంటే ఛిద్రమైపోయిన బతుకులే వాసన తగులుతుంటాయి. కరువు రాక్షసి చేతిలో నలిగిన రైతు కుటుంబాలు ప్రతిపల్లెలోనూ మనల్ని పలకరిస్తుంటాయి. వానలు పడక, పంటలు పండక పదెకరాలున్న ఆసాములు సైతం గుక్కెడు గంజికోసరం పరుగులు తీసిన చరిత్ర ఇక్కడే పొరాడుతూ కనిపిస్తుంది. ఇన్ని బాధలతో పురుడు పోసుకోవటం వల్లనే ప్రతి సీమకథ జీవాన్ని అద్దుకొన్నట్లుంటుంది. అటువంటిదే దళారి కథ. డాక్టరు శాంతినారాయణ కథా రచన గురించి ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు ఇలా చెబుతారు. "రాయలసీమ రైతు జీవన పతనం శాంతినారాయణ ప్రధాన కథా వస్తువు. ఆ పతనానికి శాంతి నారాయణ మూడు కారణాలను తన కథల్లో చిత్రిస్తాడు. మొదటిది రాయలసీమకు ప్రకృతి చేస్తున్న ద్రోహం. రెండవది బ్రిటీష్ వారితో ప్రారంభించి, స్వాతంత్ర్యానంతరం ఆంధ్రదేశంలో అధికారానికి వచ్చిన ప్రతి ప్రభుత్వమూ చేసిన ద్రోహం. మూడవది రైతు శ్రమ ఫలితాన్ని రైతుకు దక్కనివ్వని దళారీ వ్యవస్థ" అని తన రాయలసీమ ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (పుట:189)లో చెప్పాడు. వల్లంపాటి చెప్పిన మూడవ అంశం సారాంశమే దళారీ కథ.

"వాన్లు బాగానే వచ్చినాయనుకో, అయితే యేం జేత్తావ్? పైర్లకంతా నున్నగ రోగాలు. టమోటా, ఉల్లిగడ్డ యేసుకున్న మాయట్లా రైతులగతి ఆ దేవునికే దెల్సు.

అంబంలో కుంబమని రేట్లు జూత్తామంటే ముండమోసినాయ్. అంతియింతో టమోటా వత్తావుంటే దాన్ని అడిగే నాతుడే లేదు. మార్కెట్టుకు పదిగంపలు టమోటా యేసుకొస్తే కమిసనూ గిసనూ పోయ్, యాభై రూపాయిలు సేతికొస్తే దాంట్లో శార్జీలేమి, పీకిన కూల్లేమి, గంపల కరీదేమి? కరువులో అధిక మాసమన్నట్లు అందెందో గంపకు పావలాదానమంట.... ఇంగ వుల్లిగడ్డలదనుకుంటే అంతా గబ్బుగబ్బులేప్పా. నాటినప్పెట్నుంచే సన్నబిల్లోని జూసుకున్నట్లు సూసుకొని కాపాడుకుంటే తీరా నోటికొచ్చినంక ఈ గబ్బునాకొడుకు వానతో యాడిదాట కుళ్ళుతాంది. భూమిలో వుండేది భూమిలోనే పీకింది పీకినట్లే, తరిగింది తిరిగినట్లే కుళ్ళిపోతాంటే ఇంగేమి మొత్తుకుండేది! యాల్లెప్పల్లలేప్పా, రైతు బతుకే అద్దుమాన్నమయిపోయింది” అంటూ రైతు ఆవేదనతో కథ మొదలవుతుంది. రైతాంగాన్ని ఒకవైపు ప్రకృతి, మరోవైపు దళారీ వ్యవస్థ ఎలా ఒలుచుకు తింటున్నాయో రచయిత దళారీ కథ ఆధారంగా సూచించాడు. ఇందుకు కథలో రెండు అంశాలను చిత్రించాడు. ఒకటి రైతును మోసం చేసే దళారి వ్యవస్థ, రెండవది తెలిసీ దళారీల చేతిలో మోసపోతున్న రైతాంగం. ఈ రెండింటితోపాటు కథలో రైతు పక్షాన నిలబడి రైతును మేల్కొలిపే ప్రయత్నం చేసిన దస్తగిరి పాత్ర.

రైతుకు, మార్కెట్టుకు మధ్య రాయబార తంతుతో మొదలైంది దళారీ వ్యవస్థ. రైతుకు సహాయం చేయాలనే ఉద్దేశంతో పుట్టిన ఈ వ్యవస్థ రైతును మోసం చేసి సొమ్ము చేసుకొనే దారుణస్థితికి మారిపోయింది.

రైతుకు, మార్కెట్టుకు మధ్య రాయబార తంతుతో మొదలైంది దళారీ వ్యవస్థ. రైతుకు సహాయం చేయాలనే ఉద్దేశంతో పుట్టిన ఈ వ్యవస్థ రైతును మోసం చేసి సొమ్ము చేసుకొనే దారుణస్థితికి మారిపోయింది. ఇది రోజురోజుకూ ప్రతి పనికీ కమీషన్లను అతికించుకొని వాటిని రాబట్టే ప్రతయ్నంలో అత్యాశకులోనై రైతుల్ని అన్ని విధాలా ఊబిలోకి నెట్టేసేవిధంగా తయారయింది. ఈ రకంగా కథలో రైతును మోసం చేసే వాళ్ళు ఇద్దరు. ఒకరు లారీ బ్రోకరు సుబ్బరాయుడు. మరొకరు కమీషనం గడి ఏజెంట్ జాఫర్. ఈ ఇద్దరి చేతుల్లో నలగుతూ నష్టపోయిన రైతు రామప్ప. లారీ బ్రోకర్ సుబ్బరాయుడు రైతులను అన్యాయం చేసి, నాలుగు లారీలు,

శ్రీకంఠం టాకీసు దగ్గర నాలుగు షాపులు, గుత్తిరోడ్లో రెండెకరాల ప్లాటు, ఏడెనిమిది బ్రోకరాఫీసులు సంపాదించింటాడు. ఎంతోమంది రైతుల్ని నిలువునా దోచుకుంటే తప్ప సుబ్బరాయులాంటి కమిషనుదారుడు ఇంత సంపాదించలేడు. ఉదయం లేచినప్పటి నుంచి రైతును దోచుకోవటమే పనిగా పెట్టుకున్న సుబ్బరాయుడు పైకి మాత్రం "రైతును కడుమీ్మద గొడితే బాగుపడతారేమన్నా... దేవుడనేవాడు ఊరకనే వుంటాడా?" అంటూ వేంకటేశ్వర స్వామికి అగరుబత్తీలు అంటించీ, స్వామి సాక్షిగా మోసం చేస్తుంటాడు. తానెంతో నిజాయితీ పరుడన్ని తన వద్దకొచ్చిన రైతుల దగ్గర సుబ్బరాయుడు "ఇక్కడంతేనన్నా, ఒకటేనాడు షావుకార్లు కావల్లని జూస్తారీ లబ్ధికొడుకులు" అని తాను రైతులకేంతో మేలు చేసేవాడినని తాను చెప్పిన లమ్డీకొడుకుల్లో తాను లేడని నమ్మిస్తాడు. సాటి కమీషన్లని తిడుతున్నాడంటే సుబ్బరాయుడు చాలా మంచి మనిషని రైతులు నమ్మిన తర్వాత తాను మోసం చేయటం మొదలు పెడతాడు. ఇంటి వద్ద నుంచి అరగంటకొకసారి ఫోను చేయమని కొడుక్కి చెప్పి రావడంతో సుబ్బరాయుడు రైతులతో మాట్లాడుతుండగా ఫోను మోగుతుంది. రైతులు తమ సరుకును ఏ ప్రాంతానికి తీసుకెళ్ళి అమ్మకోవాలనుకుంటారో ఆ ప్రాంతవాసితో మాట్లాడినట్టు రైతులు ముందే మాట్లాడతాడు. అతని మాయ మాటలు నిజమని భ్రమించి రైతులు బాడుగ లారీలను సుబ్బరాయుడికే అప్పజెప్తారు. దీనితో బాడుగ లారీలను మాట్లాడి అటు డ్రైవర్ల వద్ద, ఇటు రైతుల వద్ద కమీషన్ లాగుతాడు. దీనితోపాటు ఫోను చార్జీలను రాబడతాడు. బెంగుళూరులో తమ సరుకును అమ్ముకోవాలని లారీల కోసం వచ్చిన ముగ్గురు రైతులను సుబ్బరాయుడు తన కమీషను కోసం ఫోను ద్వారా వాళ్లని మోసం చేసే విధానాన్ని రచయిత చక్కగా ఆవిష్కరించాడు. "అలో.... బెంగుళూరు నుంచేనా!.... యెవరు మాట్లాడేదీ.... ఫకీర్దీనా...... సలాంబై..... నేను అనంతపురం నుండి తిరుమలా బ్రోకర్ సుబ్బరాయుడే మాట్లాడుతాండా, యేం లేదు బై..... అక్కడ బీనాకాయల రేటెట్లుంది? ఆ.... టన్ను నాలుగువేల?

> **సాటి కమీషన్లని తిడుతున్నాడంటే సుబ్బరాయుడు చాలా మంచి మనిషని రైతులు నమ్మిన తర్వాత తాను మోసం చేయటం మొదలు పెడతాడు.**

సాటి కమీషన్లని తిడుతున్నాడంటే సుబ్బరాయుడు చాలా మంచి మనిషని రైతులు నమ్మిన తర్వాత తాను మోసం చేయటం మొదలు పెడతాడు.

సరుకు బాగుందిలే భై, మా ఆసాములవి రెండు లోడ్లు పంపుతాండా మంచి రేటుతో అమ్మించు భై...." ఇలాంటి బూటకపు మాటలతోనే సుబ్బరాయుడు గుంటూరోళ్లతో మాట్లాడినట్లు మాట్లాడి రామప్పనూ మోసం చేసి డబ్బులు గుంజుతాడు. చీనీకాయల రైతులకుగానీ, రామప్పకుగానీ తమను మోసం చేస్తున్నాడన్న విషయం తెలియకుండానే చేసే మోసాన్నంతా సునాయాసంగా చేసేవాడు సుబ్బరాయుడు. మోసం చేసే విధానంలో కొత్త పద్ధతులకు తెరలేపుతూ మార్కెట్టులో కమీషను రాబందులు రైతులోకాన్ని పీక్కుతింటున్న వైనాన్ని, కమీషనుదార్లు చేసేదంతా నిజమేనని నమ్మే అమాయక రైతాంగాన్ని రచయిత ఈ సందర్భంగా వివరించాడు.

కథలో రెండవ కమీషన్దారు కమీషనం గడి ఏజెంటు జాఫర్. ఈయన రైతుల వద్దకెళ్లడు. రైతులే ఇతని దగ్గరికొచ్చి తన సరుకును అమ్మిపెట్టమంటారు.

కథలో రెండవ కమీషన్దారు కమీషనం గడి ఏజెంటు జాఫర్. ఈయన రైతుల వద్దకెళ్లడు. రైతులే ఇతని దగ్గరికొచ్చి తన సరుకును అమ్మిపెట్టమంటారు. అమ్మిన దానికి కమీషనుంటుంది. రామప్ప తన పద్దైదు టమోటా గంపలను కమీషను తీసుకొని అమ్మి పెట్టమని సరుకును జాఫర్కు అప్పగిస్తాడు. మార్కెట్లో చిల్లరగా కేజీ టమోటాలు మూడు రూపాయలు అమ్ముతుంటే కమీషనంగడి జాఫర్ మాత్రం రైతు పొలం నుంచి తెచ్చిన మణువు గంప టమోటాలను పదిరూపాయిలక్కూడా కొనటానికి మొగ్గుచూపడు. దీనికి కారణంగా "సరుకు బాగాలేదనీ, మదనపల్లి సరుకు ముందు ఇది పనికిరాదనీ, మార్కెట్టు శానామందమైపోయిందనీ" సాకులు చూపిస్తాడు. సరుకు అమ్ముకోవటానికి వేరే గత్యంతరం లేని రామప్ప జాఫర్ చెప్పిన ప్రతీదానికి ఊకొడతాడు. కమీషన్ పేరుతో దాగా చేసే జాఫర్ రామప్ప అప్పగించిన పద్దైదు గంపలకు నూరు రూపాయి కూడా అప్పజెప్పడు. "రామప్ప నోట్లను లెక్కబెట్టుకుంటూ టమోటా నాటినప్పటి నుంచీ ఎండలో దాన్ని, ఎలా కాపాడిందీ, ఎన్నిసార్లు కలుపు తీసిందీ, ఎన్నిసార్లు మందుకొట్టిందీ జ్ఞప్తికి తెచ్చుకోనేసరికి ఆవేదనతో అతని పెదవులెండుకుపోయాయి". ఎంతో కష్టపడితేగానీ రైతుకు పంట చేతికందదు. రాయలసీమలో రైతు కష్టం ఇతర ప్రాంతాలకంటే ఎక్కువగానే వుంటుంది.

అటువంటి రైతు కష్టాన్ని గుర్తించకుండా నీడపట్టున కూర్చొని వేరే గత్యంతరం లేక తమ వద్దకొచ్చిన రైతులను అన్యాయం చేసే జాఫర్లాంటి కమీషన్దార్ల మోసాన్ని ఈ సందర్భంగా రచయిత కళ్లకు కట్టినట్లు చూపించాడు.

ఈ రెండు పాత్రలు కథలో రైతును మోసం చేసి శ్వాసపీల్చుకొనేవే. ఈ పాత్రలు మార్కెట్లలో నాటి కమీషన్దార్లు చేస్తున్న దాగాకోరు పనులకు ప్రతీకలు. వీరి మాయలోపడి మోసపోతున్న మొత్తం రైతాంగాన్ని జాగ్రత్తగా వుండమని రచయిత ఈ కథ ద్వారా హెచ్చరిస్తాడు.

సుబ్బరాయుడు, జాఫర్ లాంటి కమీషన్దార్ల చేతుల్లో మోసపోయే రైతుకు ప్రతీక రామప్ప. కథా కాలానికి అనంతపురం మార్కెట్టు కమీషన్దార్ల దాగాకోరు పిడికిళ్లలో ఎలా నలిగిపోతువుందో రామప్ప ద్వారా సూచనప్రాయంగా తెలుపుతాడు రచయిత డాక్టరు శాంతినారాయణ. "యాటికో వొకసాటికి తప్పదు గదప్పా. యీడజూత్తే ఈ మార్కెటోల్లు మాయట్లాంటి రైతుల్ని బతకనిచ్చేతట్ల లేరు. ఈ అనంతపురమంతా ముండమోసిన మార్కెట్టు పెపంచంలో ఇంకెక్కడా ఉండదేమోనప్పా. థూ...థూ... మాల్లా అంత మోసమా! యేదో బొత్తిగా సేతులాడకుంటే మొన్నవొగ పది ప్యాకెట్లు వుల్లిగడ్డ లేసకొత్తే రేటేమో ముప్పెజెప్పినారు. తీరా జూత్తే అదీయిదీ అని యేందేందో తీసేసి ఇరవైపకారం సేతికిచ్చినారు దొంగనా కొడుకులు" అందుకే రామప్ప తన ఉల్లిగడ్డల్ని గుంటూరు మార్కెట్లో అమ్ముకోవాలని నిశ్చయించుకుంటాడు. రైతును మోసం చేసే కమీషన్దార్లు పంటను అమ్మిచ్చే కమీషనంగట్లోనో వుంటారనే భ్రమ రామప్పది. అందుకే తన గోడునంతా లారీబ్రోకరు సుబ్బరాయుడు వద్ద ఎల్లబోసుకుంటాడు గొర్రెకసాయి వాడికి మొరపెట్టుకున్నట్టు. తన ఊరివాడైన దస్తగిరి సుబ్బరాయుడు రైతులనెలా మోసం చేసేవాడో చెప్పేంత వరకూ రామప్ప లారీ బ్రోకర్ సుబ్బరాయుడు మోసాన్ని తెలుసుకోలేకపోతాడు. సుబ్బరాయుడు, జాఫర్ చేతుల్లో తాను మోసపోయానని రామప్పకు తెలిసిన తర్వాత "వోరి ఈనెమ్మ కడుపులుగాలా, ఎంత మోసంరా దొంగ నా కొడుకులు! థూ.. థూ.., అంతా బద్ద నాయాళ్ళే" అని కేకరించి ఉమ్మేతాడే తప్ప వాళ్లపైన తిరుగుబాటు చేయడు. రామప్ప లాంటి రైతుకు ఇంతమోసం జరుగుతున్నా బజార్లో తిరిగే వాహనాలు, ఊరేగింపుతో వెళ్ళే విద్యార్థులు, రాజకీయ నాయకులు ఎవ్వరూ పట్టించుకోరు. వారివారి పనుల్లో నిమగ్నమైపోతుంటారు. అందుకే ఇప్పటికీ మోసపోతున్న రామప్పలు సంఖ్య పెరుగుతూనే వుంది తప్ప తరగటం లేదు.

కథలో మూడవపాత్ర దస్తగిరి. ఇతను రామప్ప ఊరి మనిషి. కమీషనుదార్ల చేతిలో మోసపోతున్న రైతు పక్షాన నిలబడి రైతులకు కమీషన్దార్ల మోసాలు, కపట నాటకాల గురించి వివరించి రైతులందరినీ మేల్కొలిపే ప్రయత్నం చేసే పాత్రగా కథలో దస్తగిరి పాత్ర చిత్రించబడింది. పూర్తిగా మోసపోయిన రామప్పను పరిచయం చేసుకొని మామ వరసను కలుపుకొని సుబ్బరాయుడు రైతులను మోసం చేసే తీరును రామప్పకు ఇలా వివరిస్తాడు. "నిజం మామా, నువ్వుందూరోనివి కాబట్టి నిజం చెప్పుతాండా, ఈ ఫోన్లు గీన్లు అంతా అబద్ధం. ఫోన్లో గుంటూరోళ్లతో మాట్లాడేదీ, బెంగుళూరోళ్లతో మాట్లాడేదీ అంతా బూటకం" అని సుబ్బరాయుడు, సుబ్బరాయుడు కొడుకు కలిసి ఒక పథకం ప్రకారం ఫోను ద్వారా రైతులను ఎలా మోసం చేస్తున్నారన్న సంగతినంత వివరిస్తాడు. ఇలాంటి మోసకార్లను నమ్మి రామప్పలాంటి రైతులు ఎంతో నష్టపోతున్నారని చెబుతాడు. "ఇది తెల్సుకోకుండా మీరు బ్రోకర్ల దగ్గరికే వస్తారు, వీళ్ళు మీతో కమీషన్, డ్రైవర్లతో కమీషన్ కొట్టడమే కాకుండా మామూలుగా నడిచే బాడిగకంటే యెక్కువ మాట్లాడిన దాంట్లో సగం గుంజుతారు" అంటూ కమీషనుదార్ల బండారమంతా బయటపడేస్తాడు. రైతు పండించుకున్న పంటను తనకుతాను స్వయంగా సొమ్ము చేసుకోవాలనే విషయాన్ని దస్తగిరి రైతాంగానికి వివరిస్తాడు. దస్తగిరి పాత్రలో రచయిత డా॥ శాంతి నారాయణనే మనకు దర్శనమిస్తాడు.

> **రైతు మోసపోతే కలిగే నష్టం కేవలం రైతుకే కాదు. రైతు మీద ఆధారపడి జీవించే మొత్తం సమాజానికి.**

రైతు మోసపోతే కలిగే నష్టం కేవలం రైతుకే కాదు. రైతు మీద ఆధారపడి జీవించే మొత్తం సమాజానికి. కమీషన్దార్ల దగాకోరుతనాలన్ని నేలరాసి రైతుకు న్యాయం చేయాల్సిన బాధ్యత అందరిపైన వుందనే విషయం ఈ కథ గుర్తు చేస్తుంది. రైతు ఆత్మహత్యలతో బలపడుతున్న దళారీ వ్యవస్థపై యుద్ధ ప్రాతిపదికన తిరుగుబాటు చేయాల్సి వుందని, అటు ప్రజానీకాన్ని ఇటు ప్రభుత్వాన్ని మేల్కొలిపే ప్రయత్నాలు చేసిన కథ ఇది. ఇది రైతుకు బలాన్నిచ్చిన కథ.

కథ

# కోళ్ళ గుంపు



శ్రీ కౌలూరి ప్రసాద రావు
73829 07677

పండగంటే ఆటవిడుపు కావచ్చు. నిరంతర శ్రమకు దొరికిన విశ్రాంతి. అదొక ఆచారం. కానీ కండక్టరు కోణంలో అందని ద్రాక్ష. బస్సు గోతిలో పడి, ఆగిన కుదుపు తాలూకు క్షణ కాలపు విరామం. స్పీడు బ్రేకర్లలా, ట్రాఫిక్ జామ్ లా పండగలూ, పబ్బాలూ వచ్చి పోతుంటాయి. కానీ విధి నిర్వహణ మాత్రం కదిలే చక్రాల్లా ముందుకు సాగిపోతుంది. ఒక్కమాటలో పండుగని నిర్వచించాలంటే "ఒకసారి బస్సులో ప్రయాణించి, చనువుగా మాట్లాడి, దిగి పోయిన ప్రయాణీకుడు సంవత్సరం తర్వాత మళ్ళీ తారసపడటం". ఒక్కో స్టేజీ ఒక్కొక్క ఋతువులా పలకరిస్తుంది. గుడికి పోయేవారికి ఒక్కడే దైవం. కండక్టరుకి మాత్రం బోలెడెంత మంది.

"ఇక్కడ ఆపండి సార్ !" అందో అమ్మాయి. అది బస్టాప్ కాదు. కానీ 'కోరిన చోట దింపాలి' అనే నిబంధనని సద్వినియోగం చేసుకుంది. పల్లెటూరికి వెళ్ళే సర్వీసుకి 'గుమ్మాల బస్సు' అనే పర్యాయ పదం ఉంటుంది. వెంటనే విజిల్ వేసాడు వేణు. నెమ్మదిగా లేచి లగేజీ సర్దుకుంది. బ్యాగులు ఎక్కువగా ఉండటంతో కాస్త సహాయం చేసాడు. పట్టు పావడా, వోణీతో కలహంసలా నడుస్తుంటే పౌష్యలక్ష్మి స్ఫురణకు వచ్చింది. మెట్ల వరకూ దిగిన కండక్టరుకి వాకిలిలో అందమైన రంగవల్లి కనిపించింది. మధ్యలో రకరకాల పువ్వులతో అలంకరించబడిన గొబ్బెమ్మ, చుట్టూ ప్రాకారంలాంటి అమరిక,నాలుగు వైపులా నిలబడిన రామ చిలకలు.'చిలకలు వాలిన మంటపం' లా ఉంది ముగ్గు.

ఏదో తెలియని దిగులు ఆవరించింది వేణుని. పలావు తింటున్న వారిని చూసి, పస్తున్న వాడికి కలిగే భావంలాంటిదది. నిర్వేదంగా పైకొచ్చి, 'రైట్' అన్నాడు. బస్సు కదులుతుండగా" మళ్ళీ ట్రిప్పులో ఇక్కడ ఆపండి కండక్టరు

గారూ! కాసిని బూరెలు ఇస్తాను" అరిచిందా అమ్మాయి. పల్లెటూళ్ళు ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతం కావటంతో పట్టణ నాగరికత పూర్తిగా అలుము కోలేదని, పురి విప్పిన గాదెలు సాక్ష్యమిస్తున్నాయి. ఒక్కో గ్రామాన్నీ వెనక్కి నెట్టుకుంటూ బస్సు ముందుకు పోతోంది. ఒకచోట గంగిరెద్దులవాడు సన్నాయి మీద సంక్రాంతి పాట పాడుతూ' అయ్యగారికి దండం పెట్టు' అంటున్నాడు. ఆబోతు కుడి ముందు కాలు ఎదరకు చాచి, వంగి తల ఊపుతుంటే గృహస్థులు సంబర పడుతున్నారు. బియ్యమూ, పాత బట్టలు భక్తితో సమర్పిస్తున్నారు.

తమ వాకిట్లో బసవన్న పేడ వేస్తే, శుభమని ఆశ పడుతున్నారు. ఇవేమీ తెలియని ఎద్దు యజమాని నేర్పినట్టు నడుచు కుంటోంది.

తమ వాకిట్లో బసవన్న పేడ వేస్తే, శుభమని ఆశ పడుతున్నారు. ఇవేమీ తెలియని ఎద్దు యజమాని నేర్పినట్టు నడుచు కుంటోంది. పదకొండు నెలల పాటు తనని పోషించిన యజమానికి, సంవత్సరపు గ్రాసం ఈ ఒక్క నెలలో సంపాదించి, కృతజ్ఞత చెల్లించటానికి అలసటని భరిస్తూ నిర్విరామంగా పని చేస్తోంది. మరో చోట హరిదాసు పాడుతున్న రామకీర్తనలో లీనమై పోయాడు వేణు.' ఎంత పని చేసితివి రామా!?' అంటూ రామదాసులా మారాడు. కొన్ని క్షణాలపాటు బస్సు చెరసాలగా, సెలవు ఇవ్వని అధికారిని తానీషా ప్రభువులా భావించాడు. పండుగ మూడు రోజుల్లో ఎవరికైనా ఒక రోజు మాత్రమే సెలవు మంజూరు చేస్తామని డిపోలో నోటీసు బోర్డు వేసారు.

దాని ప్రకారం తనకీ ఒక సెలవు దొరకాలి. అక్కడే చిన్న లాజిక్ లాగాడు అధికారి.''సంక్రాంతి రోజున డ్యూటీ చేస్తే మర్నాడు ఇన్ కమింగ్ అవుతావు. ఇంక నీకు లీవు ఎందుకు?" అని వాదించాడు. వేణు కూడా దీర్ఘంగా ఆలోచించాడు. తనది నైట్ హాల్ట్ సర్వీసు. ఒకరోజు లీవు తీసుకుంటే కనుమ రోజు స్పేరులో సింగల్ డ్యూటీ చేయాల్సి వస్తుందని సంశయించాడు. వేణు తటపటాయింపు చూసిన అధికారి "భలే దొరికాడ''ని నవ్వాడు. అయినా వెంటనే దండోపాయానికి పోకుండా. ''ఈ ఒక్కరోజు ఓపిక పడితే, ఎలాగూ కనుమనాడు దిగిపోతావు. కక్కాముక్కా సంగతి చూడొచ్చు. నీవల్ల మరో వ్యక్తికి సెలవు దొరుకుతుంది" అని ఇరికించి, అసలు లీవు ఇవ్వకుండా దాటవేసాడు.

అందువలన డ్యూటీ చేయక తప్పలేదు.

"సాయంత్రంలోగా ఒక కవిత రాయాలి" ఆర్డరు వేసాడు నరేంద్ర. వేణు ఉంటున్న యూనియన్ సెక్రటరీ అతడు.

మార్పు విశ్వజనీనమైనది. మారని జీవులు ఏమారిపోతాయి. గ్రీష్మంలో ఆకులు రాల్చిన చెట్టు, వసంతంలో చిగిర్చి తనను తాను అప్ డేట్ చేసుకుంటుంది. అంతేగాని, కొమ్మల్ని నరుక్కోదు. వేళ్ళను పెకలించుకోదు. అలాగే కాల దోషం పట్టిన కొన్ని సాంప్రదాయాల్ని వదిలించుకోవటం అనివార్యం.మరికొన్ని సంస్కరణలకు లోనవుతాయి. మూలాలు మాత్రం మిగిలే ఉంటాయి." నాకు ప్రతిరోజూ పండగే. ఏడాదికి ఓసారి వచ్చే సంక్రాంతి కోసం కళ్ళు కాయలు కాసేలా చూసే అగత్యం లేదు" అన్నాడు ఒక తాగుబోతు." ఎలా?" అనే ప్రశ్నకి " ఏముంది? కాస్త మందు పుచ్చుకుని, ఓ బిర్యానీ లాగిస్తే,పెద్ద పండగేం ఖర్మ! దాని జేజమ్మే నా ముందు నిలబడుతుంది" అని సరిగ్గా నిలబడలేక తూలాడు.

ఏతావాతా అతడు తేల్చినదేమంటే 'డబ్బే పండగ'ని. అవి చేతిలో ఎప్పుడు ఉంటే అప్పుడు కోరిన పండగ చేసుకోవచ్చు. అతడు నిరీక్షణలోని రుచిని ఆస్వాదించలేదు. ఒక లక్ష్యం కోసం పాటు పడటం కూడా ఎరుగడు. యాంత్రికమైన బతుకు. రసహీన హృదయం. "సాయంత్రంలోగా ఒక కవిత రాయాలి" ఆర్డరు వేసాడు నరేంద్ర. వేణు ఉంటున్న యూనియన్ సెక్రటరీ అతడు. మధ్యాహ్నం భోజనాలు చేస్తున్న సమయంలో కనిపించాడు. కవిత ఎందుకనే ఆశ్చర్యమూ, కవిగా గుర్తింపు కలిగిందనే ఆనందమూ జమిలిగా కలిగాయి కండక్టరుకి. "ఏ అంశం మీద రాయాలీ?" ఆసక్తిగా చూసాడు వేణు."సంక్రాంతి పండగ కోసం" జవాబిచ్చాడు. "సరే! ఇవాళ డ్యూటీలో ఉన్నా, రేపు దిగగానే రాస్తాను" అన్నాడు వేణు చేయి కడుక్కుంటూ.

"కుదరదు. ఇవాళే రాయాలి. అందుకే నిన్ను వెదుక్కుంటూ వచ్చాను!" దృఢంగా పలికాడు యూనియన్ లీడర్. "అంత అర్జంటేముంది? "అర్థం కానట్టు చూసాడు వేణు." ఇక నుండి డిపోలో సంక్రాంతి సంబరాలు జరపాలని నిర్ణయించాం. పండగ శోభని తెచ్చే ప్రతి ఒక్కరినీ ఆహ్వానించాం. మన తరపు నుండి ప్రాతినిధ్యం ఉంటే బాగుంటుందని చెప్పి వెళ్ళిపోయాడు. పొద్దుటి నుండి వెంటాడుతున్న యాంత్రికత వెంటనే పక్కకి తప్పుకుంది. ఆ స్థానాన్ని ఉత్సాహం

భర్తీ చేసింది. ఒక ప్రోత్సాహపు మాట మనిషిలో స్తబ్దతని పారదోలి, నిద్రాణమైన శక్తిని వెలికి తీసి, కార్యోన్ముఖుడిని చేస్తుంది. దుష్కరమైన సముద్ర లంఘనాన్ని సాధిస్తుంది. నిరాశపు వాక్కు, శల్య సారధ్యమై అస్త్ర సన్యాసం చేయిస్తుంది.

ఒక పెద్దాయన ఇలా అంటాడు. " సినిమా హాలు దగ్గర, టికెట్ల క్యూలో నిలబడి కూడా రాయగలిగిన వాడే సిసలైన రచయిత''. ఆ మాట శిరోధార్యం వేణుకి.

ఉత్తేజం నరాల నుండి సిరాలోకి ప్రవహించింది. వేణు జేబులో ఎప్పుడూ చిన్న స్పైరల్ బుక్ సిద్ధంగా ఉంటుంది. ఏదైనా ఊహ మెదిలినపుడో, సంఘటన కదిలించినపుడో దాన్ని నోట్ చేసి పెట్టుకుంటాడు. ఇంటికొచ్చాక డెవలప్ చేసి, కవితగానో, కథగానో మలుస్తాడు. పత్రికలకి పంపుతాడు. అవి అచ్చుకు నోచుకుంటాయి. బస్సు కదిలినపుడు ఆలోచనల తుట్టె కదిలింది. అలవోకగా అక్షరాలు గేయరూపంలో వెలువడ్డాయి.

" వచ్చింది వచ్చింది సంక్రాంతి లక్ష్మి /

తెచ్చింది నవకాంతి మా పౌష్యలక్ష్మి"

అంటూ ప్రారంభించాడు.ఓ వైపు టికెట్లు ఇవ్వటం,మరోవైపు దిగేవారికి ఆపటం, చిల్లర గొడవలు,రణగొణ ధ్వనుల మధ్య

రాసేందుకు తగిన ప్రశాంతత దొరకదు. ఏకాగ్రత చిక్కటం అంత సులభం కాదు.

ఒక పెద్దాయన ఇలా అంటాడు." సినిమా హాలు దగ్గర, టికెట్ల క్యూలో నిలబడి కూడా రాయగలిగిన వాడే సిసలైన రచయిత". ఆ మాట శిరోధార్యం వేణుకి. సంక్రాంతి ప్రధానంగా పంటల పండుగ. కాబట్టి అక్కడి నుండి మొదలు పెట్టి, భోగి పళ్ళను, పెద్దల నైవేద్యాలను, ఎద్దుల అలంకరణను వర్ణించాడు.

హరిదాసుని, గంగిరెద్దులను, జంగమ దేవరలను, బుడబుక్కల వారి డబుడక్కలను జ్ఞాపకం చేసాడు. పిండి వంటలను,పిల్లల అల్లరిని, బావా మరదళ్ళ సరసాలను వివరించాడు. "మరుసటి సాలుకి మరల వస్తానని / ముగ్గు రథం మీద ముంగిలి దాటింది/మూన్నాళ్ళ ముచ్చట ఏడాది స్ఫూర్తిగా / ప్రతిరోజు

పండుగై బతుకు నడిపింది / ఇంటినీ కంటినీ కాంతితో నింపింది"అని ముగించాడు.

రాత్రి డ్యామ్ దగ్గర బస్సు నైట్ హాల్ట్ ఆగింది. ప్రయాణీకులు ఎక్కి దిగే మెట్ల ఎదురుగా కాస్త ఖాళీ స్థలం ఉంటుంది. లగేజీ వేసుకోవటానికి వీలుగా సీటుని తొలగించారు. అక్కడ కింద ఫ్లెక్స్ ని పరిచాడు వేణు. ఆ రూటులో ఎవరిదో పెళ్ళి అయిన తరువాత దాన్ని అడిగి తీసుకుని చాపలా వాడుతున్నాడు. పైన దుప్పటి పరిచాడు. తర్వాత దోమ తెరని విప్పి నాలుగు వైపులా పైపులకి కట్టాడు. ప్లాస్టిక్ ఎయిర్ పిల్లో మూత తీసి బలంగా గాలి ఊదాడు. అది నిండాక మూతి బిగించి పెట్టేసి, తలగడగా వేసాడు. మంకీ కేప్ ని తలకి తగిలించాడు. సెల్ ఫోనులో నాలుగున్నరకి అలారం సెట్ చేసి, వాటర్ బాటిల్లోంచి నీళ్ళు తాగి, మరో దుప్పటి కప్పుకుని మేను వాల్చాడు. నెమ్మదిగా కళ్ళు మూసాడు.

**దుఃఖాన్ని దిగమింగవచ్చుగాని, ఆనందాన్ని అణుచుకోవటం అసాధ్యం. ఇప్పుడదే స్థితిలో ఉన్నాడు వేణు.**

కానీ నిద్ర రాలేదు. ఇందాక కవిత చదివినపుడు కురిసిన ప్రశంసల జల్లుకి, ముద్దయి పోయిన, మనసు ఇంకా తడిగానే ఉంది. అది పొడి బారితే తప్ప కునుకు రాదని అర్థమైంది. హర్షధ్వానాల మధ్య మూడు రకాల మనః ప్రవృత్తులను గుర్తించాడు. కొందరి మొహాల్లో "తక్కువ సమయంలో, కదిలే బస్సులో, డ్యూటీ చేస్తూ, ఎలా రాసాడా?" అనే ఆశ్చర్యం కనబడింది. ఇంకొందరి వదనాల్లో " బయటి నుండి ఎంతో మంది కళాకారులు వచ్చారు. వారికి దీటుగా మనవాడొకడు నిలబడ్డాడు "అనే ఆనందం పొడ సూపింది. మరికొందరి మోముల్లో "మనమెందుకు చేయలేక పోయాము? మనకీ పొగడ్తలు దొరికేవి కదా?" అనే అసూయ కదలాడింది. కానీ 'ఆశకి ముందు కృషి' ఉండాలని మర్చిపోయారు.

దుఃఖాన్ని దిగమింగవచ్చుగాని, ఆనందాన్ని అణుచుకోవటం అసాధ్యం. ఇప్పుడదే స్థితిలో ఉన్నాడు వేణు. పైకి లేచి, ఇందాకటి పాలిథీన్ కవర్లు తీసి చూసాడు. వాటిలో బూరెలు, అరిసెలు, పోకుండలు, కజ్జికాయలు ఉన్నాయి. ఒక అరిసెని తీసి కొరికాడు. అంతలో "మాకు పెట్టకుండా మొత్తమన్నీ నువ్వే లాగించేస్తావా?" అనే మాట వినబడి ఉలిక్కిపడ్డాడు వేణు. హఠాత్తుగా కళ్ళ

ముందు ప్రత్యక్షమైన తనిఖీ అధికారులను చూసి, బిత్తరపోయాడు. తేరుకుని "రండి సార్ !" అని ఆహ్వానించాడు. టికెట్లు చెక్ చేయటానికి జనాభా లేరు. కాబట్టి కేష్ బాగ్ అందుకున్నారు. కండక్టరు లైటు వెలుగులో పరిశీలించారు.

మొత్తం నగదు టాలీ చేసారు. వేణు విడిచిన బట్టల్లో వెదికి ప్రైవేటు కేష్ కూడా శోధించారు. అంతా సవ్యంగానే ఉండటంతో వేణు 'హమ్మయ్య' అనుకుంటూ ఊపిరి పీల్చాడు. స్క్వాడ్ మాత్రం తేడా ఏమీ దొరకలేదని నిరాశ పడి, దొరికిన పిండివంటల కవర్లు తీసుకు పోయారు. పండగ పూట వట్టి చేతులతో పోవటం వారికి వెలితి అనిపించింది. సమీపంలోని చెట్లలో ఏదో అలికిడి. గుడ్లగూబ చేతికి చిక్కిన చిన్న పిట్ట, ఆర్తనాదాలు చేస్తూ, రెక్కలు తప తప లాడిస్తున్న చప్పుడది. డ్యూటీ మొత్తం అప్రమత్తంగా ఉండాలి. ఏ నిమిషం అజాగ్రత్తగా ఉన్నా 'తనిఖీ అధికారుల చేతుల్లో తనదీ పిట్ట బతుకే' అని నిట్టూర్చాడు. సర్దుకుని మళ్ళీ కాసిని నీళ్ళు తాగి, నిద్రకి ఉపక్రమించాడు.

> అకస్మాత్తుగా అతడికి బూరెలు ఇచ్చిన అమ్మాయి జ్ఞాపకం వచ్చింది. "పండగంటే పదహారణాల అచ్చ తెలుగు ఆడపిల్ల చిరునవ్వు" అనిపించింది.

కానీ నిద్ర రాక పక్కమీద అటూ ఇటూ పొర్లి, మళ్ళీ లేచాడు. అకస్మాత్తుగా అతడికి బూరెలు ఇచ్చిన అమ్మాయి జ్ఞాపకం వచ్చింది. "పండగంటే పదహారణాల అచ్చ తెలుగు ఆడపిల్ల చిరునవ్వు" అనిపించింది. దూరంగా ఒంటరి పులుగు కూస్తున్న ధ్వని. కుటుంబానికి దూరంగా, ఒంటిగా ఉండటం ఎంత దుర్భరమో తలచుకుని వగచాడు. దూర ప్రాంతాల్లో ఉంటున్న వారిని, పండగపూట స్వగ్రామాలకి చేరుస్తున్నానని ఊరడిల్లాడు. తమ వారిని సుదీర్ఘ విరామం తరువాత కలిసినప్పుడు వారి కళ్ళలోని మెరుపు చూసి సంతృప్తిగా తలాడించాడు. కీచురాళ్ళ రొద వింటూ క్రమంగా మగతలోకి జారిపోయాడు.

"పండుగపూట పొలం దున్నటం ఏమిటి బాబాయ్ "చొరవగా మాట కలిపాడు వేణు. ఎద్దుల మెడ మీద ఉన్న కాడిపై నాగలిని వేలాడదీసి, పక్కన నిలిపి, గ్లాసులోని ఉడుకు టీ ని ఊదుకు తాగుతున్నాడు ఓ రైతు. గజగజ వణికిస్తున్న చలిలో గొంతులోకి నాలుగు వేడి టీ చుక్కలు జారటం

దివ్యానుభూతి. తెల్లవారుజామున కాకా హోటల్ ముందు బస్సాపి, తేనీరు సేవిస్తున్నపుడు అడిగాడు వేణు.” అసలు ‘కనుము’ అంటే ‘ఎద్దు’ అని అర్థం. సంవత్సరం పాటు ఇంట్లోనూ, పొలంలోనూ చాకిరీ చేసిన ఎద్దుకి విశ్రాంతి ఇచ్చే దినమిది. దాన్ని శుభ్రంగా కడిగి, కొమ్ములకు రంగులేసి, సన్మానించే సుదినం. ఇప్పుడొస్తున్న కుర్రకారు సరే! సాంప్రదాయం తెలిసిన మీరు కూడా పండగలని ఆదరించకపోతే ఎలా? ఇలాగే నిర్లక్ష్యం చేసుకుంటూ పోతే ఒకనాటికి పండగలు కనుమరుగై పోతాయి. ఇప్పటికే కళ తప్పి విలవిల లాడుతున్నాయి” అన్నాడు మళ్ళీ.

> “నువ్వన్నది నిజమే బాబూ! రెక్కాడితే గాని, డొక్కాడని బతుకులకీ పండగని ఇంటికాడ కూచుంటే కుదురుద్దా ? మాకు పనే పండగ” అంటూ ఎద్దులని తోలుకు పోయాడు.

కండక్టరుని ఎగాదిగా చూసాడా రైతు. ఆ చూపు తనని సూటిగా తాకి నిలదీసినట్టు భ్రాంతికి గురయ్యాడు వేణు. “నువ్వు మాత్రం చేసిందేమిటి? సెలవు పెట్టి, కుటుంబ సభ్యులతో వేడుక జరుపుకోకుండా డ్యూటీకి రాలేదా?” అన్నట్టు తోచింది. తన ప్రశ్న తనకే బూమరాంగ్ లా వెనుదిరిగి వచ్చి గుచ్చుకున్నట్టు చిన్నబోయాడు వేణు. “నువ్వన్నది నిజమే బాబూ! రెక్కాడితే గాని, డొక్కాడని బతుకులకీ పండగని ఇంటికాడ కూచుంటే కుదురుద్దా? మాకు పనే పండగ” అంటూ ఎద్దులని తోలుకు పోయాడు. ఆ మాటని వేణుతో పాటు టీ తాగుతున్న వారంతా విడ్డూరంగా విన్నారు. కనీస అవసరాలైన ‘కూడూ, గూడూ, గుడ్డా’ లేని పేదలకి ఓటు విలువ తెలియదు.

‘తమ అమూల్యమైన ఓటుని డబ్బుకో, మద్యానికో మరేదో తాయిలానికో అమ్ముకుంటున్నార’ని మేధావులు కినుక వహిస్తారు. ధనికులు ‘ఓటుకి నోటు’ తీసుకోరు. పైగా వారే పెట్టుబడి పెట్టి, ఓట్లు కొనటంలో సహాయం చేస్తారు. గెలిచాక ప్రాజెక్టులూ, కాంట్రాక్టులూ చేజిక్కించు కుంటారు. నాయకులు, కార్యకర్తలూ తమ పార్టీ పట్ల అభిమానంతో గెలుపు కోసం కృషి చేస్తారు.అంతేగాని డబ్బు ముట్టరు. అధికారంలోకి వస్తే ఎలాగూ పెత్తనం వారిదే.ఇక మిగిలింది పేదలు. వారికి గెలుపు, ఓటములతో నిమిత్తం లేదు. వారి బతుకులు గొర్రెతోకలు.’ తమ ఓటు

విలువ, పరిపాలన వంటి పెద్ద విషయాలు వారికి పట్టవు. ఈపూట దాటామా? లేదా? ‘ అనేదే వారి ముందున్న పెద్ద సవాలు.

ఊరూరికి కోళ్ళు సప్లయ్ చేసే వ్యాను ఒకటి, రోడ్డు స్పష్టంగా కనబడక బాట పక్కనున్న చెట్టుని ‘ఢీ’ కొట్టి బోల్తా పడింది.

కష్టపడినా కడుపు నిండని జీవితాలను నిందించి ప్రయోజనం ఉండదు. ఆయాచితంగా వచ్చిన సొమ్ము, కొన్ని ఖర్చులను తీరుస్తుంది. అంతే! భారమైన మనసుతో ముందుకు సాగిపోయాడు వేణు. రెండు గ్రామాలు దాటాక కొండ మలుపులో కనిపించిందా దృశ్యం. అప్పటికింకా పొగ మంచు విడలేదు. మసగ్గా దారి కనబడుతోంది. హెడ్ లైట్ల వెలుగులో నెమ్మదిగా కదులుతోంది బస్సు. ఫర్లాంగు దూరంలో కొండగూడెం ఉంది. ఊరూరికి కోళ్ళు సప్లయ్ చేసే వ్యాను ఒకటి, రోడ్డు స్పష్టంగా కనబడక బాట పక్కనున్న చెట్టుని ‘ఢీ’ కొట్టి బోల్తా పడింది. డ్రైవరు తలకి దెబ్బ తగిలి స్పృహ తప్పాడు. క్లీనరు డోరులోంచి బైటకి జారిపడి,కాలు విరిగి మూలుగు తున్నాడు. సమీపంలో ఎవరూ లేరు.

వ్యాను వెనుకున్న మెష్ విరిగి పడింది. దాంట్లో ఉన్న కోళ్ళు చెల్లా చెదురుగా పడ్డాయి. అన్నీ బ్రాయిలర్ జాతే.ఒక్కోటీ రెండూ, రెండున్నర కిలోలు తూగుతాయి. ఎప్పుడూ ఫారంలోనూ, లేదా ఇనుప ఊచల బోనుల్లోనూ ఉంటూ, తింటూ బతికే వాటికి ఒక్కసారిగా కావలసినంత స్వేచ్ఛ దొరికింది. కానీ ‘ఏం చేయాలో? ఎటుపోవాలో?’ తెలియక ‘కొక్కొక్కో’ అంటూ అక్కడే తచ్చాడ సాగాయి. అంతలో బహిర్భూమికి వచ్చిన గ్రామస్థుడు ఆ సంఘటనని చూసాడు. కొన్ని క్షణాలు తనలో తనే తర్కించు కున్నాడు. తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెంబు కిందకి జార విడిచి ముందుకు కదిలాడు. వేణు ఆశ్చర్యపోయి చూస్తుండగా అమాంతంగా కోళ్ళ మందలోకి దూకాడు. నాలుగు కోళ్ళను లాఘవంగా దొరక బుచ్చుకుని చంకల్లో ఇరికించుకుని ఊరి దిశగా లగెత్తాడు.

అనాగరిక యుగంలో ‘ఇడ్’ విశృంఖలంగా తిరిగింది. బల గర్వంతో అడ్డూ అదుపూ లేక స్వైర విహారం చేసింది. నిజానికి ఇదే జీవుల నిజమైన

> **నాగరిత పెరిగాక, బంధాలు ఏర్పడ్డాక, ప్రాణం విలువ తెలిసింది. నీతి నియమాలు, వాని వరుసలు ఏర్పడ్డాయి.**

నైజం. ఇది ప్రకృతి నియమాలకు అనుగుణంగా, ప్రవర్తిస్తుంది. ఆదిమ మానవుడు మృగప్రాయుడుగా ఉన్న దశలో, అతడి ముందున్నది ఒకటే సమస్య. అది జీవన పోరాటం(స్ట్రగుల్ ఫర్ ది ఎగ్జిస్టెన్స్) ఆకలితోనూ, జంతువుల దాడిలోనూ చావకుండా బతికుండటం. దానికోసం ఎవరినైనా చంపుతాడు. ఆ ప్రయత్నంలో ప్రాణాలొడ్డి పోరాడుతాడు. పరిస్థితికి అనుగుణంగా తనను తాను మలుచుకోవటమే స్థితప్రజ్ఞత.'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్' లో ఓడిపోయిన డైనోసార్లు అంతరించి పోయాయి.

నాగరిత పెరిగాక, బంధాలు ఏర్పడ్డాక, ప్రాణం విలువ తెలిసింది. నీతి నియమాలు, వాని వరుసలు ఏర్పడ్డాయి. అందువల్ల మనం బతకాలి, ఇతర్లని బతకనియ్యాలి (లివ్ అండ్ లెట్ లివ్) అనే భావన తప్పనిసరి అయింది. అప్పుడు అనాగరికంగా మసలే ఇడ్ కి కాస్త సభ్యత నేర్పవలసి వచ్చింది. దాంతో 'ఇగో' రంగ ప్రవేశం చేసింది. ఇడ్ కి ముసుగు కప్పి, పరోక్ష విధానాల్లో కార్యసాధన మొదలు పెట్టింది ఇగో. కానీ సూపర్ ఇగో వీటికి భిన్నమైంది. అది తోడు దొంగల్లాంటి ఇడ్, ఇగోల ప్రవర్తనపై ఆంక్షలు విధించి, నిలువరించే ప్రయత్నం చేస్తుంది. ఇక్కడే ఇగో రూపు మార్చుకుంది. ఆత్మ వంచన మొదలయింది. దాంతో గోముఖ వ్యాఘ్రాలు, గొర్రెతోలు కప్పుకున్న తోడేళ్ళూ పుట్టుకొచ్చాయి. అలా కొండ గూడేన్ని ఆవరించిన పొగ మంచులో 'ఇడ్, ఇగో' లు వచ్చి నిశ్శబ్దంగా కలిసాయి.

నిద్ర మంచాల మీద ఉన్నవారిని, వెన్ను చరిచి లేపి తీసుకొచ్చాయి. దంత ధావనం చేస్తున్న వారిని హెచ్చరించాయి. వచ్చిన ప్రతి వారికీ, అందినన్ని కోళ్ళని ఇచ్చి పంపించాయి. కనుము పండుగనాడు దొరికిన అనూహ్యమైన బహుమతికి పొంగిపోయారు. ఇంటికి పోయి మిగిలిన వారిని పంపుతున్నారు. 'ఇది అన్యాయం' అని మొత్తుకుంది ' సూపర్ ఇగో '. "అది పరాయి సొమ్ము. మన కష్టార్జితం కాదు. దెబ్బలు తిన్న వ్యక్తులకు సాయం చేయటం మాని, వారి సొత్తుని

దోచుకోవటం అధర్మం" అని ఘోషించింది. కాస్త ఆలస్యంగా లేచిన సూర్యుడు 'ఈ గలాటా ఏంటో చూడాలని అడ్డుగా ఉన్న మంచు తెరల్ని కరిగిస్తుండగా, ఎగిరిపోతున్న ఆవిరిలో నిస్సహాయంగా కలిసిపోయింది సూపర్ ఇగో. పాపం దాని వేదన అరణ్య రోదన అయింది.

ఒక పిల్లవాడు (ఇడ్) ఆకతాయి పనులు చేస్తుంటే, వాడిని వెనకేసుకొస్తూ, తల్లి (ఇగో)గారాబం చేస్తుంటే తండ్రి (సూపర్ ఇగో) వారిని మందలిస్తూ, నిలువరించటానికి చేస్తున్న విఫల ప్రయత్నంలా ఉంది అక్కడి పరిస్థితి. కొయ్యబారిన వేణు దగ్గరకు వచ్చి, కర్తవ్యం బోధించింది 'ఇగో.' కార్య సాధకుడికి ఉచ్ఛ నీచాలతో నిమిత్తం లేదు. తన గమ్యం చేరటమే ముఖ్యం. "కాసేపుంటే ఒక్క కోడీ నీకు దక్కదు. హర్రీయప్ " అంటూ తొందర చేసింది. ఆ మరుక్షణం గీత విని కదన రంగంలోకి దూకిన సవ్యసాచిలా కోళ్ళ గుంపులోకి చొరబడ్డాడు కండక్టరు వేణు.



**One individual may die for an idea, but that idea will, after his death, incarnate itself in a thousand lives.**

**- Subhas Chandra Bose**

## అనువాద కథ

# ముక్కుపోగు



తెలుగు సేత - అంబల్ల జనార్దన్
88503 49858

ఆభరణాల ప్రపంచం నుండి ముక్కుపోగులు క్రమక్రమంగా మాయమౌతున్నాయి. బహుశా అవి ఈ కాలపు సున్నిత ముక్కులకు 'భారీగా' ఉంటాయనేమో? ముక్కుపోగు చిన్ని చెల్లి, ముక్కు పుడక ప్రస్తుతం, నారీమణుల ముక్కుపై రాజ్యమేలుతోంది. టీ.వీ. యాంకర్ల వదనంపై కొట్టొచ్చినట్టు కనబడే ముక్కుపుల్లలోని రాయి, ప్రేక్షకుల్లో గుండెల్లో కలవరం పుట్టిస్తోంది.

ముక్కుపోగు చోట్లో ముక్కుపుడక ఎంత వచ్చినా, ముక్కుపోగు తన హూందాతనాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. దసరా, దీపావళి సందర్భాల్లో బుల్లితెరపై కనిపించే యాంకరమ్మలు చక్కగా తొమ్మిది గజాల చీరకట్టి, ముక్కుకు ఓ కొత్త శోభనిచ్చే ముక్కుపోగుతో మరాఠీదనం ఉట్టిపడే రీతిగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాకు తెలిసిన ఓ యాంకరమ్మకు తన పాత ముక్కుపోగు దొరక్కపోవడంతో మా శ్రీమతినాశ్రయించింది.

“నేను నా ముక్కుపోగు నీకిస్తాను కాని, నీ పనైంతర్వాత, దాన్ని ఉన్నదున్నట్టు తిరిగివ్వు. అది మా అత్తమ్మ తన వారసత్వ సంపదగా నాకిచ్చింది. ఆమెకు అది వారి అత్తగారి నుండి అందింది. అలా అది ఓ అత్తగారినుండి మరో కోడలికి చెందుతూ వంశపారంపర్యంగా వస్తున్న ఉమ్మడి ఆస్తి. అది జాగ్రత్తగా మళ్లీ తిరిగి తెచ్చివ్వు.”

అలా ఆ అమ్మాయి మా శ్రీమతి ముక్కుపోగు పట్టుకెళ్లింది, పండగలు వచ్చి వెళ్లాయి, కాని మా ముక్కుపోగు మాత్రం తిరిగి రాలేదు. పండగల్లో టీవీలో యాంకరింగ్ చేసినప్పుడు, తీసి పెట్టుకునే హడవుడిలో అదెక్కడికో చెక్కేసింది. ఆ అమ్మాయి గుండె ఝల్లుమంది. అసలే అది తమ వారసత్వ సంపద అంటూ బజాయించి చెప్పిన ముక్కుపోగు అత్తయ్యకు, సంజాయిషీ ఎలా ఇవ్వాలా అని బిక్కుబిక్కు మంటూ మా ఇంటికొచ్చింది.

"అత్తయ్యా! నన్ను క్షమించాలి. మీ ముక్కుపోగు స్టుడియోలో ఎక్కడో పోయింది. ఎంత వెదికినా దొరుకలేదు. అలాంటిదే ఇంకోటి కొందామని నగల షాపుకెళితే, అలాంటి పాత మోడల్ ముక్కుపోగులు దొరకవన్నారు. అలాంటి డిజైన్ ది ఏదైనా తీసుకొస్తే, కొత్తది చేసిస్తామన్నారు. ఆ సంగతి మా స్నేహితురాలితో చెబితే, ఆమె నాకో ఉపాయం చెప్పింది." అప్పటికే క్రమక్రమంగా ఎర్రబడుతున్న కళ్లతో ఉన్న మా ఆవిడ.

**అలాంటి ముక్కుపోగులు, నాటకాలకు దుస్తులు సరఫరా చేసే వాళ్ల దగ్గర ఉంటాయంది.**

"ఏంటో ఆ ఉపాయం" గద్దిస్తూ అంది. ఆ మాటలకి బిత్తరపోయిన ఆ అమ్మాయి కళ్లల్లోకి నీళ్లు ఉబికిరాగా..

"అలాంటి ముక్కుపోగులు, నాటకాలకు దుస్తులు సరఫరా చేసే వాళ్ల దగ్గర ఉంటాయంది. వారి దగ్గరికెళితే 'మా దగ్గరున్న ముక్కుపోగులను వాటిని ధరించే వారి కులాలవారీగా విభజించాం. 'అ' ముక్కుపోగు బ్రాహ్మణులది, 'ఆ' ముక్కుపోగు వైశ్యులది, 'ఇ' కోళీ(బెస్త)వారిది, 'ఈ' మరాఠావారిది అలా అన్నమాట. దాంట్లోనూ 'అ–1' అంటే ఇరవయవ శతాబ్దపు మొదటి దశకానిదీ, 'అ–2' అంటే ఇరవయవ శతాబ్దపు రెండవ దశకానిది అలా అన్న మాట. నాకు తెలిసి మీది 'అ–3' కావచ్చని చెప్పడంతో అది తీసి చూపించారు. అది దాదాపు మీరిచ్చిన ముక్కుపోగుకు దగ్గరగా ఉండడంతో దానికి డిపాజిట్టు, బాడుగ కట్టి, నగల దుకాణంలో ఇస్తే వారు ఇదిగో ఈ కొత్త ముక్కు పోగు చేసిచ్చారు." అంటూ ఆ అమ్మాయి తన పర్సులోంచి తళతలా మెరిసే కొత్త ముక్కుపోగును తీసిచ్చింది. అది చూడగానే మా ఆవిడ కళ్లు విచ్చుకున్నాయి, కాని తన సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ..

"ఇది కొత్తది సరే, కాని దీనికి మా అత్తగారి వారసత్వ కళ అబ్బుతుందా? అయినా ఇది మా దానికంటే బరువు తక్కువున్నట్టుందే?" అంటూ ఆ ముక్కుపోగును తెరిపార చూడసాగింది.

"లేదత్తయ్యా. ఇది ఓ కాసు ఎక్కువే ఉంది కాని తక్కువ కాదు. మీరు ఎలగన్నా దీన్ని తీసుకుని నన్ను ఋణ విముక్తురాలిని చేయండి" అంటూ

ఏడుపుమొహం పెట్టి, ప్రాధేయపడిందా అమ్మాయి.

"సరే తీసుకోక చస్తానా? 'మంచికిపోతే చెడెదురైందని' దీన్నే అంటారు. ఇక ఎప్పుడూ ఎవరికీ మా నగలివ్వకుండా మంచిగా బుద్ధి చెప్పావు." అని దుమదుమలాడుతూ ఆ ముక్కుపోగును కొంగున చెక్కుక్కుంది నా (భార్యా)మణి. ఆ అమ్మాయి అటు పోగానే, నా భార్యను దెప్పడనికి నాకు మంచి సందు దొరికింది.

"చాల్లెండి, మీ వేళాకోళాలూ మీరూనూ. అత్తగారి ఒకానొక్క జ్ఞాపకం పోయిందే అని నేను బాధ పడ్తుంటే, మీకు నవ్వులాటగా ఉందా?"

"మణీ! పాత పోగు పోతేపోయింది కాని కొత్తది, ఇంకాస్త బరువున్నది కొట్టేశావ్. అదృష్టమంటే నీదే"

"చాల్లెండి, మీ వేళాకోళాలూ మీరూనూ. అత్తగారి ఒకానొక్క జ్ఞాపకం పోయిందే అని నేను బాధ పడ్తుంటే, మీకు నవ్వులాటగా ఉందా?" మా ఆవిడ ఉత్తుత్తికోపం చూపింది.

"మా అమ్మంటే నీకెంత ప్రేమో నా కంటే ఇంకెవరికి ఎక్కువ తెలుసు? సరే. సరే, ఆ కొత్త ముక్కుపోగు జాగ్రత్త."

మా మణిని ఏడిపించడానికి నాకు కొత్త అస్త్రం దొరికింది.

ఆ రోజు రాత్రి భోంచేసేప్పుడు మా మణితో మాట్లాడుతూ " దీన్ని ముక్కుపోగు దింపించడమంటారని మా దత్తు చౌధరి రాసినట్టు గుర్తు."

"మీకెప్పుడూ అదే ధ్యాస. నా ఒక్కదానితో వేగలేని మీరు ఇంకొకరి ముక్కుపోగు దింపుతారా?"

"నేనలా అన్నానా? ఎక్కడో చదివానన్నాను. నా మీద నీకున్న నమ్మకానికి జోహార్లు. నాది పుస్తక జ్ఞానమే తప్ప, చేతల్లో చూపేది కాదు. నువ్వేం బెంగ పెట్టుకోవద్దు"

"నాకున్నది, మీ మీద బెంగ కాదు. మీ దత్తు మీది బెంగ. అతను ఇప్పటివరకు మూడు నాలుగు ముక్కుపోగులు దింపాడని విన్నాను. అతన్ని కాస్త జాగ్రత్తగా ఉండమని చెప్పండి. అసలే 'నిర్భయ' చట్టం పాసైంది."

ముక్కుపోగులో కొట్టొచ్చినట్టు కనిపించే ముత్యాలను దృష్టిలో పెట్టుకుని "ముక్కు కంటే ముత్యాల ముక్కుపోగు బరువ"నే సామెత ఈ మధ్య తరచుగా వినబడుతోంది. నేటి రాజకీయాల్లో ఈ ముక్కుపోగుల్లోని ముత్యాల గుట్టు విప్పి, తమ గుర్రాన్ని ఎలా ముందుకు నెట్టాలనేది పెద్ద అలవాటుగా మరింది.

"సరే ఓ రూపాయి బిళ్ల తీసుకురండి" అంది మా మణి. నేను జేబులోంచి రూపాయి నాణెం తీసి ఆమెకిస్తూ.. "ఎగరెయ్యి" అన్నాను.

ఓ సారి మాటల్లో మా ఆవిడతో "నువ్విప్పుడు ముక్కు కంటే ముత్యాల బరువెక్కువలా ఉన్నావ్" అన్నాను.

"నాక్కూడా అలానే అనిపిస్తోంది. మీకిప్పుడనిపిస్తోందేమో కాని నాకు మీతో పెళ్లైనప్పటినుంచే అలా ఉంది."

"ఏంటేంటి, మళ్లీ చెప్పు." మా ఆవిడకు నాపై ఆ అభిప్రాయం ఉందంటే నమ్మబుద్ధి కాలేదు.

"మీకేం అనిపిస్తుందో అదే. మీకు మీరు ముక్కనుకుని నన్ను ముత్యమనుకుంటే, నాకు మాత్రం మీరు ముత్యం, నేను ముక్కనుకుంటాను." అని చురక పెట్టింది మా ఆవిడ.

"దీంట్లో నిజమెవరి పక్షాన ఉంది?"

ఎప్పటిలగే మా వాదన కొన'సాగిం'ది రసవత్తరమైన వాదనకు అంతమనేదుండదు. ఎవరూ ఎదుటివారిని వినిపించుకోవాలనుకోరు. నేనన్నాను. "ఇదంతా రబ్బరులాగా సాగుతూనే ఉంటుంది. ఎంత సాగదీసినా ఇంకా సాగుతూనే ఉంటుంది. దీన్నెలా పరిష్కరించేది? ఎన్నికల్లో, ఇద్దరికి సమాన ఓట్లు పడితే నాణెం ఎగరేసి, గెలుపు ప్రకటిస్తారు. మనం కూడా నాణెం ఎగరేద్దాం. నువ్వన్నది పడితే నువు గెలిచినట్టు, నేన్నన్నది పడితే నేను గెలిచినట్టు."

"సరే ఓ రూపాయి బిళ్ల తీసుకురండి" అంది మా మణి. నేను జేబులోంచి రూపాయి నాణెం తీసి ఆమెకిస్తూ..

"ఎగరెయ్యి" అన్నాను. "లేదు. మీరే ఎగరేయండం"దామె. "లేదు నువ్వే"

అన్నాను నేను. అలా మళ్లీ వాదులాట మొదలైంది. చివరికి నేనే రాజీ పడి "సరే నేనే ఎగరేస్తాను" అన్నాను. అంతలో అక్కడికి "అమ్మా" అంటూ మా అమ్మాయొచ్చింది.

"కాస్త ఆగు, మా టాస్ కానివ్వు"

"ముందు నామాట వినండి" అంది మా చిట్టి తల్లి. "లేదు. ముందు మా టాస్" అన్నాన్నేను. ఇంతలో

"మీరెగిరేయండి" అని మా ఆవిడనగానే నేను నాణెం ఎగరేశాను. మా చిట్టి తల్లి రోషంతో దాన్ని గాలిలోనే పట్టుకుంది. మా టాస్ మధ్యలోనే ఆగిపోయింది. మేం నవ్వాం.

"మంచిది. మ్యాచ్ డ్రా అయింది" అని తీర్పు ప్రకటించాను. అందరం నవ్వుకున్నాం.

ఇంకా మా మధ్య ఇలాంటి వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎవరికి వారు పట్టిన పట్టు విడువం. మళ్లీ ముక్కు, ముక్కుపోగు, దాని ముత్యాల బరువు, మా మాటల్లో దొర్లుతూనే ఉంటాయి. ఎవరి బరువు ఎవరు మోస్తున్నారో తేలదు. చివరికి మేమో నిర్ణయానికి వచ్చాం.

"దేవుడే మా 'మ్యాచ్' 'డ్రా' చేసినపుడు, ఇక సాగదీసి పొడిగించడమెందుకు?"

మరాఠీ మూలం – శ్రీ డీ. కె. సాఠే
మరాఠీలో కథ పేరు – "నథ్"

# తెలుగు కవిత్వ మాధురీ మధురిమ



డా. NCh. చక్రవర్తి
✆ 91822 76862

తిమ్మన కవి పారిజాతాపహరణం ఒక మనోహర ప్రబంధం. రాయల ఆంతరంగిక విషయాన్నే ఈ ప్రబంధ కథగా తిమ్మన మలచాడనీ అంటారు. తిమ్మన రాయలవారికి ఆంతరంగికుడు. అరణపు కవి. అంటే భార్య తిరుమలదేవి పరివారంలో రాయలవారి వద్దకు వచ్చి చేరాడు. అందుకే మిక్కిలి ఆత్మీయుడు అయ్యాడు. ఒక రోజు రాయల వారికి ఆయన భార్యకు జరిగిన ఘట్టాన్నే కావ్యంలో సత్యాకృష్ణుల ఘట్టంగా మలిచాడు అంటారు. అందులోని ఒక ఆణిముత్యం మనం ఏరుకుందాం.

ఉత్పల.
ఈసునఁబుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీ సఖమైన మోము పయిఁ జేల చెరంగిడి బాల పల్లవ
గ్రాస కషాయకంఠ కలకంఠ వధూ కల కాకలీధ్వనిన్ (1)

పారిజాత పుష్పాన్ని నారదుడు రుక్మిణి ఇంట ఉన్న కృష్ణునకు ఇచ్చాడు. రుక్మిణి ఇంట ఉన్నందున కృష్ణుడు ఆ పుష్పాన్ని రుక్మిణికి ఇచ్చాడు. ఈ విషయం పరిచారికల ద్వారా సత్యభామకు తెలిసింది.

అసలే కోతి, ఆపై కల్లు తాగింది అన్న చందంగా, అసలే సత్యకు రుక్మిణీ అంటే అసూయ. ఇప్పుడు కృష్ణుడు పారిజాతం రుక్మిణికి ఇచ్చాడు. అందువల్ల కోపం, అసహనం అన్నీ కలగలసి పోయాయి. సత్యభామ స్థితిని పై పద్యంలో వర్ణించాడు.

| | | |
|---|---|---|
| ఈసునన్ పుట్టి | = | అసూయతో పుట్టి |
| డెందమునన్ | = | హృదయంలో |
| హెచ్చిన | = | ద్విగుణీకృతమైన |

| | | |
|---|---|---|
| శోకదవానలంబుచే | = | శోకాగ్ని లో |
| లలితాంగి | = | సత్యభామ |
| పంకజ శ్రీ సఖమైన | = | పంకజశోభతో సాటి అయిన |
| మోము పయిన్ | = | ముఖంపై |
| చేలచెరంగున్ ఇడి | = | చీర కొంగు కప్పుకుని |
| బాల పల్లవ గ్రాస | = | లేత చిగురాకులను తిని |
| కషాయ కంఠ | = | మత్తెక్కిన గొంతుతో |
| కలకంఠ వధూ | = | ఆడు కోయిల |
| కల కాకలీ ధ్వనిన్ | = | మధురంగా పాడినట్లుగా |
| ప్రాణవిభు కట్టెదుటన్ | = | తన ప్రాణ నాథుడైన కృష్ణుని మ్రోల |
| గాసిలి ఏడ్చెన్ | = | భోరుమని ఏడ్చింది. |

తెలుగు ప్రబంధాలలో నాయికలు ఏడ్చినా అందమే, కోకిల పాటలాగా ఉంటుంది. నాయిక ఏడ్పును వర్ణించిన నాలుగు పద్యాలలో తిమ్మన కవి ఈ పద్యం ప్రసిద్ధి. ఇందులో నాటకీయత ఉంది. పాత్ర చేష్టలను వర్ణించడం నాటకీయత లో ఒక భాగం. ముఖాన్ని చీర కొంగుతో కప్పుకోడం మనం చూసే విషయమే. ఆ చేష్టని ఇక్కడ వర్ణించాడు కవి. చేదు, వగరు మావి పూత. అదే తింటుంది కోయిల. ఇక్కడ సత్యభామకు తెలిసిన వార్త కూడా ఆమెకు మిక్కిలి చేదు. అదీ ధ్వని. ఆ చేదును జీర్ణించుకోలేక రోదన. ఆ ఏడుపు ఇవతల కృష్ణునకు శ్రవణ పేయంగా ఉంది. ఎందుకంటే భావి కథ ఒకటి ఉంది. అది చరిత్రలో నిలిచిపోయే సాహస ఘట్టం. సత్య ఏడిస్తేనే ఆ ఘట్టానికి నాంది అవుతుంది. అందుకే కృష్ణునికి అది శ్రవణపేయం.

ఇంత ఉంది ఇందులో.

★★★

చిలకమర్తి లక్ష్మీనరసింహ కవి హాస్య రచనలకు పెట్టింది పేరు. నాటకాలు వ్రాసారు. కవిత్వం సృజించారు. ప్రహసనాలు వ్రాసారు. గొప్ప ఆధునిక కవి. కంటి చూపు లేకున్నా ఇన్ని రచనలు చేసారు ఆయన. గయోపాఖ్యానం నాటకం వారి ప్రఖ్యాత రచన. అందులో గయుడు తన భార్యతో ఆకాశ గమనం చేస్తూ ఉండగా కింద భూమి మీద నదులు, కొండలు ఎలా కనబడుతున్నాయో వర్ణిస్తారు.

మత్తేభ.

ఘనశైలంబులు బొమ్మరాళ్ళ పగిదిన్గన్పట్టె, జూపట్టె గొ
ప్ప నదుల్ ప్రాకెడు త్రాచుపాముల క్రియన్, భాసిల్లె నానా మహా
వనముల్ భూసతిమేన దోచిన గగుర్పాటుల్ వలెన్, మించె బ
త్తనముల్ చక్కని బొమ్మరిండ్లగతి, నేత్రద్వంద్వ సంతుష్టిగన్(2)

| | | |
|---|---|---|
| ఘన శైలంబులు | = | పెద్ద కొండలు |
| బొమ్మ రాళ్ల పగిదిన్ | = | బొమ్మ రాళ్ళల్లాగ |
| కన్పట్టెన్ | = | కనపడ్డాయి. |
| గొప్ప నదుల్ | = | పెద్ద నదులు |
| తాచుపాముల క్రియన్ | = | తాచు పాములలాగా |
| చూపట్టెన్ | = | కనబడ్డాయి. |
| నానా మహావనముల్ | = | పెద్ద పెద్ద అడవులు |
| భూసతి మేన తో | = | భూదేవి శరీరంలో పుట్టిన |
| గగుర్పాటుల్ వలెన్ | = | రోమాంచాల వలె |
| భాసిల్లెన్ | = | తోచాయి |
| నేత్రద్వంద్వ సంతుష్టిగన్ | = | కనుల పండువుగా |
| పత్తనముల్ | = | పట్టణాలు |
| చక్కని | = | అందమైన |
| బొమ్మరిండ్ల గతిన్ | = | బొమ్మరిళ్ల లాగా |
| మించెన్ | = | అతిశయించాయి |

భావి కథా సూచకంగా కొన్ని చెప్తారు కవులు. అవి ధ్వనిలో ఉంటాయి. నేరుగా ఉండవు.

కొండలు బొమ్మరాళ్ళలాగా అంటే కఠినంగా (ఎలాగూ కొండలు రాళ్ల మయమే) నదులు పాములలాగా ఉన్నాయి అంటాడు కవి. వనాలు రాజుకు గగుర్పాటు కలిగించే రీతిలో ఉన్నాయి అట. ఇందులో పాములు, గగుర్పాటు ఇవన్నీ భావి కథా సూచకాలు. ఈ గగన విహారం లోనే ఆపదలో చిక్కుకుంటాడు గయుడు. కనుకనే విషం క్రక్కే పాములను, భయం నిదర్శనం అయిన గగుర్పాటును ధ్వనిలో కవి చెప్పాడని భావించవచ్చు.

ఇది కవి నైపుణ్యానికి నిదర్శనాలు.

ఈ ధ్వని యే కావ్యానికి ఆత్మ.

★★★

నీతి సంగతులకు వస్తే భర్తృహరి సంస్కృతంలో వెలయించివ సుభాషితాలను తెలుగులోకి స్వేచ్ఛా అనువాదం చేసాడు ఏనుగు లక్ష్మణ కవి. ఈ పద్యాలు సంఘ జీవనానికి దర్పణాలు. సవ్యమార్గ సూచికలు. అందులో ఒక పద్యం:

మత్తేభ.

తమకార్యంబుఁబరిత్యజించియుఁబరార్థప్రాపకుల్ సజ్జనుల్
దమ కార్యంబు ఘటించుచున్ బరహితార్థ వ్యాపృతుల్ మధ్యముల్
దమకై యన్యహితార్థఘాతుక జనుల్ దైత్యుల్ వృథాన్యార్థభం
గము గావించెడువారలెవ్వరొ యెఱుంగన్ శక్యమే యేరికిన్(3)

పై పద్యంలో ఉత్తమ, మధ్యమ, అధమ పురుషుల స్వభావాన్ని తెలుపుతూ నాలుగో రకాన్ని కూడా తెలిపాడు.

| | | |
|---|---|---|
| తమ కార్యంబున్ | = | తమ పనిని |
| పరిత్యజించియున్ | = | వదలిపెట్టి |
| పరార్థ ప్రాపకుల్ | = | ఇతరులకు మేలు చేసేవారు |
| సజ్జనుల్ | = | ఉత్తములు |
| తమ కార్యంబు | = | తమ పని |
| ఘటించుచున్ | = | చేసుకుంటూ |
| పరహితార్థ వ్యాపృతుల్ | = | ఇతరుల పనులు నెరవేర్చేవాళ్ళు |
| మధ్యముల్ | = | మధ్యములు |
| తమకై | = | తమ స్వార్థం కోసం |
| అన్యహితార్థ ఘాతుక జనుల్ | = | ఇతరుల హితాన్ని చెడగొట్టే వారు |
| దైత్యుల్ | = | రాక్షస ప్రవృత్తి కలవారు. |
| వృథా | = | అకారణంగా |

| | | |
|---|---|---|
| అన్యార్థభంగమున్ కావించెడు వారలు | = | ఇతరుల పని చెడగొట్టే వాళ్ళు |
| ఎవ్వరొ | = | ఎవరో(వారిని ఏమి అనాలో) |
| ఏరికిన్ | = | ఎవరికైనా |
| ఎరుంగన్ | = | తెలిసికొనుట |
| శక్యమే | = | సాధ్యమా??(సాధ్యం కాదు అని) |

తమ పని ఆపుకొని ఇతరుల పనులు చేసి పెట్టేవారు సుజనులు.

తమ పని చేసుకొంటూ ఇతరుల పనులు చేసేవారు మధ్యములు. తమ స్వార్థం కోసం అందరి హితాన్ని పాడుచేసేవాళ్లు రాక్షస ప్రవృత్తి కలవారు. ఏమీ ప్రయోజనం లేకుండా అకారణంగా ఇతరుల పనులు చెడగొట్టేవారిని ఏమనాలి?? ఎవ్వరూ చెప్పలేరు. అంటాడు.

ఇలాంటివి చదివాక, విన్నాక మనం ఎలా ఉండాలో ఎలా ఉండకూడదో తెలుస్తుంది. అందుకే నీతి శతకాలు మానవ జీవితాన్ని మంచి మార్గంలో నడిపిస్తాయి.

★★★

మానవుని విలువ ఎందులో ఉన్నది? గొప్పదనం అంటే ఏమిటి? అన్న విషయాలు విశ్లేషిస్తూ వ్రాసిన ఈ వ్యాస రచయిత సొంత పద్యం ఒకటి చిత్తగించండి:

సీసం.
ఎన్ని బంగరుమేడలున్నవి యనికాదు –
దీనులెందరిఁ జేరఁదీసినావు?
దండిచుట్టాలెందరుండిరియని కాదు
సజ్జనులెందరు సఖులు నీకుఁ?
గలనాడుమిత్రులు కలరెందరనికాదు
లేమినెందరు నిన్నునోమువారు?
పదవినున్నప్పటి వందులగుమికాదు
జ్ఞానులెందరు నీకు సన్నిహితులు?

తేగీ.

స్వాస్థ్యమందుఁబ్రక్కననుండువారుకాక
మంచమునఁబడునాడు సేవించునెవరు?
శవముపైపడు దండల సంఖ్యకాదు
అంతరంగాన రోదింతురెంతమంది?(4)

భావం:

బంగారు మేడలు ఎన్ని ఉన్నాయి అన్నది లెక్క కాదు. దీనులకు ఎందరికి ఆధారంగా నిలిచావు అన్నది గణన. బాగా ఉన్న చుట్టాలు ఎందరు ఉన్నారు అనేది కాదు. మంచివాళ్ళు ఎందరు నీతో ఉన్నారు అన్నది ముఖ్యం. డబ్బున్న నాడు నిన్నంటిపెట్టి ఎందరు ఉన్నారు అని కాదు.. నీ పేదరికంలో నీతో ఎందరు ఉన్నారు అన్నది గొప్ప. పదవిలో ఉండగా ఎందరు వందిమాగధులు నిన్ను స్తుతిస్తూ ఉన్నారు అన్నది కాదు. జ్ఞానులు ఎందరు నీవెంట ఉన్నారు అన్నదే విలువ.

సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడు ఎందరు నీ చుట్టూ ఉన్నారు అన్నది కాదు, మంచంలో పడినప్పుడు నిన్ను ఎందరు చూసుకున్నారు అనేది కీలకం. భౌతిక శవం పై ఎన్ని దండలు పడ్డాయి అన్నది కాదు. హృదయంలో నిన్ను తలచుకొని ఎందరు దుఃఖిస్తారు అనేది కీలకం.

కనుక పదవి, డబ్బు, ఆరోగ్యం మొదలైన భాగ్యాలు కలిగి ఉన్నప్పుడు మనతో ఉన్నవాళ్లు ముఖ్యం కాదు, ఏమీ లేనినాడు, హోదాలు లేనప్పుడు, ముసలితనం లో ఎందరు మనతో ఉండి, సేవిస్తారు అన్నదే మనిషికి నిజమైన విలువ. అని సందేశం.

ఇలాంటి విలువైన పద్యాలను మరి కొన్నింటిని క్రమంగా తెలుసుకుందాం. తెలుగు సాహిత్యంలోని గుబాళింపులను ఆస్వాదిద్దాం.

సూచికలు:

(1) నంది తిమ్మన విరచిత పారిజాతాపహరణము – ప్రథమ ఆశ్వాసము 133 పద్యం.

(2) చిలకమర్తిలక్ష్మీ నరసింహం గారి గయోపాఖ్యానం నాటకం రెండవ అంకం లో పద్యం.

(3) భర్తృహరి సుభాషితాలు ఏనుగు లక్ష్మణకవి అనువాదం. జె.పి. పబ్లికేషన్స్, అరండల్ పేట, విజయవాడ.

(4) వ్యాసరచయిత NCh. చక్రవర్తి స్వీయ రచన.. అముద్రితం.

# ఇల్లు



డా. గిన్నారపు ఆదినారాయణ
99495 32456

ఇల్లంటే
నాలుగు గోడల మధ్య సుందర నిర్మాణ సువాసన పరిమళమే కాదు.
సుఖదు:ఖాలు సున్నంతో అంటిపెట్టుకునే నిర్మాణ సౌధం .

ఇల్లంటే
పసిపిల్లలు పాదం మోపి పరుగులు తీసిన మధుర జ్ఞాపకం,

ఇల్లంటే
జీవనసూత్ర త్రికాల క్షేత్రం. మానవ నాగరికత శాస్త్రాల బృహద్గ్రంథం

చూపులన్ని టి.వి కి కట్టేసి చేతులను రిమోట్ బంధించి
మొగలిరేకులు, ముద్దమందారాలు సీరియల్స్
అనుకునేరు వాటి పాత్రల స్వరూప స్వభావాలు, ఎబోలా,
కరోనా నిర్భంద,దిగ్భందాలు కాదు. ఆత్మీయులతో
మమతానురాగాలను తనవితీరా హత్తుకోవడం.


ఇల్లంటే
చెమ్మగిల్లిన కన్నీటి బొట్లను బరువెక్కిన హృదయాన్ని
మనసారా నవ్విన జ్ఞాపకాలను నడుస్తున్న వంటగదిని ఒక్కసారి
స్పృశించడం, ఇల్లంటే నాన్న తెరిచి ఉంచిన తలుపుల్లాంటి
సహృదయం

ప్రత్యేక వ్యాసం

# భారత సంవిధాన నిర్మాణం, ఉనికి



ఆచార్య మాడభూషి శ్రీధర్
84476 51505




విభిన్న ఆలోచనలు, జీవితానుభవాలు, వేర్వేరు వృత్తులలో నిష్ణాతులైన వారు ఎందరో శ్రమించి 75 సంవత్సరాల క్రితం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

మన రాజ్యాంగం ఎవరో ఒకరు రచించిన పుస్తకం కాదు. అది అంబేద్కర్ వంటి మహానుభావులు నిర్మించిన ఒక సంవిధానం. కొన్ని మౌలికమైన నియమాలతో నిర్మించిన రాజ్యాంగం ఇది. రాజ్యాంగ నియమాలతో పాటు రాజ్యాంగ సంప్రదాయాలు కొన్ని సంవత్సరాలనుంచి కొనసాగుతున్నాయి.

మనకు మనము సమర్పించు గణతంత్ర రాజ్యాంగ అవతారిక (ప్రియాంబుల్) భారత దేశ ప్రజల ఆకాంక్షలకి దర్పణం.

"భారత ప్రజలమైన మనము, మన భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి, మన దేశ పౌరులందరికీ

సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాల్ని;
ఆలోచనా, భావప్రకటనా, మతవిశ్వాస ఆరాధనా స్వేచ్ఛను;
హోదాల్లోనూ అవకాశాలలోను సమానత్వాన్ని సాధించేందుకు;

వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని;

మన రాజ్యాంగ పరిషత్తులో 1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి, శాసనీకరించి, ఆమోదించి, మనకు మనము సమర్పించుకుంటున్నాము".

యుపిఎస్ సి కోచింగ్ వారంతా రాజ్యాంగ పీఠిక ఎవరు రాసారు అనగానే జవహర్లాల్ నెహ్రూ అని జవాబు ఇస్తారు. దానికి కారణమేమంటే నెహ్రూ ప్రతిపాదించిన లక్ష్య తీర్మానమే భావి భారత రాజ్యాంగానికి లక్ష్య, ఉద్దేశ్య ప్రకటనగా రూపొందింది. మోహానీ చెప్పినట్టు రచనాసభ చర్చావివరాలు లేకపోవడాన్ని ఈ సందర్భంలోనే అంబేద్కర్ వ్యతిరేకులు విమర్శించడానికి ఉపయోగించుకున్నారు. ఇక్కడే అసలు రాజ్యాంగం మొదటిచిత్తు ప్రతి సేకరించి, అన్ని నియమాలు ఒకచోట గుమిగూర్చి, చర్చకు ప్రాతిపదికగా రూపొందించిందిన ఘనత రాజ్యాంగసభ సలహాదారుడైన బి ఎన్ రావ్ కు దక్కుతుందనే వారు ఉన్నారు. తొలి చిత్తు ప్రతిరూపకల్పనలో రావ్ పాత్ర నిర్వివాదాంశం. అయితే పీఠిక కూడా రావ్ గారే రాసారనడానికి వీలు లేదు. ప్రతిసభ్యుడి ప్రతిస్పందనను ఆధారంగా చేసుకుని, చాలా జాగ్రత్తగా రాజ్యాంగ వాక్యాలను రచనా సంఘం ముఖ్యంగా అంబేద్కర్ నిర్మించారనేది నిర్వివాదాంశం. అయినా వివాదం చేయదలచుకున్నవారికి వివాదం కావచ్చు కూడా. చాలా సందర్భాలలో అందరు సభ్యులు హాజరు కాలేదు. పీఠికా నిర్మాణ సమయంలో రాజ్యాంగ రచనా ఉపసంఘానికి చెందిన నలుగురు మాత్రమే తొలి సమావేశాల్లో పాల్గొన్నారు. ఏ రోజూ వదలకుండా మొత్తం రచనా ఉపసంఘం సమావేశాలన్నింటికీ వచ్చిన ఏకైక వ్యక్తి అంబేద్కర్ మాత్రమే. కనుక రాజ్యాంగం నిర్మించిన రచనా ఉప సంఘం అధ్యక్షుడు అంబేద్కర్ కే పీఠిక నిర్మాణం ఘనత కూడా చెందుతుంది. అయితే రాజ్యాంగ రచన, పీఠిక రచన రెంటికి మధ్య సారూప్యత ఉన్నా కొన్ని తేడాలు కూడా ఉన్నాయి. నిజానికి రచన, నిర్మాణం అనే పదాల మధ్య తేడాను కూడా అర్థం చేసుకొనవలసిన అవసరం ఉంది. 'ముఖ్య నిర్మాత' అన్నంత మాత్రాన అన్ని భాగాలకు రచయిత కూడా వారే అవుతారని అనడానికి వీలుండదు. అంబేద్కర్ రాజ్యాంగం రచన పూర్తయిన తరువాత ఇచ్చిన ప్రసంగం, నెహ్రూ లోకసభలో 6 డిసెంబర్ 1956 (అంబేద్కర్ నిర్యాణ దినం) నాడు చేసిన ప్రసంగం కూడా రాజ్యాంగ ముఖ్య నిర్మాత అంబేద్కర్ అనే

విషయాన్ని ధృవీకరిస్తాయి. ''సాధారణంగా రాజ్యాంగ నిర్మాతలలో అంబేద్కర్ ఒకరు అంటారు. కాని రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ కన్న ఎక్కువ శ్రద్ధ చూపినవారు గానీ కష్టపడ్డవారు గానీ మరొకరు లేర''ని జవహర్లాల్ నెహ్రూ చాలా స్పష్టంగా ప్రకటించారు. అయితే అంబేద్కర్ తన చివరి ప్రసంగంలో రాజ్యాంగ నిర్మాణ ఘనత తానొక్కడికే ఇవ్వడం సరికాదని ప్రకటించారు. డ్రాఫ్టింగ్ కమిటీలో, రాజ్యాంగ సభలో కూడా అనేక మంది రాజ్యాంగ రచనలో కీలకపాత్ర పోషించారని ఆయన వివరంగా చెప్పారు. ఈ రకరకాల చర్చల మధ్య రాజ్యాంగ పీఠికకు కర్త ఎవరు అనే విషయం మరుగున పడిపోయింది.

అంబేద్కర్ మన రాజ్యాంగానికి తండ్రి, కీలకమైన నిర్మాత కూడా. రచయిత కన్న తండ్రి, నిర్మాత గొప్పవారు. పార్లమెంటు వేరు. రాజ్యాంగ రచనా సభ వేరు. కేవలం రాజ్యాంగం నిర్మించడానికి పుట్టి, ఆ తరువాత కనుమరుగయ్యేది రాజ్యాంగ రచనా సభ– Constituent Assembly. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారం ఎన్నికై రాజ్యాంగ నియమాలను అనుసరించి చట్టాలు చేసే సభ పార్లమెంటు. మన రాజ్యాంగ రచనా సభకు అధ్యక్షుడు కలకత్తా హైకోర్టులో ప్రాక్టీసు చేసిన న్యాయవాది రాజేంద్ర ప్రసాద్. ఆయన ఏ పార్టీకీ సంబంధం లేని స్వతంత్ర వ్యక్తి.

### తొలి చిత్తుప్రతి – రూపకర్త బి.ఎన్. రావ్



29 ఆగస్టు 1947న అంటే మనకు స్వాతంత్ర్యం వచ్చిన 14 రోజులకు రాజ్యాంగ రచనా సభ ఒక రచనా ఉప సంఘాన్ని రూపొందించింది. ప్రముఖ పరిపాలనాధికారి, న్యాయవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజ్యాంగసభ సలహాదారు అయిన బివిన్ రావ్ (కన్నడ) రూపొందించిన తొలి చిత్తుప్రతిని ఈ రచనా సంఘం పరిశీలించి రాజ్యాంగసభముందు చర్చకు సమర్పించాలని ఈ సంఘానికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ''రాజ్యాంగ నిర్మాణంచేసిన ఘనత నాకు ఇచ్చారు, కాని నిజంగా అది నాకు చెందదు. అందులో కొంత సర్ బి ఎన్ రావ్ కు చెందుతుంది.. రాజ్యంగ సభకు ఆయన రాజ్యాంగ సలహాదారుడు. ఆయనే తొలి చిత్తు ప్రతి రూపొందించి మా డ్రాఫ్టింగ్ కమిటీ పరిశీలనకు సిద్ధం చేశారు'' అంబేద్కర్ 25 నవంబర్ 1949న రాజ్యాంగ సభలో చెప్పారు.



ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులు మాత్రమే రాజ్యాంగ సభలో ఉంటారు. అంబేద్కర్ను బొంబాయి గెలిపించలేదు. బెంగాల్ నుంచి ముస్లింలీగ్ మద్దతుతో సభ్యులైనారు. దళితులకు మైనారిటీలకు సమాన హక్కులు సాధించడానికే వస్తున్నానన్నారు. కాని దేశవిభజనతో ఆయన స్థానం పాకిస్తాన్కు వెళ్లిపోయింది. బొంబాయి రాష్ట్ర ప్రధాన మంత్రి (స్వతంత్రానికి ముందు ఆయారాజ్యాలకు ప్రధానమంత్రులు ఉండేవారు) బిఎన్ ఖేర్ కు రాసిన ఒక ఉత్తరంలో అంబేద్కర్ ను బొంబాయి నుంచి గెలిపించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఎం ఆర్ జయకర్ తో రాజీనామా చేయించి, అంబేద్కర్ను గెలిపించుకుని రాజ్యాంగసభకు పంపారాయన. అంబేద్కర్ మహోన్నత విద్యావంతుడు, అటు ఆర్థిక శాస్త్రం, ఇటు న్యాయశాస్త్రం ఆపోసన పట్టిన వాడు. పాలనా వ్యవస్థల నిర్మాణం గురించే అధ్యయనం చేసిన వ్యక్తి. కనుక రచనా ఉప సంఘంలో ఉండాలని రాజేంద్రప్రసాద్ సూచించారు. ఇతర సభ్యులు – అల్లాడి క్రిష్ణస్వామి అయ్యర్, ఎన్ గోపాలస్వామి అయ్యంగార్, కె ఎం మున్షీ, మహ్మద్ సాదుల్లా, బిఎల్ మిట్టర్ (వీరు అనారోగ్యంతో రాజీనామా చేస్తే ఎన్. మాధవరావు సభ్యులైనారు), డిపి ఖైతాన్ (వీరు 1948లో మరణిస్తే టిటి కృష్ణమాచార్య చేరారు). ఈ సంఘం సభ్యులు 1947 ఆగస్టు చివర తొలిసమావేశంలో అంబేద్కర్ను అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. గోపాలస్వామి అయ్యంగార్ రాజ్య వ్యవహారాల్లో తలమునకలై ఉన్నారు. సాదుల్లా, మాధవరావు గార్లకు డిల్లీ వాతావరణం సరిపడలేదు. పాలన, న్యాయ, రాజ్యాంగ రంగాలలో నిపుణుడైన రావ్, ఆయాదేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి మనదేశంలో అప్పుడున్న భారత ప్రభుత్వ చట్టం 1935ను విస్తరిస్తూ రాజ్యాంగం మొదటి చిత్తు ప్రతిని బెనెగల్ నర్సింగ్ రావ్ రూపొందించారు. ఆ తరువాత అందులో సూత్రాలను పునర్నిర్మించడంలో కీలకమైన కృషి చేసారు. ఆయన కూడా తరువాత విదేశాల్లో ఉండిపోవడం వల్ల అందుబాటులో లేరు. ఒకరిద్దరి పాత్ర లేనే లేదు. మరికొందరి పాత్ర స్వల్పం, మొత్తం భారం అంబేద్కర్ పైన పడింది అని టిటి కృష్ణమాచారి చెప్పారు.

అంబేద్కర్ ఆ బాధ్యతను నిర్వహించి రాజ్యాంగ పిత అయ్యారు. మరికొన్ని ఉపసంఘాలు కూడా చాలా సహకరించాయి. కేంద్ర అధికారాల కమిటీకి నెహ్రూ, రాష్ట్రాల అధికారాల కమిటీ నేతగా వల్లభ్ బాయ్ పటేల్, ప్రాథమిక హక్కుల కమిటీకి జె బి కృపలానీ, ఇంకా అనేకానేక అంశాలపైన ఎన్నో ఉపసంఘాలు పనిని పంచుకున్నాయి. ప్రాథమిక హక్కుల కమిటీకి అంబేద్కర్ ఇచ్చిన వివరమైన పత్రం చాలా కీలకమైంది. సభలో రాజనీతిజ్ఞులైన ప్రముఖులెందరో బాగా ఆలోచించి 7635 సవరణలను ప్రతిపాదించారు. వాటిలో 2473 సవరణలను చర్చించి ఆమోదించారు. మిగిలినవి చర్చించి తిరస్కరించారు. ప్రతి పదం పైన, వాక్యం పైన వివాదాలు వచ్చాయి. అన్నిటికీ అంబేద్కర్ సమాధానం చెప్పారు. సరైనవనుకున్న వాటిని ఆమోదించారు. బిఎన్ రావ్ 243 ఆర్టికిల్స్ 13 షెడ్యూళ్లతో ప్రతిని రూపొందిస్తే, అంబేద్కర్ అధ్యక్షతన ఉన్న రచనా కమిటీ అనేక చర్చలు సవరణల తరువాత 395 ఆర్టికిల్స్ 8 షెడ్యూళ్లతో పూర్తి చేసింది.

నవంబర్ 4. 1948 నాడు రాజ్యాంగం తొలి ప్రతిని చదివి రాజ్యాంగ సభలో ప్రవేశ పెట్టారు. పశ్చిమబెంగాల్ నుంచి ఎన్నికైన సభ్యుడు నజీరుద్దీన్ అహ్మద్ మొదటినుంచి రాజ్యాంగం చిత్తు ప్రతిలో లోపాలను ఎత్తిచూపుతూ ఉండేవారు. తొలి చిత్తు ప్రతిని కూడా ఆయన దుయ్యబట్టారు. 'ఇందులో అసంఖ్యాకంగా తప్పులు ఉన్నాయి. లోపాలు ఎన్నెన్నో, పనికిరాని రాతలూ, పదే పదే ఒకే విషయం చెప్పడం వంటివెన్నో ఉన్నాయి' అన్నారు. రాజ్యాంగ రచనలో కమిటీ పారదర్శకత పాటించలేదని రాజ్యాంగ సభ ఆమోదం లేకుండా మార్పులు చేసారని కూడా నిరసించారు. నిజానికి ఇది కేవలం ఆయన అనుమానం. దాన్ని ఆరోపణగా మార్చేసారు. వ్యాకరణం తప్పులను కూడా నజీరుద్దీన్ ఎత్తిచూపి తీవ్రంగా విమర్శించే వారు. నజీరుద్దీన్ మాత్రమే కాదు, కె సంతానం (మద్రాస్), ఆర్. ఆర్ . దివాకర్ (బాంబే) మౌలానా హస్రత్ మోహానీ (యునైటెడ్ ప్రావిన్సెస్) కూడా రచనను పదే పదే విమర్శించేవారు. రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ, చట్టవ్యతిరేకంగా తనను తాను రాజ్యాంగ సంఘం (కానిస్టిట్యూషన్ కమిటీ) గా మార్చుకున్నదని వ్యాఖ్యానించారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గారు రాజ్యాంగ సభ నిర్ణయాలను రచనలో పొందుపర్చడమే కాకుండా ఆ నిర్ణయాలను సమీక్షించారని కొన్ని చోట్ల వాటికి కొత్త రూపం ఇచ్చారని దివాకర్ విమర్శించారు. రాజ్యాంగ లక్ష్య తీర్మానపు (ఆబ్జెక్టివ్ రిజల్యూషన్) పరిధులను అంబేద్కర్ మించిపోయారని, ఇదివరకు తీర్మానానికి అనుగుణంగా ఉండే

బదులు, ఇప్పుడు ప్రతిపాదిస్తున్న కొత్త తీర్మానం (పీఠిక) కావాలని ఆయన అభిలాష అని మోహానీ విమర్శించారు. ఈ రిజల్యూషన్ ఆ తరువాత పీఠిక గా రూపొందింది. ఇదంతా ఎందుకంటే ఈ పీఠిక (ప్రియాంబుల్) రాసిందెవరు అనే ప్రశ్న కోసం. నిజంగా వెంటనే సమాధానం ఇవ్వడానికి వీలుకాని ప్రశ్న ఇది. రాజ్యాంగ సభ లో జరిగిన చర్చలు, మార్పులు, చేర్పులు ప్రసంగాల వివరాలు ఉన్నాయి కాని రాజ్యాంగ రచనా సంఘం లో సభ్యుల మధ్య జరిగిన చర్చలు, సవరణ ప్రతిపాదనలు, చేసిన మార్పులు, చేర్పులు, తుది రూపం ఇచ్చేముందు జరిపిన సంప్రదింపులకు సంబంధించిన సమాచారం లేదు. ఆ వివరాలు ఎక్కడా రాసి లేవు. రాజ్యాంగ సభలో ఈ పీఠికకు తుదిరూపంపైన చర్చకు ముందు జరిగిన వివరాలు లేవు. మనకే కాదు, రాజ్యాంగ సభ సభ్యులకు కూడా డ్రాఫ్టింగ్ కమిటీలో జరిగిన చర్చల వివరాలు అందుబాటులో లేవు.

## రాజ్యాంగ పీఠిక, పాట కాదు ఒక పాఠం, ఒక ప్రతిజ్ఞ

భారత రాజ్యాంగ పీఠిక ఒక జాతీయ గీతం వలె కనిపిస్తుంది వినిపిస్తుంది. కవీంద్ర రవీంద్రుడు వ్రాసిన జాతీయ గీతం జనగణమన అధినాయక జయహే ఒక దేశభక్తి గీతం, సందేహం లేదు. ఒక గౌరవ వందనగీతం. ఈ పీఠిక, పాట కాదు ఒక పాఠం, ఒక ప్రతిజ్ఞ, ఒక ప్రకటన. ఒక లక్ష్య వాగ్దానం. ఇందులో నిరంతరం గుర్తుంచుకోవలసిన మంత్రాక్షరాలున్నాయి. దిశా నిర్దేశనం నిమంత్రణ చేసే ఒక ఆదేశ పత్రం. ప్రజాసార్వభౌములు జారీ చేసిన ఒక రిట్. అనుల్లంఘనీయ శాసనం. కాని రక్షిస్తామన్నవారు, పాటిస్తామన్నవారూ, చదవవలసిన వారు, అర్థం చేసుకోవలసిన వారందరూ మరిచిపోయారేమో అనిపిస్తోంది.

మనం చేసుకున్న పీఠిక సామాజిక ఒప్పందం. మనం అంటే ఎవరు? మనం అంటే ఢిల్లీలో రాజ్యాంగంలో నిర్మించిన చుట్టూ ఉన్న మనమా? ఈ దేశం మనమా? 1950రోజుల్లో ఉన్న మన కోట్లాది మానవ దేవులా? లేక ఈ రోజు బతుకుని ఉంటూ బ్రతుకుబాట వెతుక్కుంటున్న మన మామూలు మానవులమా? అంటే అందరమే మనమే. ఇంకో మాట, మనం మనకే ఇస్తున్నాం అని కూడా అర్థం కావాలి మరి.

మొదట్లో భారత్‌ను "సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం"గా పేర్కొన్నారు. అయితే 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా ఇది "సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం"గా మారింది.

రాజ్యాంగానికి పీఠిక గుర్తింపు కార్డు వంటిదని శంకరీ ప్రసాద్ కేసులో (1952) జస్టిస్ హిదయతుల్లా పేర్కొన్నారు. విచిత్రమేమంటే పీఠిక మన రాజ్యాంగంలోని అంతర్భాగమా లేక బయట ఉన్న ఒక పేజీయా అని పేచీ వచ్చింది. ఈ అంశాన్ని బాగా విచారించి, సుదీర్ఘమైన వాదోపవాదాలు విన్న తరువాత న్యాయమూర్తుల ధర్మాసనం కేశవానంద భారతి కేసులో పీఠిక రాజ్యాంగంలోని అంతర్భాగమేనోయీ అని తీర్పు చెప్పింది. అంతకుముందు సుప్రీంకోర్టు వారు పీఠిక అంతర్భాగం కాదన్నారు. విచిత్రమేమంటే పీఠికలో ఉన్న హక్కులకు భంగకరమైన నియమాలు, లక్ష్యాలను అడ్డుకునే నియమాలు కొన్ని మొదటినుంచి ఉండడం, మరెన్నో తరువాత కాలంలో వచ్చి చేరడం జరుగుతుండడం గమనించవలసి ఉంది.

భారత ప్రజలు చేసుకున్న సామాజిక ఒప్పందమైన ఈ పీఠికలో ఇమిడి ఉన్న విలువలను కాపాడడానికి మనం దీక్షాబద్ధులం కావాలి. పౌరుడిని చైతన్యవంతుడైన సహేతుకమైన, స్వేచ్ఛాయుతుడైన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి ప్రతిజ్ఞ చేయాలి. మనం ఇంకా కులమతాల చట్రాలలోంచి, చట్టాలలోంచి బయటకు రాలేదు. మన ఎన్నికలన్నీ కులమతాలకు చెందిన ఓట్లను ప్రేరేపించడంతోనే మొదలై ముగుస్తున్నాయి. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత మనం సామాజిక అభివృద్ధి, ప్రజాస్వామ్య విలువల వంటి విధానాలు చూడడం లేదు. శ్రీ శ్రీ చెప్పినట్టు 'ఈ దేశం ఈ కాలం' మనదే, అదే కావాలి. కాని ఈ దేశం ద్వేషం కాకూడదు.

## ఇండియా, దటీజ్ భారత్:

ఇండియా, దటీజ్ భారత్, అని మన తొలి అధికరణం సంవిధాన రచన ఆరంభమవుతుంది. ఆర్టికిల్ 1 సంఘం పేరు ప్రాదేశిక పరిధి: (1) ఇండియా అంటే భారత్ రాష్ట్రాల సంఘమై ఉంటుంది. (2) రాష్ట్రాలు వాటి ప్రాదేశిక పరిధులను తొలి షెడ్యూలులో వివరిస్తారు. (3) ఈ ఇండియా పరిధిలో ఉండేవేవంటే (ఎ) అయారాష్ట్రాల పరిధి, (బి) తొలి షెడ్యూల్ లో పేర్కొన్న కేంద్ర పాలిత ప్రాంతాల పరిధి, (సి) భవిష్యత్తులో స్వాధీనంచేసుకోబోయే ప్రాంతాలు ఏవైనా ఉంటే అవి.



తొలి షెడ్యులులో పార్ట్ ఎ, బి, సి, డి అనే నాలుగు వర్గాల రాష్ట్రాలను వాటి పరిధులను పేర్కొన్నారు. (ఎ) భాగంలో బ్రిటిష్ ఇండియాలోని తొమ్మిది ప్రొవిన్స్ లు, (బి) లో స్వతంత్ర రాజ్యాలు, (సి)లో కేంద్రపాలనలో ఉన్న అయిదు రాష్ట్రాలు, (డి) అండమాన్ నికోబార దీవులు. ఏడో రాజ్యాంగ సవరణ (1956 ద్వారా పార్ట్ (ఎ) (బి) ల మధ్య తేడాను తొలగించారు. తరువాత రాష్ట్రాలను భాషాప్రాతిపదికన పునర్నిర్మించారు.

'భారత్' అని ఇండియాను పిలవాలంటూ ఒక ప్రజాప్రయోజన వాజ్యం 2016లో దాఖలైంది. మన రాజ్యాంగంలో మన దేశానికి భారత్ అనీ ఇండియా అనీ రెండు పేర్లున్నాయి. భారత స్వాతంత్ర్యపోరాటంలో మంత్ర వాక్యా భారత్ మాతాకీ జై. అందులోంచి భారత్ అన్న పేరును స్వీకరించారు. ప్రతి భారతీయుడికి ఈ రెండు పేర్లలో ఒక పేరును ఎంచుకునే హక్కు ఉందని ఆనాటి ప్రధాన న్యాయమూర్తి టి ఎస్ ఠాకూర్ అంటూ ఈ పిటిషన్ ను కొట్టి వేసారు. ఈ దేశాన్ని ఏమని పిలవాలో నిర్ణయించే నిరంకుశాధికారం సుప్రీంకోర్టుకు లేదని ఆయన అన్నారు.

1950 నుంచి వచ్చే గణతంత్రం 74వ నుంచి 75 కు వెళుతున్న దశ. గణతంత్రం ఉందా లేదా అన్నట్టు ఊగిసలాడుతున్న తరుణంలో మన భారతం స్వాతంత్ర్య అమృతోత్సవ సంవత్సరంలోకి దాటి పోయిన సందర్భం ఇది. మాయమాటలకు, పనికిరాని ఉచిత కానుకల వాగ్దానాలకు లొంగిపోయి అయిదేళ్ల ఆధిపత్యపు లైసెన్సులను ఓటర్లు సారా చిత్తులో, మతం మత్తులో, ధనం గమ్మత్తులో, ఫేక్ న్యూస్ విజృంభించే వాట్సప్ గ్రూపుల విపత్తులో పడిపోయి ఓట్ల రూపంలో సమర్పించుకుంటున్న దశ ఇది. 74 ఏళ్లు గణతంత్ర ఫలాలను చవి చూచిన జాతి, దాదాపు ఆ మహాత్యాగాలను, విషమ పోరాట విషయాల్ని మరిచిపోయింది.

భారతదేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనది. అన్ని వ్యవస్థలు, సంస్థలు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా పని చేయాలి. 1949 నవంబర్ 26న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఈ కింది విధంగా పేర్కొన్నారు– 'ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైనా కావచ్చు, కాని దానిని అమలు చేసేవాళ్లు చెడ్డవాళ్లయితే అది పనిచేయదు'. భారత రాజ్యాంగం చెక్కు చెదరకుండా ఉన్నట్టే ఉంది గాని, ఆదేశిక సూత్రాలు గాలిలో తేలిపోతున్నాయి. సుపరిపాలన సుడిగాలిలో కొట్టుకుపోతున్నది.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి మూడు దశాబ్దాలలో వివిధ రాజకీయ పార్టీలలో సేవా దృక్పథం కలవారు, రాజకీయాలను పూర్తికాలపు వృత్తిగా స్వీకరించిన వారు పోటీ చేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేవారు. కానీ ఆర్థిక సంస్కరణల తర్వాత రాజకీయాలు కార్పొరేటీకరణ చెంది, ప్రధాన రాజకీయ పార్టీలలో కార్పొరేట్ ప్రతినిధులు వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులుగా పోటీ చేస్తున్నారు. లోక్ సభకు రూ. 100 కోట్లు, శాసనసభకు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసేవారు మాత్రమే పోటీ చేయాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. గెలుపొందిన వారు వ్యాపారం చేసుకుంటూ తమ పదవిని వ్యాపార ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. దీని వలన నిజాయితీపరులు, సామాజికవేత్తలు, ప్రజా సేవా దృక్పథం కలిగిన వారు ఎన్నికలలో పోటీ చేయలేకపోతున్నారు. 539 మంది లోక్ సభ సభ్యులు ఎన్నికైతే వారిలో 233 మంది నేరాల కేసుల్లో తిరిగే వారే. ఎ.పి. అసెంబ్లీకి 174 మంది ఎన్నికైతే అందులో 151 మంది మీద నేర అభియోగాలున్నాయి. తెలంగాణ అసెంబ్లీలో 119 మంది ఎన్నికైతే వారిలో 73 మందిది రక్తచరిత్రే. ఏ నేరం చేయని వాడైతే ఎన్నికలో గెలిచే అవకాశాలు 4.7 శాతమేనట! అదే నేర చరిత్రగలఅభ్యర్థికి మాత్రం ఎన్నికల్లో గెలిచే అవకాశాలు 15.5 శాతమట. ఇదీ మన ఓటర్ల రీతి, నీతి. ఎవరు సిగ్గు పడాలి? ఎక్కడ సిగ్గు పడాలి? ఆ పార్టీ, ఈ పార్టీ అని కాదు, నేరగాళ్లకు టికెట్ ఇవ్వని పార్టీయే లేదు మన దేశంలో.

అచ్చమైన జనంతో స్వచ్ఛమైన దేశంగా భారత దేశం రూపొందాలని ఆకాంక్షిద్దాం.

చీనాలో రిక్షావాల, చెక్ దేశపు గని పనిమనిషీ,
ఐర్లాండున ఓడ కళాసీ, అణగారిన ఆర్తులందరూ–
హటెన్‌టాట్, జూలూ, నీగ్రో ఖండాంతర నానా జాతుల
చారిత్రక యథార్థ తత్వం చాటిస్తారొక గొంతుకతో
ఏ యుద్ధం ఎందుకు జరిగెనొ? ఏ రాజ్యం ఎన్నాళ్లుందో?
తారాఖులు, దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్రకర్థం

–శ్రీ శ్రీ

# మాటల మబ్బులు



**మహాకవి గురజాడ అప్పారావు**

దబ్బరలుం గొండెమ్ములు
మబ్బువలెం గ్రమ్మ మాయ మాటల తీపున్
నిబ్బరపు మొండితనమును
నబ్బురమగు విద్యలచటి యధికారులకున్.

తన కొక మేలు చేకురగ తక్కినవారికి గీడు సేయుటల్
మనమున లేని భక్తి యభిమానము మాటలలోనే చూపుటల్
గొనకెటు లాభముల్ గలుగు? గొంకక నాటకమాడ సాగుటల్
ధనమునకు న్మహోన్నతికి దారులు రాజగృహాంతరంబులన్.

కెంజిగురుల కోయిల, సుమ
మంజరులన్ దేటిగముల, మనుజ ఖగములన్
మంజుల ఫలముల, చూతమ !
రంజించెద వితర తరులు రా వాడుకొనన్.

విధి వశమున నీ చెంతకు
మధుపము రా హేళనంపు మాటాడకుమా
మధు వొలుకు జలజ కులముల
కధికపు నెయ్యుఁడగు కుటజమా ! తెలియు మెదన్.





ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

డాక్టర్ ఎం.మంజుశ్రీ

# గురజాడ వారి 'మాటల మబ్బులు' - అధికారుల స్వభావ చిత్రణ

ఆధునిక సాహిత్యంలో యుగకర్తగా ప్రసిద్ధిగాంచిన గురజాడ అప్పారావుగారు వస్తు నవ్యతతోపాటు ఛందోనవ్యతను పాటించారు. అయినప్పటికీ ఆయన సంప్రదాయబద్ధమైన ఛందస్సు ద్వారా నిగూఢమైన భావాలతో చక్కని పద్యాలను వర్ణించగలరని చెప్పడానికి అన్నట్లు అనేక రచనలను ఉదాహరణగా చూపించవచ్చు. విశాలాంధ్ర వారు ప్రచురించిన గురజాడ రచనల్లో 'మాటల మబ్బులు' ఖండికలు సంప్రదాయక విభాగంలో చేర్చారు. ఈ ఖండికల తర్వాతనే 'మెరుపులు' పేరుతో కొన్ని పద్యాలు సంస్కృతం నుండి అనువాదం చేసిన వాటిని చేర్చారు. కాబట్టి గురజాడ వారు రాసిన ఈ నాలుగు పద్యాలలో సంస్కృత కావ్యాల ప్రభావం ఉండే అవకాశం ఉందనిపిస్తుంది. తాను విస్తృతంగా అధ్యయనం చేసిన తీరు తెలుస్తుంది.

గురజాడ వారు విజయనగరంలోని ఆనందగజపతి సంస్థానంలో 1898లో ఆనంద గజపతి ఆక్క అప్పల కొండయాంబ (రీవా రాణి) అంతరంగిక కార్యదర్శిగా ఉద్యోగం చేశారు. అప్పుడు కొంతమంది ఉద్యోగుల ప్రవర్తనను, మనస్తత్వాన్ని దగ్గరగా పరిశీలించి తనదైన సృజనశీలతతో వీటిని వర్ణించి ఉండొచ్చు.

దీని శీర్షికను గమనిస్తే 'మాటలనెడి మబ్బులు' అని రూపకాలంకారంతో సొగసుగా ఆధునిక కవిత్వంలో పెట్టినట్లుగా శీర్షికను పెట్టారు. సాధారణంగా మబ్బులు ఆకాశంలో కనిపిస్తూ ఉంటాయి. వాటి వల్ల సూర్యకాంతి కిందికి పడకపోవడం వల్ల స్పష్టంగా కనిపించదు. రావలసినంత వెలుతురు అక్కడ

ప్రసరించదు. అదేవిధంగా కొండెపు మాటలు అనే మబ్బులు అలముకోవడం వల్ల  జ్ఞానమనే కాంతి ప్రసరించడానికి తాత్కాలికంగా అడ్డంకి అవుతుంది. దాని వల్ల మనలోని వివేకం పని చేయకుండా స్పష్టతను కోల్పోతాం. ఏది నిజమో ఏది అబద్ధమో గుర్తించలేని ఒక సందిగ్ధ స్థితిలో చిక్కుకుపోతాం. అటువంటప్పుడు ఎదుటివారు చెప్పిన దాన్నే మనం నమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీన్ని మాటలమబ్బులు పేరుతో మొదటి రెండు పద్యాలలో గురజాడ చక్కగా వర్ణించారు.

'దబ్బరలుం గొండెమ్ములు
మబ్బువలెం గ్రమ్ము మాయ మాటల తీపున్
నిబ్బరపు మొండితనమును
నబ్బురమగు విద్యలచటి యధికారులకున్'

ఆ సందర్భాన్ని 'రాజగృహాంతరాల్లో' అని అనడం ద్వారా ఉన్నతాధికారుల ఆంతరంగిక సమావేశాల్లో అని సూచిస్తున్నారు. సాధారణంగా ఉన్నతాధికారుల దగ్గర పనిచేసే కొంతమంది సిబ్బంది మనస్తత్వాన్ని గురజాడ వారు బయటపెట్టారు. ఉన్నతాధికారుల దగ్గర నమ్మకంగా పనిచేసే కొంతమంది  అబద్ధాలు, కొండెములను ఎంతో నమ్మశక్యంగా, తమ పై అధికారుల శ్రేయస్సునే ఆకాంక్షిస్తున్నట్లు తియ్యగా చెప్తూ అద్భుతంగా మెప్పు పొందుతుంటారు. పై అధికారుల పట్ల తమకి ఏమాత్రం గౌరవాభిమానాలు లేకపోయినా, ఎంతో గౌరవాన్నీ వినయాన్నీ ప్రదర్శిస్తూ గొప్పగా నటిస్తుంటారు. నిజానికి అలాంటి వాళ్ళు దీనివల్ల తమకు లాభం చేకూరడమే ప్రధానమైన కర్తవ్యంగా భావిస్తారు. వాళ్ళు దీనివల్ల రెండు ప్రధానమైన ప్రయోజనాల్ని సాధించే



ప్రయత్నం చేస్తారు. ఒకటి: తమగౌరవాన్ని పెంచుకోవడం. రెండు: పై అధికారుల అండదండలతో అత్యధిక ధనాన్ని అక్రమమార్గాల్లో సులభంగా సంపాదించడం. అనాటి రాజ అంతఃపురాల్లోనే కాదు, నేడు వివిధ స్థాయిలలో ఉన్నతాధికారుల దగ్గర కూడా ఇలాంటి వాళ్లే ఎంతోమంది ఎదురవుతూ ఉంటారు.

కవిని మన ఆలంకారికులు ఋషితుల్యునిగా భావిస్తారు. భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలకు సంబంధించిన విషయాలను ఊహించగలిగేవాడు నిజమైన కవి. కవికి ఉండే ఇటువంటి లక్షణాన్ని దర్శనం అంటారు. దీన్నే ఆధునిక సాహిత్య పరిభాషలో సార్వకాలిక సత్యంగా చెప్తున్నారు. ఈ ఖండికలో ఆ తర్వాత చెప్పిన రెండు పద్యాలు కూడా ఎంతో విలువైనవి. రాజ గృహాంతరాలలో జరిగే నిర్ణయాలు, వాటి వెనుకు ఉండే వారి స్వభావాలను, దానికి బలైపోయే మనుషులను వర్ణించి, అవి ఎలాంటివో తర్వాత మళ్ళీ రెండే పద్యాల్లో వర్ణించటం గురజాడ పద్య శిల్పంలో కనిపించే ఒకరహస్యం.

కెంజిగురుల కోయిల, సుమ
మంజరులన్ దేటిగముల, మనుజ ఖగములన్
మంజుల ఫలముల, చూతమ!
రంజించెద వితర తరులు రా వాడుకొనన్.

లేత చిగురులతో కోయిలను, పువ్వులు తమలోని మకరందంతో తుమ్మెదలను, మామిడి మొదలైన ఫల వృక్షాలు మానవులను, పక్షులను సంతోషింప చేస్తాయి. ఇతరమైనవి వీటిలా ప్రయోజనాన్ని కలిగించవు. అలాగే చెప్పుడు మాటలు, అబద్ధాలు చెప్పే వారి ప్రవర్తన కూడా తాత్కాలికంగా ఆనందాన్ని కలిగించవచ్చునేమో కానీ, ఉత్తములైన వారి మాటలే శాశ్వత ఆనందానికి కారణమవుతుంది.తర్వాత పద్యాన్ని చూస్తే ...

'విధి వశమున నీ చెంతకు
మధుపము రా హేళనంపు మాటాడకుమా
మధు వొలుకు జలజ కులముల
కధికపు నెయ్యుఁడగు కుటజమా ! తెలియు మెదన్' అని వర్ణించారు.

దురదృష్టవశాత్తు, లేదా విధి అనుకూలంగా లేకపోవడం వలన తుమ్మెదలు పొరపాటున కొండమల్లి దగ్గరకు చేరినంత మాత్రాన వానిని

అవహేళనగా మాట్లాడకూడదు. అవి పద్మాలకు మంచి మిత్రులనే విషయాన్ని మర్చిపోవద్దనడం ద్వారా నిజాయితీ గల వాళ్ళు, స్వచ్ఛమైన మనస్తత్వాన్ని కలిగిన వాళ్ళు తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు పడొచ్చు. చాడీలు చెప్పేవాళ్ళ వల్ల ఉత్తములు కొన్ని అవమానాలు కూడా కలుగవచ్చు. అయినా నిజం నిలకడ మీద తెలుస్తుంది. దానికి కొంతసమయం పడుతుంది. తమ నీతినీ, నిజాయితీని గుర్తించే వరకు ఓపికపట్టాలని, అంత వరకు అబద్ధాలు చెప్పేవాళ్ళే తాత్కాలికంగా గౌరవం పొందగలరేమో గానీ, సత్యం తెలుసుకున్న తర్వాత మరలా అటువంటి దురాలోచనాపరులను తమ దగ్గరకు శాశ్వతంగా రానివ్వరని చక్కని పోలికలతో వర్ణించారు కవి.

అధికారం ఉన్నవాళ్ళు, వాళ్ళ ప్రాపకం కోసం ప్రయత్నించేవాళ్ళు, వాళ్ళ మధ్య నలిగిపోయే నిజాయితీ గల అధికారులు, సిబ్బంది, ఆ మానవీయ సంబంధాలను, వారి మనస్తత్వాలను ఈ పద్యాలలో గురజాడవారు చక్కగా వివరించారు.



**"ఏ కవికైనా అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఆగమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను."**

**- శ్రీ శ్రీ**

# భారత రాజ్యాంగ శాసనాలు

కీ. శే. శ్రీ పండితారాధ్యుల
నాగేశ్వరరావు

వర్తకం చేసుకొని నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికి వచ్చిన బ్రిటిష్ వ్యాపారస్థులకు రాజ్యాధికారం సంక్రమించింది. అందుచేత వారు భారతదేశ పరిపాలనకు ఆ వర్తకదృష్టితోనే శాసనాలను తయారుచేస్తూ వచ్చారు. దేశాన్ని ఈ బ్రిటిష్ వర్తకులు ఏలుకున్నారేగాని ఎన్నడూ పరిపాలించి ఉండలేదు. 1773వ సంవత్సరంలో పార్లమెంటు చేసిన 'రెగ్యులేటింగ్ ఆక్టు' మొదలు 1935వ సంవత్సరపు భారత ప్రభుత్వ శాసనం వరకూ తయారవుతూ వచ్చిన చట్టాలను పరిశీలిస్తే తమకు దైవికంగా సంప్రాప్తించిన ఆర్థిక ప్రయోజనాలకు స్థిరపరుచుకొనడానికీ, వాటిని సంరక్షించుకొనడానికీ బ్రిటిష్ వారు ఈ శాసనాలను తయారుచేశారని స్పష్టమౌతుంది. 1935 లో తయారుచేసిన ఆఖరు శాసనంలో పరిపాలనావిధానానికి సంబంధించిన వాణిజ్యరక్షణలకు సంబంధించిన క్లాజులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

సరిగ్గా 350 సంవత్సరాల క్రితం ఎలిజబెత్ రాణీ ఈస్టుఇండియాకంపెనీకి



విదేశాలతో వ్యాపారం సాగించడానికి హక్కులను ప్రసాదించింది. ఈ కంపెనీపై అధికారం 24 కమిటీలకూ, ఒక గవర్నరుకూ ఉండేది. కమిటీలు అంటే కొంతమంది సభ్యులతో కూడిన సంఘాలు గాదు. 24 కమిటీలు అంటే 24గురు వ్యక్తులే. ఈ పాతికమందికీ ఆసియాలోని కొన్ని ప్రాంతాలతోనూ, ఆఫ్రికాతోనూ గుత్త వ్యాపారం చేసే హక్కుతోబాటు శాసనాలను చేసే అధికారాలను, న్యాయవిచారణ జరిపే అధికారాలను కూడా ఎలిజబెత్ రాణి 1600 డిసెంబరు 31వ తేదీ 'ఛార్టర్' మూలకంగా ప్రసాదించింది. ఈ అధికారాలను పురస్కరించుకొనే 1858వ సంవత్సరంలో విక్టోరియా రాణి భారతదేశ పరిపాలనాధికారాన్ని సంపూర్ణంగా స్వాధీనం చేసుకునేవరకూ ఈస్టుఇండియా కంపెనీవారు మన దేశాన్ని పాలిస్తూ వచ్చారు. దీన్నే మన తాత ముత్తాతలు కుంపిణీ ప్రభుత్వం అంటూవచ్చారు.

**మొదటి అరవై సంవత్సరాల్లోనూ ఈస్టుఇండియా కంపెనీ ఎన్నో అవస్థల పాలైంది. ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది.**

మొదటి అరవై సంవత్సరాల్లోనూ ఈస్టుఇండియాకంపెనీ ఎన్నో అవస్థల పాలైంది. ఎన్నో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. 1654వ సంవత్సరంలో క్రామ్వెల్ ఈ కంపెనీని డచ్ కంపెనీ పోటీనుండి రక్షించాడు. 1661వ సంవత్సరంలో రెండవ ఛార్లెస్ ఈ కంపెనీని జాయింట్ స్టాక్ కంపెనీగా ఏర్పాటుచేసి, ఆ కంపెనీ స్థాపించుకొన్న స్థావరాలపై అన్ని అధికారాలనూ చెలాయించడానికి హక్కులు ప్రసాదించాడు. కంపెనీ స్థావరాలంటే ఆ కంపెనీ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసుకున్న ప్రదేశాలే. ఆ ప్రదేశంలో నివసిస్తున్న వారందరిపైనా "సివిల్, మిలిటరీ, క్రిమినల్, రెవిన్యూ" అధికారాలను చెలాయించడానికి అక్కడి గవర్నరుకూ, ఆయన సలహా సంఘానికీ సంపూర్ణమైన హక్కు ఇచ్చాడు. ఈ హక్కును పురస్కరించుకొని వారు క్రైస్తవులు కానివారందరితో యుద్ధం చేయవచ్చు, ఒడంబడికలు కుదుర్చుకోవచ్చు.

1683వ సంవత్సరంలో మద్రాసులో మునిసిపాలిటీని స్థాపించేందుకు రెండవ ఛార్లెస్ ఈ ఈస్ట్ ఇండియా కంపెనీకి అధికారం ఇచ్చాడు. పదిసంవత్సరాల క్రితం 1677లో, బొంబాయిలోని ఈ కంపెనీ శాఖకు నాణెములను తయారుచేసే అధికారాన్ని కూడా ఇచ్చారు. 1678 నుంచీ

మద్రాసులో ఉన్న ఈస్ట్ ఇండియా కంపెనీ జుడిషియల్ అధికారాన్ని చెలాయించడం ప్రారంభించింది. రెండవ ఛార్లెస్ కాలంలోనే ఈ వర్తక సంఘానికి విశేషమైన రాజకీయ, సైనిక అధికారాలు సంక్రమించినవి. 1683 లో ఈయన ప్రసాదించిన హక్కులను పురస్కరించుకొని ఏషియా, ఆఫ్రికా, అమెరికాల్లోని ఏ జాతితోనైనా సరే ఈ వర్తక కంపెనీలు యుద్ధం చేయడానికి అధికారం ఏర్పడింది. ఈ ఛార్టరు ప్రకారమే భారతదేశంలోని 'కుంపిణీ' ప్రాంతాలపై న్యాయవిచారణాధికారము దృఢతరమైంది.

**1754వ సంవత్సరంలో ఈస్టుఇండియా కంపెనీవారి భారతీయ సైన్యానికి నియమ, నిబంధనలను కల్పిస్తూ ఒక శాసనం తయారైంది.**

1744వ సంవత్సరంలో ఫ్రాన్సు – ఇంగ్లండు యుద్ధం ప్రారంభమై 1746లో భారతదేశానికి వ్యాపించింది. అందువల్ల భారతదేశంలోని బ్రిటిష్ వర్తకులు 1748వ సంవత్సరంలో సైనిక దళాలను ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు. ఆ సంవత్సరంలోనే చెన్నపట్నంలో ఒక చిన్న సైనికదళాన్ని స్థాపించారు. సైన్యంలో క్రమశిక్షణను నిలబెట్టవలసిరావడం వల్ల వెనుకటి శాసనాలను సవరించవలసి వచ్చింది. 1754వ సంవత్సరంలో ఈస్టుఇండియా కంపెనీవారి భారతీయ సైన్యానికి నియమ, నిబంధనలను కల్పిస్తూ ఒక శాసనం తయారైంది.

1672వ సంవత్సరంలో చెన్నపట్నంపైనా, సరికి బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాల పైనా ఈస్ట్ఇండియాకంపెనీకి సంపూర్ణాధికారం లభించింది. కంపెనీ వ్యవహారాల్లో బ్రిటిష్ పార్లమెంటు ప్రత్యక్షంగా జోక్యం కల్గించుకోవడానికి ఇదే కారణం. దీనికితోడు బ్రిటిష్ ప్రభుత్వానికి డబ్బు కూడా చాలా అవసరమైంది. ప్రభుత్వానికి డబ్బు కావల్సివచ్చినప్పుడల్లా కంపెనీ హక్కులు అధికారం కావడంగాని, అధికారం పరిమితం కావడం గాని జరుగుతూ ఉండేది. 1766 వరకూ కూడా కంపెనీవారు తమ వాటాదార్ల కు నూటికి ఆరురూపాయల వంతున డివిడెండు పంచుకువచ్చారు. 1766లో ఒక్కసారి నాల్గు రూపాయలు ఎక్కువ ఇచ్చారు. ఆ మరుసటి సంవత్సరం ఇంకో రెండున్నరరూపాయలు పెంచారు. కంపెనీ ఆర్థిక స్థితి బ్రిటిష్ ప్రభుత్వానికి కన్నెర్ర అయింది. 1766 లోనే "కుంపిణీవ్యవహారాల" పై విచారణ జరిపించడానికి

పార్లమెంటు తీర్మానించింది.

ఈ విచారణ ఛాదమ్ ఆధ్వర్యాన జరిగింది. భారతదేశంలో కుంపిణీవారు సంపాదించిన భూభాగం వాస్తవంగా బ్రిటిష్ రాజుకు చెందాలని ఈయన వాదించాడు. చాలామంది ఈయన అభిప్రాయాలతో ఏకీభవించారు. కాని 'కుంపిణీ' రోజులు బాగుండటం వల్ల ఛాదమ్ జబ్బుపడడం తటస్థించింది. ఛార్లెస్ బాక్ షెండ్ 'కుంపిణీ' వారికి వీలైనంత మేలు చేయాలని అనుకున్నాడు. కుంపిణీవారి భూభాగాలపై బ్రిటీష్ రాజుకు సంపూర్ణాధికారం ఉందనే విషయం అప్పట్లో నిర్ధారణ కాకపోయినా 'కుంపిణీ' వారు మాత్రం తమ డివిడెండ్లను నూటికి పదిరూపాయలకు పరిమితం చేసుకోవడానికీ, బ్రిటిష్ ప్రభుత్వానికి ఏటా నాలుగు లక్షల పౌన్లు చెల్లించడానికీ ఒప్పుకున్నారు.

సిపాయి విప్లవం విఫలమైన మరుసటి సంవత్సరంలో 'కుంపిణీ' పాలన భారతదేశంలో పూర్తిగా అంతరించింది.

ఈస్టుఇండియా కంపెనీ వ్యవహారాల్లో పార్లమెంటు ఎక్కువగా, ప్రత్యక్షంగా ప్రమేయం కల్పించుకోవడానికి ఇదే మొదలు. ఇది జరిగిన అయిదు సంవత్సరాలకు "కుంపిణీవారు" దివాలా తీసే స్థితికి వచ్చారు. 1769లో ఏర్పాటు చేసుకొన్న కొత్త ఒడంబడిక ప్రకారం బ్రిటిష్ ప్రభుత్వానికి ఇచ్చుకోవలసిన నాలుగు లక్షల పౌన్లూ చెల్లింపలేకపోయారు. అప్పట్లో బ్రిటిష్ ప్రధానమంత్రిగా ఉన్న లార్డ్ నార్త్ పరిస్థితులను బాగు చేయడానికి ఏమీ చేయలేకపోయారు. కలనల్ బర్గాయిక్ పట్టుదల కారణంగా మళ్ళీ ఒక విచారణ సంఘం ఏర్పడింది. ఆ విచారణ ఫలితంగా 1773వ సంవత్సరంలో ఈస్టుఇండియా కంపెనీ చట్టాన్నొకదాన్ని బ్రిటిష్ పార్లమెంటు చేయడం జరిగింది. దీన్నే రెగ్యులేటింగ్ ఆక్టు అంటారు కూడా. కంపెనీ వ్యవహారాలను ఈ చట్టం క్రమబద్ధం చేసింది.

సిపాయి విప్లవం విఫలమైన మరుసటి సంవత్సరంలో 'కుంపిణీ' పాలన భారతదేశంలో పూర్తిగా అంతరించింది. బ్రిటిష్ సార్వభౌమునిదే సర్వాధికారం అయింది. అంతవరకూ ఈస్టిండియా కంపెనీవారు మన దేశాన్ని 1773వ సంవత్సరపు రెగ్యులేటింగ్ అక్టు ప్రకారంగా ఏలుతూ వచ్చారు. లార్డ్ నార్త్ ఈ చట్టాన్ని కేవలం ఒక సంస్కరణ కార్యంగా మాత్రమే భావించాడు. భారతదేశ ప్రజల బాధలు తమకు తెలియకపోలేదనీ, ఆ బాధలకు కారణం రాజకీయ

స్వాతంత్ర్యం లేకపోవడం గాదనీ ఆయన అభిప్రాయపడ్డాడు. దేశంలో యూరపియనుప్రభుత్వం లేకపోవడమే ఇందుకు కారణం అని విశ్వసించి ఒక సుప్రీంకోర్టును స్థాపించాడు. ఈ చట్టం ప్రకారమే బెంగాలుకు ఒక గవర్నరు జనరలూ, ఆయనకు నలుగురు సలహాదారులూ ఏర్పడ్డారు. వీరికి బెంగాల్, బీహార్, ఒరిస్సాలపై సంపూర్ణాధికారం ఉంటూ బొంబాయి, చెన్నపట్నం రాజధానుల పర్యవేక్షణాధికారమూ ఉంటూ వచ్చింది.

**వారన్ హేస్టింగ్స్ గవర్నరు జనరలుగా ఉండగా ఆయన తన సలహాదారుల సంఘంతో కలిసి వ్యవహారం చేయలేకపోయినాడు**

ఈ రెగ్యులేటింగ్ ఆక్టులో అన్నీ లోపాలే. 1793 నాటికి గాని ఇందులోని ప్రధాన లోపాలు సర్దుబాటు కాలేదు. వారన్ హేస్టింగ్స్ గవర్నరు జనరలుగా ఉండగా ఆయన తన సలహాదారుల సంఘంతో కలిసి వ్యవహారం చేయలేకపోయినాడు, ఈ సంఘంలోని అధికసంఖ్యాకుల నిర్ణయాలను బట్టి గవర్నర్ జనరల్ వ్యవహరించాలనేదే ఈ శాసనంలోని పెద్ద లోపం. పిట్ తయారుచేసిన 'ఇండియా చట్టం'లో అయినా ఈ లోపం సర్దుబాటు కాలేదు.

రెండవ లోపం ఈ శాసనం గవర్నరు జనరలుకూ ఆయన సలహా సంఘానికీ గల అధికారాలను స్పష్టంగా ప్రకటించలేదు. అలాగే సుప్రీంకోర్టు అధికారం ఎంతవరకు, ఏవిధంగా, ఏయే ప్రాంతాలపై ఉండేదీ స్పష్టం కాలేదు. ఈ కోర్టుకూ, బెంగాల్ ప్రభుత్వానికీ ఉండే సంబంధాలు కూడా సందిగ్ధంగానే ఉండిపోయినవి. ఈ సందిగ్ధావస్థను కొంతవరకు తొలగిస్తూ పార్లమెంటు 1781 లో వేరొక శాసనం చేసింది. ఈ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్ రాష్ట్రాలకు న్యాయ స్థానాలనూ, గవర్నరు సలహాసంఘాలనూ ఏర్పాటు చేయ వీలైంది. భారతదేశంలో శాసననిర్మాణ కార్యక్రమంలో ఇది చాలా ముఖ్యమైన సంఘటన అని చెప్పవచ్చు. 1781 లో పార్లమెంటు తిరిగి రెండు విచారణ సంఘాలను స్థాపించింది.

ఈ కమిటీల విచారణ ఫలితంగా 1783వ సంవత్సరంలో ఫాక్సు కంపెనీపై బ్రిటీష్ రాజు అధికారాన్ని ఎక్కువ చేయడానికి ప్రయత్నించాడు. ఆయన ప్రయత్నాలు సఫలం కాలేదు. ఫాక్సు-నార్త్ సంకీర్ణ మంత్రివర్గం

పతనం కావడంతో పిట్ అధికారానికి వచ్చి 1784వ సంవత్సరంలో ఇండియా చట్టాన్ని తయారుచేశారు, దీన్నే "పిట్స్ ఇండియా ఆక్టు" అంటారు, 1858 వరకూ భారతరాజ్యాంగానికి ఇదే ప్రాతిపదిక అయింది. కంపెనీ నిబంధనావళిలో ఈ 1784 చట్టం వల్ల మార్పేమీ రాలేదు. కాని బ్రిటిష్ ప్రభుత్వం ఏర్పాటుచేసే అధికారుల సంఘానికి కంపెనీ లోబడి ఉండవలసివచ్చింది. ఈ పిట్ చట్టంలోని లోపాల ఫలితాలను తరువాత డెబ్బయి సంవత్సరాలకు లార్డ్ పామర్ స్టన్ అనుభవింపవలసి వచ్చింది. కంపెనీ డైరెక్టర్లకూ, బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'కంట్రోలు బోర్డు'కూ సంఘర్షణలు మామూలై పోయినవి. పిట్టుకు పూర్వం ఫాక్సు భారతదేశంలో ఈస్టిండియా కంపెనీవారు సంపాదించిన భూభాగంలో మంచి ప్రభుత్వాన్ని ఏర్పరచి, పరిపాలన సవ్యంగా చేయ డానికి ఒక బిల్లును తయారుచేశాడు. కాని బిల్లు శాసనం అయ్యేవరకూ ఆయన అధికారంలో ఉండలేదు. పిట్ తన ఇండియా చట్ట లక్ష్యాన్ని 1784 జూలై 6న పార్లమెంటులో ఈవిధంగా వివ రించాడు : "భారతదేశానికీ, ఈస్టిండియా కంపెనీకీ ఏ విధమైన హానీ జరక్కుండా, మేలు చేయడమే ఈ బిల్లు ఉద్దేశ్యం." ఈ బిల్లుపై ప్రసంగిస్తూ ఫాక్సు పార్లమెంటు తయారుచేసే ఇండియా బిల్లులు ఏసూత్రాలపై తయారు కావాల్సిందీ ఇలా వివరించాడు : "భారతదేశములోని మన ప్రాంతాలకు సరికొత్త ప్రభుత్వవిధానాన్ని అమలుచేయడం అవసరమని నేను భావించడంలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో అమల్లో ఉన్న పద్ధతినే సంస్కరించాలి. భారతదేశ పరిపాలనా విధానంలో మార్పులు చేసే సందర్భంలో ముఖ్యంగా గమనింపవలసిన విషయాలు మూడు ఉన్నవి. మొదటిది భారతదేశంతో ఈదేశానికి ఉన్న వ్యాపారం. రెండవది ఆ వర్తక సంబంధం ఫలితంగా మనకు లభిస్తున్న సంపద. స్థానిక ప్రజల క్షేమం. వీటి నిర్వహణకూ బ్రిటిష్ రాజ్యాంగానికీ గల సంబంధం."

> కంపెనీ డైరెక్టర్లకూ, బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'కంట్రోలు బోర్డు'కూ సంఘర్షణలు మామూలై పోయినవి.

"వేల మైళ్ల దూరంలో" ఉండి ఒక దేశాన్ని పరిపాలించడం ఎంత కష్టమో ఈ బిల్లు చర్చ సందర్భంలోనే పిట్ పార్లమెంటుకు వివరించాడు. మొత్తం మీద అతః పూర్వపు శాసనాలకంటే పిట్ ఇండియా చట్టం చాలావరకు తృప్తికరంగానే

అమలు జరిగింది.

1797 లో మరొక శాసనం తయారైంది. ఈ శాసనం ప్రకారం రాష్ట్ర న్యాయస్థానాలు గవర్నర్ జనరల్ తన సలహా సంఘంతో తయారుచేసే నియమ నిబంధనల ప్రకారం వ్యవహరింపవలసి వచ్చింది. ఈ శాసనం అయిన మూడు సంవత్సరాలకు చెన్నపట్నంలో ఒక సుప్రీంకోర్టును స్థాపిస్తూ మరోశాసనం జరిగింది. 1807 లో మద్రాసు, బొంబాయి గవర్నరులకు కూడా న్యాయస్థానాల విషయంలో గవర్నరు జనరలుకు ఉన్న అధికారాలను ప్రసాదిస్తూ ఇంకొక శాసనం తయారైంది. ఇంతలో నెపోలియన్ రావడం, యూరపు రేవులు బ్రిటీష్ వ్యాపారానికి బందుకావడం జరిగింది. ఆ కారణంగా 1813వ సంవత్సరంలో మరొక ఛార్టరు ఆక్టును పార్లమెంటు తయారుచేసింది. ఈ శాసనం భారతదేశంలోని 'కుంపిణీ' భూభాగాలపై సర్వాధికారం బ్రిటీష్ రాజుదేనని నిర్ధారణ చేసింది.

1813వ సంవత్సరంలో మరొక ఛార్టరు ఆక్టును పార్లమెంటు తయారుచేసింది. ఈ శాసనం భారతదేశంలోని 'కుంపిణీ' భూభాగాలపై సర్వాధికారం బ్రిటీష్ రాజుదేనని నిర్ధారణ చేసింది.

తరువాత ఇరవై సంవత్సరాలకు పార్లమెంటు 'భారత రాజ్యాంగం'లో చాలా ముఖ్యమైన మార్పులు చేస్తూ శాసనం చేసింది. లార్డ్ మెకాలే, జేమ్సుమిల్ కృషి ఫలితమే ఈ శాసనం. ఈ శాసనం వల్ల కలిగిన మార్పులలో ఒకటి ఈస్టుఇండియాకంపెనీవారు ఇరవై సంవత్సరాలవరకూ బ్రిటిష్ రాజూ, ఆయన వారసుల తరఫున ధర్మకర్తలుగా భారతదేశాన్ని పాలించడానికి జరిగిన ఏర్పాటు. ఇంతకు పూర్వం భారతదేశంతో వ్యాపారం చేయాలంటే ఆ వర్తక కంపెనీ బ్రిటీష్ ప్రభుత్వం నుండి లైసెన్సులు పొందుతూ ఉండాలి. ఈ 1833 శాసనం ప్రకారం లైసెన్సులు పొందవలసిన అవసరం పోయింది. ఎవరుపడితే వారు యథేచ్ఛగా భారతదేశం పోయి వ్యాపారం చేసుకోవచ్చు. 1853 లో పార్లమెంటు మరొక శాసనం ద్వారా వెనుకటి ఏర్పాట్లనే ధ్రువపరుస్తూ కంపెనీ ధర్మకర్తృత్వానికి మాత్రం గడువు అంటూ ఏమీ పెట్టలేదు.

1853 శాసనం భారతదేశంలో ఒక లెజిస్లేటివ్ కౌన్సిలు స్థాపనకు అవకాశం కల్పించింది. ఈ శాసనాన్ని పార్లమెంటు 1853 ఆగస్టు 20వ తేదీన

ఆమోదించింది, ఈ శాసనం ప్రకారం బెంగాలుకు ఒక ప్రత్యేక గవర్నరును, సలహాసంఘాన్ని నియమించడానికి వీలుకలిగింది. అలాగే బొంబాయి, బెంగాల్, మద్రాసు రాజధానులు గాక కొత్త రాజధానులను స్థాపించడానికి ఈస్టుఇండియాకంపెనీ డైరెక్టర్లకు అధికారం లభించింది. ప్రస్తుతం వ్యవహారంలో ఉన్న రాజధానులకు వర్తించే శాసనాలు అన్నీ ఈ కొత్త రాజధానులకు వర్తించగలవని కూడా ఈ శాసనం నిర్ణయించింది. రాజధానులకు గవర్నర్లను నియమించినట్లే ఇతర ప్రాంతాలకు లెఫ్ట్ నెంట్ గవర్నర్లను నియమించడానికి కూడా అవకాశం ఏర్పడింది. భారతదేశంలో మొదటిదఫా చట్టసభ స్థాపన ఈ శాసనంలోని ప్రధానాంశం అని మొదట చెప్పాను. ఆనాటి గవర్నర్ జనరలులో అంతర్నిహితమైయున్న శాసనాధికారాల సక్రమ నిర్వహణకు ఈ లెజిస్లేటివ్ కౌన్సిలును ఏర్పాటు చేస్తున్నట్లు శాసనం వివరించింది. గవర్నరు, లెఫ్ట్ నెంట్ గవర్నరు రాష్ట్రాల నుండి ఒక్కొక్కరు, గవర్నరు జనరల్ ఈ కౌన్సిల్ లో సభ్యులుగా ఉంటారు. లెఫ్ట్ నెంట్ గవర్నరు ప్రాంతాలనుండి సభ్యులను గవర్నరూ, లెఫ్ట్ నెంట్ గవర్నరూ నామినేట్ చేస్తారు. ఇలా నామినేట్ అయ్యే సభ్యులు కంపెనీ నౌకరీలో అధమం పది సంవత్సరాలైనా పనిచేసి ఉండాలి. వీరు గాక బ్రిటన్ లోని, భారతవ్యవహారాల కమిషనర్ల బోర్డువారు సూచించగా, డైరెక్టర్ల కోర్టువారు ఇద్దరు ఇతర సభ్యులను ఈ శాసనసభకు నియమించేందుకు గవర్నరు జనరలుకు అధికారం ఇవ్వవచ్చు. ఈ ఇద్దరు సభ్యులు కూడా కుంపిణీవారి నౌకరీలో ఉన్నవారే కావాలి. అయితే వీరు కేవలం శాసనాలను చేసే సందర్భంలోనే కౌన్సిల్ సమావేశాలకు హాజరవుతూ, వోటు చేయడానికి హక్కు కలిగిఉంటారు. ఇది మన దేశానికి ఏర్పడిన మొదటి చట్టసభ.

ఈ సభకు గవర్నరు జనరల్ అధ్యక్షుడు. ఆయనే ఒక ఉపాధ్యక్షుని నియమించవచ్చు. గవర్నరు జనరల్, ఆయన హాజరు కాలేనిపక్షంలో ఉపాధ్యక్షుడు ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. శాసనాలకు చేయడంలో వాటిని అమలు జరిపి పాలించేవారు కూడా పాల్గొనడం మంచిదని ఈ కౌన్సిల్లో ముగ్గురు న్యాయమూర్తులకు కూడా సభ్యత్వం కల్పించారు.

1854వ సంవత్సరంలో పార్లమెంటు చేసిన శాసనమే ఈస్టిండియా కంపెనీకి భారతదేశంపైగల అధికారాలకు సంబంధించిన ఆఖరు శాసనం. ఈ శాసనం ప్రకారం కంపెనీ డైరెక్టర్ల సంఘం, కంట్రోలుబోర్డు ఆమోదంతో భారత గవర్నర్ జనరల్ భారతదేశంలోని 'బ్రిటిషు భూభాగం' లో ఏప్రాంతాన్ని

అయినా తన అధికారం క్రిందికి తీసుకొని ఆ ప్రాంతపరిపాలనకు అవసరమైన ఏర్పాట్లు చేయవచ్చు. అస్సాం, మధ్య పరగణాలు, బర్మా మొదలైన ప్రాంతాలకు ఛీఫ్ కమిషనర్లను నియమించడం ఈ అధికారాన్ని అనుసరించే జరిగింది. అయితే 1870 వరకూ కూడా ఈ ఛీఫ్ కమిషనర్ హోదాను పార్లమెంటు గుర్తించలేదు.

1858 ఆగష్టులో కొత్త ఇండియా ప్రభుత్వ చట్టం తయారైంది. ఈ చట్టం ప్రకారం భారతదేశంపై విక్టోరియా మహారాణికి సర్వాధికారం సంక్రమించింది.

1857 లో సిపాయి విప్లవం. అది విఫలం కావడంతోనే బ్రిటీష్ పార్లమెంటు భారతదేశంపై ఈస్టిండియాకంపెనీ అధికారానికి స్వస్తి చెప్పింది. 1858 ఆగష్టులో కొత్త ఇండియా ప్రభుత్వ చట్టం తయారైంది. ఈ చట్టం ప్రకారం భారతదేశంపై విక్టోరియా మహారాణికి సర్వాధికారం సంక్రమించింది. ఆమె తరఫున భారతదేశ పరిపాలనను నిర్వహించేందుకు ఒక సెక్రటరీ ఆఫ్ స్టేట్ ను నియమించడానికి ఏర్పాటు చేసింది. ఈయన జీతాన్నీ, ఈయన క్రింది అధికారుల జీతాన్నీ భారతదేశాదాయం నుండే చెల్లించాలని కూడా ఈ చట్టం శాసించింది. ఈ సెక్రటరీ ఆఫ్ స్టేట్ గాక, పదిహేనుమంది సభ్యులతో ఒక ఇండియా కౌన్సిలును కూడా ఈ శాసనం ఏర్పాటు చేసింది. ఇందులో ఏడుగురిని ఈస్టిండియా కంపెనీవారూ, మిగతా 8 మందినీ విక్టోరియారాణీ నియమించడమౌతుంది. ఈ కాన్సిలుకు 'భారత గవర్నరు జనరల్ కౌన్సిల్' అని నామకరణం చేశారు. ఈ కౌన్సిల్ సభ్యులకు పార్లమెంటులో పాల్గొనే అధికారం లేదు. వీరి జీతభత్యాలూ, పెన్షన్లూ భారతదేశాదాయం నుంచే ఇవ్వాలి.

ఈ కౌన్సిల్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ సూచనలను అనుసరించి భారతదేశ వ్యవహారాలను నిర్వహిస్తూ ఉంటుంది, అయితే ఈ కౌన్సిల్ భారతదేశానికి పంపే ఉత్తరువులపై ప్రభుత్వ కార్యదర్శే సంతకం చేస్తూ ఉండాలి. కార్యభారమును బట్టి, వ్యవహార నిర్వహణావసరాలను బట్టి ఈ కౌన్సిలును వివిధ ఉపసంఘాలుగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ కార్యదర్శికి అధికారం ఉంది. ఈ కౌన్సిలుకు ఈయనే అధ్యక్షుడు. ఈయనే ఒక ఉపాధ్యక్షుని నియమించవచ్చు. భారతదేశం నుండి వచ్చే రహస్య ఉత్తరాలను వేటినీ ఈ కౌన్సిలుకు తెలియజేయవలసిన

అవసరం లేదు. ఈ కౌన్సిలు నిర్ణయాలను త్రోసిరాజనడానికి ప్రభుత్వ కార్యదర్శికి పూర్తి అధికారం ఉంది. భారత దేశాదాయాన్ని ప్రభుత్వ కార్యదర్శి, ఆయన సంఘం తీర్మానించే విధంగా ఖర్చుచేయవలసి ఉంటుంది. ఈ జమాఖర్చుల వివరాలను ఏటా ప్రభుత్వ కార్యదర్శి పార్లమెంటుకు సమర్పించాలి. లోగడ ఈస్టిండియా కంపెనీవారు చేసుకొని ఉన్న ఒడంబడికలనన్నింటినీ బ్రిటిష్ మహారాణి పాలించాలని కూడా ఈ శాసనం నిబంధించింది.

**1935వ సంవత్సరపు శాసనమే బ్రిటిష్ పార్లమెంటు మన దేశ పాలనకు తయారు చేసిన ఆఖరు శాసనం.**

ఈ చట్టాన్ని పురస్కరించుకొని విక్టోరియా మహారాణి 1858 నవంబరు 1వ తేదీన ఒక ప్రకటన చేసింది. వైకౌంట్ కానింగును భారతదేశానికి మొదటి వైస్రాయిగా, గవర్నర్ జనరలుగా నియమించినట్లు ఈ ప్రకటనే వెల్లడించింది. వర్ణ వివక్షతను రద్దుచేస్తూ ప్రభుత్వోద్యోగాలకు బ్రిటిష్ పౌరులందరూ సమానార్హులేనని కూడా నిక్టోరియా మహారాణి ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేసింది. సంస్థానాధీశులు తమ పరిమితులకు లోబడి వ్యవహరించేపక్షంలో వారి స్థాయికి, హోదాకు ఎట్టి భంగమూ కలుగదని విక్టోరియా ఈ ప్రకటన ద్వారా కూడా మరొకసారి స్పష్టము చేసినది.

ఈస్టిండియా కంపెనీకి రాజకీయాధికారం సంక్రమించినప్పట్నుంచీ ఆ అధికారం బ్రిటిష్‌రాజుకు సంక్రమించేవరకూ భారతదేశ పరిపాలనకు శాసనాలు ఏవేవో, ఏవిధంగా తయారవుతూ వచ్చినవో ఇంతవరకూ పరిశీలించాం. 1858 నుండీ భారత రాజ్యాంగ శాసనాలు పూర్వం అంత తరుచుగా జరుగలేదని చెప్పవచ్చు. 1935వ సంవత్సరపు శాసనమే బ్రిటిష్ పార్లమెంటు మన దేశ పాలనకు తయారు చేసిన ఆఖరు శాసనం. దాన్ని నూత్న హోదాకు తగ్గట్టు మనం సూచించిన విధంగా బ్రిటీష్ పార్లమెంటు 1947లో సవరించింది. నూత్న రాజ్యాంగం అమలుకువచ్చిన ఈనాటివరకూ మన దేశపరిపాలన ఆ చట్టం ప్రకారమే జరుగుతూ వచ్చింది,


1861వ సంవత్సరంలో 'ఇండియన్ కౌన్సిల్స్ ఆక్టు' అంటూ ఒకటి తయారైంది. గవర్నరు జనరల్ తన శాసనసభకు ఆర్గురికి తక్కువ లేకుండా, పన్నెండుమందికి ఎక్కువ కాకుండా నామినేట్ చేయడానికి ఈ చట్టం

వీలు కల్పించింది. ఈవిధంగా నామినేట్ అయిన సభ్యులు రెండు సంవత్సరములు ఆ కౌన్సిల్ సభ్యులుగా ఉంటారు. వీరు కేవలం గవర్నరు జనరల్ కౌన్సిల్ శాసనసభగా సమావేశమైనప్పుడే ఆ సమావేశాల్లో పాల్గొనగలరు. వీరు ప్రభుత్వోద్యోగులుగా మాత్రం ఉండరాదు అంటే ఓంప్రథమంగా శాసనసభలో అనధికారులకు స్థానం లభించింది. అయితే ఈ చట్టసభ చేసే శాసనాలను త్రోసివేయడానికి బ్రిటిష్ సార్వభౌమునికి అధికారం ఉంది. అసాధారణ పరిస్థితుల్లో ఆర్డినెన్సులు జారీ చేయడానికి గవర్నరు జనరలుకు విశేషాధికారాన్ని ఈ శాసనం ప్రసాదించింది. కేంద్రంలో గవర్నరు జనరలుకు ఉన్నట్లే రాష్ట్రాల్లో గవర్నరులకూ శాసనసభలు ఏర్పడినవి. వీటి నిర్మాణం కేంద్రసంఘనిర్మాణం అనుసరించే జరిగాలి. ఇదేవిధంగా లెఫ్ట్ నెంట్ గవర్నరుల రాష్ట్రాలకూ శాసనసభలు ఏర్పాటైనవి. తరువాత పదిసంవత్స రాలకు జరిగిన మరొక 'ఇండియా కౌన్సిల్స్ ఆక్టు' కారణంగా రాష్ట్ర శాసనసభల అధికారాలు కొంచెం విస్తృతమైనవి. 1907లో మరొక కౌన్సిల్ అక్టు తయారైంది. దీనిప్రకారం గవర్నర్ జనరల్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య 14 వరకూ పెరిగింది. దీన్ని పురస్కరించుకొనే లార్డ్ మార్లే 1907 లో కె.జి. గుప్త, సయ్యద్ హుసేన్ బిల్గ్రామీ గార్ల ను "ఇండియా కౌన్సిల్" సభ్యులుగా నియమించారు. 1898వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రారంభించిన ఆందోళన కొంతవరకు ఫలించింది. ఇతఃపూర్వం 1892లో మరొక శాసనం ద్వారా లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను హెచ్చించారు. మాంటే – ఫర్డ్ సంస్కరణలకు పూర్వం జరిగిన ఇతర శాసనాల్లో గమనింపదగ్గది 1909 శాసనం. మొదటి దఫా శాసనసభల సభ్యులకు ఎన్నిక పద్ధతి ఈ చట్టం ద్వారానే ఏర్పడింది. ఈ శాసనాన్ని అనుసరించే బెంగాలుకూ, ఇతర లెఫ్ట్ నెంట్ గవర్నర్ల రాష్ట్రాలకూ కార్యవర్గాలు ఏర్పడినవి. ఈ కార్యవర్గాల సభ్యులు శాసనసభల సభ్యులుగా ఉంటారు. మొదటి పర్యాయం ప్రభుత్వ వ్యవహారాలపై శాసనసభ సభ్యులు ప్రశ్నలు వేయడానికి అధికారం లభించింది కూడా ఈ శాసనం వల్లనే.

**అసాధారణ పరిస్థితుల్లో ఆర్డినెన్సులు జారీ చేయడానికి గవర్నరు జనరలుకు విశేషాధికారాన్ని ఈ శాసనం ప్రసాదించింది.**

దీని తరువాత వచ్చిన 1919 శాసనం మనకు ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రసాదించింది. ప్రథమంగా మంత్రివర్గాలు ఏర్పడ్డవి. అయితే ఈ మంత్రులకు ప్రధాన విషయాల్లో అధికారం లేదు. 1935వ సంవత్సరపు చట్టం ఈ ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేసి ఒక విధమైన రాష్ట్ర స్వపరిపాలనాన్ని ప్రసాదించింది. భారత ఫెడరేషనుకు ఈ శాసనం చేసిన ఏర్పాట్లు భారత ప్రజలకు సమ్మతం కానందువల్ల అమలు జరుగలేదు. కేంద్రంలో 1919 శాసనం, రాష్ట్రాల్లో 1935 శాసనం అమల్లో ఉంటూ వచ్చినవి. 1946 సెప్టెంబర్లో కేంద్రంలో వైస్రాయి కార్యవర్గ నిర్మాణంలో మొదటిసారి మార్పు వచ్చింది. పండిట్ నెహ్రూ 'ప్రధానమంత్రి' అయినాడు. 1947 జూన్ లో దేశ విభజన జరిగి, ఆగస్టు 15న అధినివేశ ప్రతిపత్తి లభించింది. ఇపుడు మనం తయారుచేసుకున్న రాజ్యాంగం ప్రకారం పరిపాలన సాగుతున్నది. నూరేళ్ల నాడు ప్రారంభమైన స్వాతంత్ర్య పోరాటం నేడు ఫలించింది.

★ తొలుత భారతి పత్రికలో ప్రచురించబడినది (సంచిక 2, సంపుటి 27)



శాస్త్ర ప్రకాశిక

# 2008 వ సంవత్సరపు వైద్యశాస్త్ర నోబెల్ అంశం: ఎయిడ్స్ (aids) కి కారణమైన వైరస్ పూర్వాపరాలు



డాక్టర్ చాగంటి కృష్ణకుమారి
✆ 98851 63304

ప్రపంచమంతటా వ్యాపించిన వ్యాధి ని మహమ్మారి అంటాం (pandemic). మానవ చరిత్రలో రకరాకాల మహమ్మారులను గుర్తించడం,అందులో కొన్నింటికి టీకామందులు కనుగొనడం జరిగింది. ఉదాహరణకి వరియోలా వైరస్ (variola virus)వల్ల వచ్చేమశూచి (స్మాల్ పాక్స్) నిర్మూలనలో విజయం సాధించడం జరిగింది. ఇటువంటి వైరస్ ల వలన అపార ప్రాణనష్టంతో పాటుగా ఆర్థికాభివృద్ధి, దేశప్రగతి కుంటుపడతాయి. జనవరి 27,2020న తొలిసారిగా కోవిడ్ –19 మన దేశంలోని కేరళ రాష్ట్రంలో ప్రవేశించినట్లు తెలిసినప్పటినుంచీ ,నాలుగేళ్లు దాటినా ఇంకా ఈనాటికీ కరోనా మహమ్మారి (pandemic,)వైరస్ రూపాంతరాలు(Variants)లు పూర్తిగా తొలగి పోలేదు.ఈ వైరస్ వ్యవహారశైలే అంత!హుటాహుటిన కోవిడ్ –19 టీకా మందు తయారీకై మనభారతీయ శాస్త్ర వేత్తలు అహోరాత్రాలు కృషిచేసి చాలావరకూ అదుపులోకి తేగలిగారు. ప్రపంచవ్యా ప్తంగా ప్రాణ నష్టం భారీగా వున్నప్పటికీ ఈనాటి సాంకేతిక పరిజ్ఞానంతో వైరస్ అదుపై తొందరగా విజయం సాధించ గలిగారు అని మనం చెప్పుకోవాలి. చరిత్ర వెనకకువెళ్లి చూస్తే భయంకరమైన అత్యంత ఆందోళనకు గురిచేసిన వైరస్ హెచ్ ఐ వి.(HIV) అనగా హ్యూమన్ యిమ్యునో డిఫిసియన్సి వైరస్ (human immunodeficiency virus) ఆఫ్రికాలో వేటగాళ్లకు 1930లలో చింపాంజీల నెత్తుటి ద్వారా సంక్రమించి ఆతరువాత ఆఫ్రికా అంతా వ్యాపించి ప్రపంచదేశాలకు చేరిందని చెప్పడం వుంది. ఈ నాడు పరిశోధకుల అధ్యయనాల ప్రకారం 1959లో కాంగో రాజధాని కిన్సాహా లోఒకరికి చేసిన నెత్తుటి పరీక్షలో HIV–1 గురించినట్లు దాఖలా కనిపిస్తున్నది, ఆ వ్యక్తి చనిపోయాడు.1981లో ఒకానొక అరుదైన రకానికి


చెందిన నిమోనియా,కాన్సర్,ఇతర రుగ్మతల తో వైద్యుల దగ్గరకు జనాలు రావడం మొదలయింది. ప్రస్థుతం "ఎక్వైర్డ్ యిమ్యునో డిఫిసియన్సి సిండ్రోమ్-ఏడ్స్( Acquired Immunodeficiency Syndrome, or AIDS ) గా సిడిసి [U.S. Centre for Disease Control and Prevention (CDC)] ప్రకటించిన వ్యాధి-- ఈ అరుదైన రకపు నిమోనియావే! HIV అనే వైరస్ శరీరంలో బాగాముదిరిపోయిన దశకి చేరినప్పుడు AIDS వ్యాధిగా మారుతుందని ఇప్పుడు అందరికీ తెలిసిన విషయము.ఈ వైరస్ ని ఫ్రెంచ్ వారి పాస్చర్ యిన్సిస్ట్యూట్ లో ఫ్రెంచ్ వైరాలజిస్టులైన ఫ్రాన్స్వా బారే సిన్నోసి (Franoise Barr-Sinoussi) ,ల్యూ క్ మోన్టాగ్నీర్(Luc Montagnier )1983లో కనుగొన్నారు. కనుగొన్న 25 సంవత్సరాలకి, అనగా 2008 లో వైద్య రంగానికిచ్చే నోబెల్ బహుమానంలో చెరో ¼ వంతు భాగాన్నీ అందుకొన్నారు. సగం భాగాన్ని సెర్వికల్ కాన్సర్ కి కారణమైన మానవ పాపిలోమా (human papilloma ) వైరస్ ని కనుగొన్నందుకు హరాల్డ్ జెడ్ హుసేన్(Harald Zur Hausen) పొందాడు. ఈ రెండు రకాల వైరస్ లూ మనుష్యులలొ తీవ్రమైన వ్యాధులకు కారణభూతాలని ఈముగ్గురి పరిశోధనల వల్లా వైద్య లోకానికి తెలిసింది. 1981 లో కనబడిన వ్యాధికి కారణమైన వైరస్ ను 1983 లో నే కనుగొనగలిగిన విషయము గమనించ దగ్గది.

అంత తొందరగా వైరస్ ని గుర్తించడం ఎలా జరిగిందంటే ఫ్రాన్స్వా బారే సిన్నోసి అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే 1971లో చెర్మన్ (Jean-Claude Chermann)తో కలసి పనిచేస్తున్న పరిశోధకుల బృందంలో పరిశోధకురాలిగా చేరింది.1975లో పి హెచ్ డి పట్టా పొందింది.


Harald zur Ha usen


Françoise Barré-Sinoussi


Luc Montagnier





**HPV**
**Human papilloma virus has circular, double-stranded DNA, protected by capsid proteins. Diameter: 55 nm.**

**HIV**
**Human immunodeficiency virus is a retrovirus of the lentivirus group. Viral RNA is converted to DNA, which integrates into the cellular genome. Diameter: 90–130 nm.**

అప్పుడు అక్కడ నిర్వహిస్తున్న పరిశోధనలలో 'రెట్రో వైరస్ లూ; కాన్సర్'– ప్రధానాంశం,ఈ అంశంపైనే ఆ ప్రయోగశాల ఎక్కువగా దృష్టి పెట్టింది. పరిశోధనపై ఆసక్తితో చేరిన ఫ్రాన్స్వా బారే సిన్నోసిని ఈ పరిశోధనాంశం సరియైన త్రోవలో పెట్టింది. రెట్రో వైరస్– కాన్సర్ అధ్యయనాల పట్ల అభిరుచిని పెంచు కొన్న సిన్నోసిని ఒక విజయవంతమైన పరిశోధకురాలిగా,నోబెల్ గ్రహీతగా నిలబెట్టింది. ప్రస్తుతం పాస్చర్ యిన్ స్టిట్యూట్ లో ఆచార్య పదవిలో. ఫ్రాన్స్ కి చెందిన ఇంసెర్మ్ [National Institute of Health and Medical Research(INSERM )]కి పరిశోధనా సంచాలకురాలి గానూ(Director of Research) సైంటిఫిక్ బోర్డ్ ఆఫ్ ది ఫ్రంచ్ ఏజెన్సి ఫర్ ఏడ్స్ రీసెర్చ్ (Scientific Board of the French Agency for AIDS Research.)కి ప్రెసిడెంట్ గానూ బాధ్యతలను నిర్వహిస్తున్నది.



Retroviruses are infectious agents, which trick host cell into believing its DNA is part of the host cell's own code The host cell then copies it over and over, making a swarm of new retroviruses to invade new healthy cells. The HIV 1 virus shown under a microscope. Charles Dauguet/Science Source



February 4, 1983 First snapshot of the HIV-1 virus in the laboratories of the Institut Pasteur. INSTITUT PASTEUR@ institutpasteur


రెట్రో వైరస్ లు చాలా దుష్ట జాతికి చెందిన అంటువ్యాధి కారకాలు. ఇవి మన శరీరంలో చేరినపుడు వాటి RNA మన కణాల DNA కోడ్ లో భాగమే అన్నట్టుగా మన కణాలను మభ్య పెడతాయి. అలా చేయగల సామర్థ్యం వున్న ఒక ఎంజైమ్ వాటిలో వుంటుంది. దీనిని రివర్స్ ట్రాన్స్క్రి ప్టైజ్ ఎంజైమ్ (Reverse transcriptase) ఎంజైమ్ అంటారు.ఈ ఎంజైమ్ వల్ల బోల్తాలో పడిన మన కణాలు అవీ మనవే అని భావిస్తూ వైరస్ ను కాపీ చేసుకొంటూ పోగా పోగా అలా చేరిన కొత్త రెట్రో వైరస్ లు మరికొన్ని ఆరోగ్యవంత మైన కణాలను మభ్యపెడుతూ వృద్ధి చెందుతాయి. ఈవిధంగా శరీరంలో రెట్రో వైరస్ ల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. అప్పుడు భయంకరమైన వ్యాధి సంక్రమిస్తుంది. ఈ జాతికి చెందిన వైరస్ ల వల్ల కంతులు ఏర్పడుతాయి, శరీరపు రోగ నిరోధక శక్తి తగ్గి పోతుంది. ఈ వైరస్ లకు ఒక ఉదాహరణ హెచ్. ఐ. వి. ఇది శరీరంలో బాగా ప్రబలిన ఆవ్యక్తి ఏడ్స్ వ్యాధికి గురవుతాడు.

సిన్నోసి , మోన్టాగ్నీర్ లు ఈ పరిశోధన చెపట్టిన సందర్భమూ, దాని కథ కమామేషు ఏమిటో సూక్ష్మంగా తెలుసుకొందాం. స్వలింగ సంపర్కులకు సోకిన ఒక భయంకర జబ్బుని తొలిసారిగా ఫ్రాన్స్ వైద్యుడు విల్లీ రోజెంబామ్( Willy Rozenbaum) గుర్తించాడు. తన దగ్గరకు వచ్చిన చాలా మందిలో ఈ జబ్బు వున్నదని సిడిసి [Centres for Disease Control (CDC)]కు తెలియజేయగా ఆ వార్తను1981లో వారు ప్రచురించారు. పారిస్ లోని బికాట్ ఆసుపత్రి (Bichat Hospital) లో వైరాలజిస్ట్ గా పనిచేస్తున్న విజినెట్ ( Fran□oise Brun-V□zinet), విల్లీ తోకలసి తన అధ్యయనాలపై కృషి చేస్తున్నాడు. అతను లక్ మోన్టాగ్నీర్ కి ఫోన్ చేసి తీవ్రఆందోళనకు గురిచేస్తున్న ఈ వింతజబ్బుకి ఒక రెట్రో వైరస్ కావచ్చునేమో పరిశోధన చేసి చూడగలరా మీ ప్రయోగ శాలలో అని అడిగాడు. అప్పుడు పాస్చర్ యిన్ స్టిటూట్ ఆంకాలజి శాఖ కి సంచాలకుడు, మోన్టాగ్నీర్ "విజినెట్ సూచించిన ప్రోజెక్ట్ మీద నీవు కృషి చేస్తావా " అని ఫ్రాన్స్వా బారే సిన్నోసి ని అడిగాడు. ఎలుకల చను గడ్డలకు[mouse mammary tumour virus (MMTV)]కారణమైన వైరస్ ల నుసరణలను(sequences) రొమ్ము క్యాన్సర్ రోగుల తెల్ల రక్తకణాలలొ(lymphocytes) గుర్తించిన అనుభవము సిన్నోసి కి వుంది. రివర్స్ ట్రాన్స్క్రి ప్టైజ్ ఎంజైమ్ క్రియాశీలత గుర్తింపు (reverse transcriptase activity detection ) అని చెప్పబడే ఈ సాంకేతికతలో

అప్పటికే చేయితిరిగిన పరిశోధకురాలు కావడాన్ని ఆప్రోజక్ట్ ని చేపట్టడానికి ఆసక్తితో ఉద్యుక్తురాలైంది.' అయితే , చర్మన్ గారి అనుమతి తీసుకొని ఏసంగతీ చెపుతాను" అన్నది. ఆవిధంగా జె సి చెర్మన్ పర్యవేక్షణలో, సిన్నోసి ,మోన్టాగ్నీర్ లు ఇరువురు స్వలింగ సంపర్కులకు సంక్రమించిన ఆవింత జబ్బుకు కారణం ఒక రెట్రో వరస్ కాగలదేమో చూద్దాం అంటూ పని మొదలెట్టారు. .

వ్యాధి తొలిదశలొనున్న రోగి శోషరస గుబ్బ(lymph node)ను సేకరించి బయాప్సీ చేసి చూసారు. దానిలో రెట్రో వైరల్ రివర్స్ ట్రాన్స్క్రి ప్టైజ్ ఎంజైమ్ క్రీయా శీలతను గమనించారు. అది రెట్రో వైరస్ ప్రతి రూపపు ఉనికికి సూటి నిదర్శనం కావడం వల్ల రెట్రో వైరల్ జాతికి చెందిన హెచ్ ఐ వి దానిలో వున్నదని కనుగొన్నారు. దీని వల్లే ఏడ్స్ వస్తుందన్న సంగతిని 1984లో నిర్ధారణ చేసారు.

1980లకి పూర్వము AIDS అని ఇప్పుడు మనం చెప్పుకొంటున్న వ్యాధి కేవలం ఒక తరహా జీవన శైలి– ఉదాహరణకి స్వలింగ సంపర్కులు– వారికి మాత్రమే సోకుతుందని భావించేవారు.



Thin-section transmission electron microscopic (TEM) image of the ultrastructural details of a number of human immunodeficiency virus (HIV) particles, or virions .CDC/ A. Harrison; Dr. P. Feorino

కానీ ఎప్పుడైతే సిన్నోసి, మోన్టాగ్నీర్ లి హెచ్ ఐ వి నీ అది ముదిరిన కారణంగా వచ్చే ఏడ్స్ నీ 1983లో వెలుగులోకి తెచ్చారో అప్పుడు WHO ప్రపంచ వ్యాప్తంగా ఏడ్స్ వ్యాప్తి ఎలా వున్నాదో జాగ్రత్త గా పర్యవేక్షించి గమనించాలని తొలిసారి గా సమావేశమై నిర్ణయించింది. ఫలితంగా ఏడ్స్ అంటువ్యాధి భిన్న లింగ సంపర్కుల కు, వ్యాధి వున్నతల్లి గర్భాన పుట్టిన బిడ్డకూ రాగలదని తెలిసింది. ఏఏ సందర్భాలలొ ఈ వైరస్ మనిషి నెత్తుటిలో చేరుతుందో రూఢిగా తెలుసుకోగలిగారు.

సిన్నోసి తన ఏడ్స్ పరిశోధనా కృషిని కేవలము ప్రయోగ శాలకి మాత్రమే పరిమితి చేసికోలేదు.

ఆమె ఏడ్స్ రోగులను కలుసుకొంటూ వారి అనుభవాలను, ఆంకాక్షలనూ వింటూ దేశ పర్యాటనలను చేసింది ."ఏడ్స్ రోగులను నాకుగా నేను నేరుగా




Luc Montagnier, Françoise Barré-Sinoussi and Jean-Claude Chermann, the French scientists who helped discover the causes of AIDS, in their laboratory of Pasteur Institute in Paris, 1984
Michel Clement / AFP / Getty Images

కలసికొని వారితో సంభాషించడానికి ప్రయత్నించ వలసిన నాకు అవసరం లేకపోయింది. ఎందుకంటే ఆవ్యాధి పీడుతులు పాస్చర్ యిన్ స్టిటూట్ కి తాము హెచ్ ఐ వి పోసటీవ్ అని చెప్పుకొంటూ వచ్చేవారు. నన్ను చూడడానికి వచ్చే ఆవ్యాధి పీడుతులు నన్నొక వైద్యు రాలిగా ఎంచి రాలేదు.

మేము వారికేవిధమైన చికిత్స అందించడానికి ఏమి చేయబోతున్నామొ తెలుసుకోవాలని వచ్చే వారు. ఈ అంశంమీద పరిశోధన చేయడానికి వారు నాకు ఒక స్ఫూర్తిగా నిలిచారు.” అని సిన్నోసి చెప్పింది. ఆమె వారిని కలిసినప్పుడు తమ జబ్బుకొక చికిత్స కావాలని అడిగే వారుట! వైజ్ఞానిక పరిశోధకులుగా అటువంటి చికిత్సా విధానాన్ని రూపొందించడం మా ధర్మం అని సిన్నోసి అంటుంది. ఇంటర్నేషనల్ ఏడ్స్ సొసైటి ప్రెసిడెంట్ హోదాలో ఆమె 2010 లో “Towards a HIV Cure” Initiative ని ఆరంభించింది.

హెచ్ ఐ వి అంటు వ్యాధిని నయం చేయడం సాధ్యమవుతుందా అని అడిగిన ప్రశ్నకు సిన్నోసి “వ్యాధి లక్షణాలు తిరుగుముఖం పట్టించి వుదృతిని తగ్గించి తద్వరా వారు పొందే ఉపశమనాన్ని కొనసాగేలా చేయగల చికిత్సను అందించగలమే కానీ , దానిని పూర్తిగా నయం చేయడం సాధ్యంకాదని వ్యక్తిగతంగా నేను నమ్ముతున్నాను.” అని చెప్పింది.






1990 లలో హైలీ యాక్టీవ్ యాంటి రెట్రొ వైరల్ థెరపి [ highly active antiretroviral therapy (HAART)] ని సాధించగలిగాక ఫార్మసీటికల్ కంపెనీలు ముందుకు రావడం తో ఏడ్స్ వ్యాధి అదుపు చేయాలని సంకల్పించిన కార్యకర్తలకు మంచి ఊపు లభించింది. బీదాతి బీద దేశాల నుండి అత్యంత ధనిక దేశాల ఏడ్స్ రోగులకు ఈ చికిత్స అందుబాటులో వుంచాలని పట్టు పట్టారు. 1996కి ముందు ఇటువంటి చికిత్స వుండేదికాదు. ఈ చికిత్స విధానం ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్ ఏడ్స్ భాధితులకు ఉపసమనం అందించే అవకాశముందన్న ఆశను కల్పించింది; చి కిత్స అందిన ఏడ్స్ రోగుల ఆయుష్షు 15 సంవత్సరాలు పెరిగింది. ఈ నాడు అనేకులు హెచ్ ఐ వి పాసిటీవ్ అయినా వారి శరీరంలో ఇతరులకు దానిని సంక్రమింపజాలని స్థాయిలో వుంటూండగా జీవిస్తున్నారు. వైరస్ మాత్రమూ పోలేదు. వైరస్ అంత మొండిగా వదలి పోకుండా వుండడానికి కారణాలను తెలిసికోవలసివుంది ; ఆదిశగా కూడా పరిశొధనలు జరగాలి.



Vietnamese puppets donated by Françoise Barré-Sinoussi to the Nobel Prize Museum. Barré-Sinoussi received these as a gift when visiting Vietnam to develop an official partnership with authorities
© Nobel Prize Museum, Photo: Karl Anderson

## References for further reading

1. An Inspiring Journey of Hope and Persistence: Life Lessons with Françoise Barré-Sinoussi
2. https://www.pasteur.fr/en/institut-pasteur/history/francoise-barre-sinoussi
3. International AIDS Society https://www.iasociety.org › francoise-barre-sinoussi
4. Françoise Barré-Sinoussi's Discovery of HIV

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 1 జనవరి-మార్చి 2024

మమత-సమత-మానవత
www.gurajada.org



# ధన్యోస్మి

జనవరి–మార్చ్ 2024 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు. అంతగా సహకరించని ఆరోగ్యాన్ని బుజ్జగించి ప్రకాశిక కోసం రాజ్యాంగం మీద ఒక ప్రత్యేక వ్యాసం రాసిన ఆచార్య మాడభూషి శ్రీధర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

కుటుంబ పరంగా ఎంతో క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటున్నా కూడా, ఈ సంచిక వెలువరించడంలో ఎంతో సాయం చేయడమేగాక, ఎప్పుడో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంకోసం ఆయన సతీమణితో కలిసి గురజాడ రాసిన "మాటల మబ్బులు" కవితకి వ్యాఖ్యానం రాసి పంపినందుకు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

గత మూడు సంవత్సరాలుగా ప్రకాశిక సంపాదక వర్గ సభ్యులుగా ఉండి సేవలు అందించిన శ్రీ మాశర్మ గారికి, డా. అనంత పద్మనాభ రావు గారికి, డా. నాగసూరి వేణుగోపాల్ గారికి, డా. భవానీ దేవి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి.

భవదీయుడు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

ప్రధాన సంపాదకులు


ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 4 | సంచిక 1 జనవరి-మార్చి 2024

మమత-సమత-మానవత
www.gurajada.org

## బాపూ



నిన్ను భారత జాతిపిత అని ఆరాధిస్తా
బాపూ, నేను గాంధేయుడను కాలేను
నిజం చెప్పలేను, అసత్యాన్ని నిరసించలేను
హింసని ఖండించలేను, అహింసని  ఆదరించలేను
అవినీతి నాయకుల భజన మానలేను, అనైతికతను
నిరసించలేను
బాపూ, నేను గాంధేయవాదిని, గాంధేయుడను కాలేను

ఖరీదైన బట్టలు వదలలేను, చేనేతకి చేయూతనివ్వలేను
సరళ జీవనం నామోషి,
నెలవారీ వాయిదాల విలాసం వదలలేని అల్పసమాజ పక్షిని
బాపూ, నిన్ను ఆరాధిస్తాను కానీ గాంధేయుడను కాలేను

సర్వ ధర్మ సమానతా సూక్తి వల్లిస్తా
నా మతమే గొప్పదని నినదిస్తా
స్త్రీ శక్తిని స్తుతిస్తా, స్త్రీని చులకన చేసే సమాజంలో  నివసిస్తా
నీ గురించి రాస్తా, ఉపన్యసిస్తా, నిన్ను పొగడ్తలతో ముంచేస్తా

నీ ఆశయాలకు వారసుడను కాలేను
నీ స్మృతిని చెరిపేస్తున్న నేతల చర్యలను నిరసించలేను
మాటలకు మాత్రం పరిమితమైన, పేరుకోసం తపించే మేధావిని
నీ పేరిట నాలుగు మాటలు రాస్తూ రచయితగా వెలుగొందనీ మహాత్మా

నీ సమాధికి నడిచొస్తా, నీ మాటలు వేదోక్తులని కీర్తిస్తా
నీ తిథికి ఒక నిముషం మౌనం, రెండు పూరేఖలూ అర్పిస్తా
నిన్ను వేనోట్ల నుతిస్తా, నిన్ననుసరించలేను బాపూ
నేను నవ సమాజపు అర్భక పౌరుడను
నేను గాంధేయుడను కాలేను, గాంధీ భక్తుడిగా ఉండనీ బాపూ

– ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ